www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మళ్లీ తెరపైకి గాడిద గుడ్డు! 3

తెలంగాణకు బీజేపీ ఇచ్చింది.. 'గాడిద గుడ్డు!' అంటూ కాంగ్రెస్ ఫ్లెక్సీలు

గురువారం | 25-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 100 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా. 1.58 తదుపరి షష్ఠి నక్షత్రం: పూర్వాభాద్ర సా. 4.16 తదుపరి ఉత్తరాభాద్ర వర్జ్యం: రా. 1.09-2.38; దుర్ముహూర్తం: ఉ. 10.13-11.04, మ. 3.21-4.12; అమృతఘడియలు: ఉ. 8.55-10.23; రాహుకాలం: మ. 1.30-3.00, సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.47 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తీరని అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీల ఊసే లేదు

తెలంగాణకు మొండి చెయ్యి

నిరసనగా నీతిఆయోగ్ భేటీని బహిష్కరిస్తాం

రాష్ట్రం నుంచి రూపాయి పన్ను వెళ్తే..

బడ్జెట్‌లో తిరిగిచ్చేది 43 పైసలే

ఎంపీలతో పార్లమెంట్‌లో నిరసన తెలుపుతాం

బడ్జెట్‌ను సవరించి న్యాయం చేయాలి

నేను ఇక్కడ కూర్చోవడం కొందరికి నచ్చట్లేదు

కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు

ఎవరినో పెద్దన్నా అంటే నాకు పదవి రాలేదు

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, కేటీఆర్

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ప్రయోజనాల కోసం 18 సార్లు ఢిల్లీ వెళ్లాను. మూడు సార్లు ప్రధానిని కలిశాను. కేంద్ర మంత్రులను కూడా కలిసి.. తెలంగాణకు నిధులివ్వాలని విజ్ఞప్తి చేశాను. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం ఆఖరి నిమిషం వరకు ప్రయత్నం చేశాను. అయినా.. ప్రయోజనం శూన్యం. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై తీవ్ర వివక్ష చూపింది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా.. కేంద్రం తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించనందుకు నిరసనగా బుధవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి ముందు

మిగతా 13వ పేజీలో...

రేవంత్ X కేటీఆర్! 13

కేసీఆర్ వస్తే.. ఢిల్లీలో దీక్షకు నేను సిద్ధం

నిధులు తెచ్చుడో.. అవసరమైతే చచ్చుడో

అయ్యపేరు, తాతపేరు చెప్పుకొని రాలేదు

స్వయంకృషితో ఎదిగా.. సీఎం కుర్చీలో కూర్చున్నా

నిధులు వద్దని, మీ ప్రేమ ఉంటే చాలునని

మోదీకి కేసీఆర్ ఊడిగం చేయలేదా?: రేవంత్

పేమెంట్ కోటాలో సీఎం అని మేమూ అనగలం

పదవుల కోసం రేవంత్‌రెడ్డి పార్టీలు మారారు

మేం రాష్ట్రం కోసం పదవులు వదులుకున్నాం

ఢిల్లీలో బీజేపీతో సీఎం రేవంత్‌కు దోస్తీ: కేటీఆర్

సమాఖ్య స్ఫూర్తిని విస్మరించిన

మోదీ సర్కారు

రాష్ట్రానికి అన్యాయంపై అసెంబ్లీలో తీర్మానం

ఏకగ్రీవంగా ఆమోదం.. బీజేపీ వాకౌట్



పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితర విపక్ష ఎంపీలు

విపక్ష రాష్ట్రాలపై వివక్ష

భారత సమాఖ్య వ్యవస్థ పవిత్రతపై దాడి

కేంద్ర బడ్జెట్‌పై 'ఇండియా' ఆగ్రహం

పార్లమెంటు నుంచి వాకౌట్

ప్రాంగణంలో ఎంపీల నిరసన

పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు

'మాతాజీ' మాటల నేర్పరి

బీజేపీని తిరస్కరించిన రాష్ట్రాలకు

బడ్జెట్‌లో మొండిచెయ్యి

ఆ రెండు రాష్ట్రాలకే విందు: ఖర్గే

రాష్ట్రం పేరు చెప్పకపోతే నిధులు రావా?

వ్యయ ప్రకటన చదివితే వాస్తవాలు

తెలుస్తాయ్: నిర్మలా సీతారామన్

27న నీతి ఆయోగ్ సమావేశాన్ని

బహిష్కరించనున్న కాంగ్రెస్ సీఎంలు

న్యూఢిల్లీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపుల ప్రకంపనలు పార్లమెంటును కుదిపేశాయి. ఇది 'కుర్సీ బచావో' బడ్జెట్ అని, ప్రధాని మోదీ తన పదవిని కాపాడుకునేందుకే మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ పాలిస్తున్న ఏపీ, బిహార్‌లకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారని.. మిగతా రాష్ట్రాలపై ముఖ్యంగా ప్రతిపక్షాల పాలనతో ఉన్న రాష్ట్రాలపై తీవ్ర వివక్ష చూపారని విపక్ష ఇండియా కూటమి బుధవారం ఆరోపించింది. ఏ రాష్ట్రానికీ న్యాయం చేయలేదని.. ఇది భారత సమాఖ్య వ్యవస్థ పవిత్రతపైనే దాడిగా అభివర్ణిస్తూ.. ఉభయసభల నుంచి కూటమి ఎంపీలు వాకౌట్ చేశారు. ఉదయం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో.. బడ్జెట్ కేటాయింపుల అంశాన్ని లేవనెత్తేందుకు విపక్ష సభ్యులు యత్నించారు. ప్రశ్నోత్తరాలను అడ్డుకోవద్దని స్పీకర్ ఓం బిర్లా కోరారు. పథకం ప్రకారమే సభ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని తప్పుబట్టారు. సభ్యులు సభలోకి రాకుండా

మిగతా 2వ పేజీలో...

తెలంగాణ రైల్వే బడ్జెట్ 5,336 కోట్లు

40 స్టేషన్ల ఆధునికీకరణ, రైల్వేమార్గాల విద్యుదీకరణ పూర్తి

రూ.32,946 కోట్లతో 2,298 కి.మీ. కొత్త లైన్లు 14

437 ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలు: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

నేడే అసెంబ్లీలో బడ్జెట్

మధ్యాహ్నం12కు ప్రవేశపెట్టనున్న భట్టి

రూ. 2.8–2.9 లక్షల కోట్ల మేర భారీ పద్దు

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కంటే కాస్త పెరుగుదల

వ్యవసాయ రంగానికే అధిక నిధుల కేటాయింపు

మండలిలో ప్రవేశపెట్టనున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఉదయం 9కి క్యాబినెట్ భేటీ.. బడ్జెట్‌కు ఆమోదముద్ర



హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురువారం శాసనసభలో 2024-25 సంవత్సరానికిగాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ప్రతిష్ఠాత్మక పథకాలు, ఆరు గ్యారెంటీలకు నిధుల కేటాయింపు, సబ్సిడీలు, అప్పుల కిస్తీల చెల్లింపు, ఉద్యోగుల వేతనాలు వంటి అన్ని అంశాలనూ పరిగణలోకి తీసుకుని.. దాదాపు రూ.2.8 లక్షల కోట్ల నుంచి రూ.2.9 లక్షల కోట్ల మధ్య బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిసింది. గురువారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని కమిటీ హాల్-1లో జరగనున్న భేటీలో బడ్జెట్‌కు క్యాబినెట్ ఆమోద ముద్ర వేయనుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క.. మధ్యాహ్నం 12 గంటలకు శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. శాసన మండలిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈసారి కేంద్రం నుంచి ప్రత్యేక గ్రాంట్లు వస్తే.. బడ్జెట్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచించింది. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బీఆర్‌జీఎఫ్) కింద రూ.2,250 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు, పాలమూరు-రంగారెడ్డి సాగునీటి పారుదల ప్రాజెక్టుకు కేంద్ర పథకాల కింద నిధులు వస్తాయని ఆశించింది. ఈ నిధులతో కలిపి రాష్ట్ర బడ్జెట్‌ను పెంచాలనుకున్నది. కానీ.. కేంద్ర ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...

అసెంబ్లీకి కేసీఆర్!

ప్రతిపక్ష నేత హోదాలో నేడు తొలిసారి

బడ్జెట్ సమావేశాలకు హాజరు కానున్న బీఆర్ఎస్ అధినేత

వెల్లడించిన పార్టీ వర్గాలు 13

ఆగస్టు 2 వరకు బడ్జెట్ సమావేశాలు!

పలు బిల్లుల ఆమోదం దృష్ట్యా పొడిగింపు




డొనాల్డ్ ట్రంప్‌పై

కమల పైచేయి!

ఓటర్లలో పెరుగుతున్న ఆదరణ

అధ్యక్ష ఎన్నికల్లో గెలిచే అవకాశం


వెల్లడిస్తున్న ప్రీ పోల్ సర్వేలు

వాషింగ్టన్, జూలై 24: అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకోవటంతో ముందుకొచ్చిన కమలా హ్యారిస్.. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించి చరిత్ర సృష్టించే అవకాశం ఉందని ప్రీపోల్ సర్వేలు వెల్లడిస్తున్నాయి. రాయిటర్స్, ఇప్సాస్ సంస్థలు మంగళవారం నిర్వహించిన పోల్‌లో.. ట్రంప్‌నకు 42 పాయింట్లు లభించగా, కమలకు 44 లభించాయి. పీబీఎస్ న్యూస్, ఎన్‌పీఆర్,

మిగతా 2వ పేజీలో...

చందమామపై నీటి జాడలు!

చంద్రుడి నుంచి తెచ్చిన మట్టిలో గుర్తించిన చైనా శాస్త్రవేత్తలు



బీజింగ్, జూలై 24: చైనా శాస్త్రవేత్తలు చందమామపై నీటి జాడలు గుర్తించారు. 2020లో చైనా చేపట్టిన చాంగ్‌ఈ-5 మిషన్‌లో భాగంగా చంద్రుడి ఉపరితలం నుంచి తీసుకొచ్చిన మట్టిలో నీటి అణువులను కనుగొన్నారు. ఆ మట్టిలో వెయ్యికి పైగా అణు నిర్మాణాలను గుర్తించిన శాస్త్రవేత్తలు వాటిల్లో స్ఫటికల్లా ఉన్న అన్‌నోన్ లునార్ మినరల్ (యూఎల్ఎం-1)లో నీటి అణువులను గుర్తించారు. ఆ నీటి అణువులు రాకెట్ల నుంచి వెలువడిన పొగ వంటి భూసంబంధ కారకాల వల్ల ఏర్పడినవి కాదని కూడా తేల్చారు. బీజింగ్ నేషనల్ ల్యాబొరేటరీ, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్)కు చెందిన శాస్త్రవేత్తలు చంద్రుడి నుంచి తెచ్చిన మట్టిపై ఉమ్మడిగా చేసిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. నేచర్ ఆస్ట్రోనమీ

మిగతా 2వ పేజీలో...

8 ఏళ్ల అంధ బాలికపై

అత్యాచారం

మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల హాస్టల్‌లో దారుణం 3

ఘోరానికి ఒడిగట్టింది అక్కడ బాత్రూంలు శుభ్రంచేసే వాడే

తెలిసినా నిర్వాహకుల నిర్లక్ష్యం

తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే పట్టించుకోని పోలీసులు

నిలోఫర్ వైద్యులు చెప్పడంతో కదలిక.. నిందితుడి అరెస్టు



తెలంగాణకు ఎంతో చేశాం..

ఇంకా చేస్తాం

అమరావతికి నిధులిస్తే వచ్చిన ఇబ్బందేంటి?

కొత్తగా సీఎం అయ్యారు.. సంయమనంతో ఉండండి

కేసీఆర్ బాటలోనే రేవంత్ ముందుకు వెళ్తున్నారు

పదవి కోసం పార్టీ మారే వ్యక్తిని కాదు.. హామీలు నెరవేర్చని రేవంతే రాజీనామా చేయాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి గడిచిన పదేళ్లలో ఎంతో చేశామని, భవిష్యత్తులోనూ మరెంతో చేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ కోసమో.. రేవంత్ రెడ్డి కోసమే తాము పనిచేయబోమని, 4 కోట్ల తెలంగాణ ప్రజలు, అమరుల ఆశయ సాధన కోసం పనిచేస్తామని చెప్పారు. బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలోని 33 జిల్లాలకు 33 వేర్వేరు ప్రాజెక్టులు రాష్ట్ర బడ్జెట్లో ఇస్తారా అని ప్రశ్నించారు. ఏపీని ప్రత్యేక పరిస్థితి కింద పరిగణించి నిధులిచ్చామని చెప్పారు. అమరావతికి నిధులిస్తే వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కొత్తగా ముఖ్యమంత్రి అయ్యారని, సంయమనంతో పనిచేయాలని, అప్పుడే ఇంత ఉలికిపాటు ఎందుకని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ దారిలో

మిగతా 3వ పేజీలో...

12

ఏపీకి హోదా ఇవ్వకపోవడం ద్వారా తెలంగాణకు మోదీ మేలు చేశారు

అందుకోసం ఆయనకు క్షీరాభిషేకం చేయాలి: బీజేపీ పక్ష నేత ఏలేటి

దగ్గు మందులు

నాసిరకం!

నాణ్యతా పరీక్షల్లో 100కుపైగా ఔషధ కంపెనీల మందులు విఫలం

హానికారక పదార్థాల జాడలు

వెల్లడించిన కేంద్ర ప్రభుత్వ నివేదిక 2



కుప్పకూలిన విమానం

నేపాల్‌లో ఘటన.. పైలట్ మినహా మిగిలిన 18 మంది దుర్మరణం

మృతులంతా శౌర్య ఎయిర్‌లైన్స్ సిబ్బంది

నిర్వహణ తనిఖీలో భాగంగా ప్రయాణం



వరద నీటితో నిండుకుండలా తుంగభద్ర డ్యాం

తుంగభద్రకు

మళ్లీ పెరిగిన వరద

91,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..లోతట్టు ప్రాంతాల అప్రమత్తం

ఆల్మట్టికి 2 లక్షలు, జూరాలకు 1.80 లక్షల క్యూసెక్కుల వరద

భద్రాచలంలో తగ్గిన నీటిమట్టం

పలు జిల్లాల్లో ముసురు వానలు

ప్రాణహిత బ్యాక్‌వాటర్‌తో ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పంట మునక

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కర్ణాటక-ఏపీ-తెలంగాణల ఉమ్మడి జలాశయం తుంగభద్ర జలాశయానికి వరద మళ్లీ పెరిగింది. తుంగ, వార్దా నదుల నుంచి ప్రవాహం పెరుగుతుండటంతో బుధవారం లోతట్టు ప్రాంతాలను తుంగభద్ర బోర్డు అప్రమత్తం చేసింది. 91,222 క్యూసెక్కుల వరద రాగా గేట్ల ద్వారా 20 వేల క్యూసెక్కులను దిగువకు

మిగతా 3వ పేజీలో...

చందమామపై నీటి జాడలు!

(మొదటి పేజీ తరువాయి)

అనే పరిశోధన పత్రంలో పేర్కొన్న ఆ వివరాలపై హాంకాంగ్ కేంద్రంగా పని చేసే సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ అనే వారపత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. చాంగ్‌ఈ తీసుకొచ్చిన మట్టిలోని స్ఫటికాల్లాంటి అణువుల్లో శాస్త్రవేత్తలు నీటి జాడలను గుర్తించారని పేర్కొంది. కాగా, చాంగ్‌ఈ5 సహా గతంలో వివిధ దేశాలు చేపట్టిన అదే తరహా పది ప్రయోగాల్లో భూమికి సమీపంలో ఉన్న చంద్రుడి ఉపరితలంపైనే పరిశోధనలు జరిగాయి. అయితే, చైనా చేపట్టిన మరో ప్రయోగం చాంగ్‌ఈ-6 మిషన్.. చంద్రుడి ఆవలి వైపు నుంచి సేకరించిన రెండు కిలోల నమూనాలను గత నెలలో భూమికి పంపించింది. ఈ నమూనాలను కూడా పరిశోధించిన తర్వాతే చంద్రుడిపైన ఉన్న పరిస్థితులపై సమగ్ర అవగాహన ఏర్పడుతుందని సీఏఎస్‌కు చెందిన ఓ శాస్త్రవేత్త పేర్కొన్నారు. కాగా, 2009లో భారత్ చేపట్టిన చంద్రయాన్-1 ప్రయోగం ద్వారా చంద్రుని ఉపరితలంపై ఆక్సిజన్, హైడ్రోజన్ అణువుల రూపంలో నీటి జాడలు ఉన్న ఖనిజాలు ఉన్నట్టు తేలింది. చంద్రుని దక్షిణ ధ్రువంపై ఉన్న అతి పెద్ద బిలంలో సూర్యరశ్మి తగిలే ప్రాంతంలో నీటి జాడలను గుర్తించామని 2020లో నాసా కూడా ప్రకటించింది.

నీట్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ తీర్మానం

కోల్‌కతా, జూలై 24: నీట్‌ను వ్యతిరేకిస్తూ మరో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. ఇప్పటికే తమిళనాడు అసెంబ్లీ ఈ మేరకు తీర్మానం చేయగా.. తాజాగా పశ్చిమ బెంగాల్ ఆ జాబితాలో చేరింది. నీట్ స్థానంలో మునుపటిలా రాష్ట్రాలే పరీక్ష నిర్వహించుకునే విధానాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం పశ్చిమబెంగాల్ అసెంబ్లీ తీర్మానం చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, అక్రమాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడం.. వీటిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని మంగళవారం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి రోజే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ నీట్ రద్దుకు తీర్మానం చేయడం గమనార్హం. గతంలో తమిళనాడు అసెంబ్లీ కూడా ఇదే తరహాలో నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసింది.

దేశం విడిచి వెళ్లాలంటే బ్లాక్ మనీ ఎన్వోసీ తప్పనిసరి

ముంబయి, జూలై 24: దేశాన్ని శాశ్వతంగా విడిచి వెళ్లాలనుకొనేవారికి అవసరమైన నిరభ్యంతర ధ్రువపత్రాల సంఖ్య పెరిగింది. ఈమేరకు కేంద్ర బడ్జెట్‌లో నిబంధనలను కఠినతరం చేస్తూ పేర్కొన్నారు. ఇకపై దేశాన్ని విడిచి వెళ్లాలనుకొనే వారు నల్లధనం చట్టం కింద కూడా నిరభ్యంతర ధ్రువపత్రం సమర్పించాలి. అక్టోబరు 1 నుంచి ఇది అమలులోకి రానుంది. ప్రస్తుతం ఐటీ చట్టం సెక్షన్ 230 ప్రకారం దేశాన్ని విడిచి వెళ్లాలనుకొనేవారు ఎటువంటి పన్ను బకాయిలు లేరని లేదా పన్ను బకాయిలకు తగిన ఏర్పాట్లు చేశారని ఆదాయం పన్ను శాఖ అధికారుల నుంచి ధ్రువపత్రం తెచ్చుకోవాల్సి ఉంది. తాజాగా నల్లధనం చట్టం కింద కూడా నిరభ్యంతర ధ్రువపత్రం తీసుకోవాలని నిబంధన విధించారు. దీనికి సంబంధించి నోటిఫికేషన్ వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

సింగపూర్ పాస్‌పోర్టు పవర్‌ఫుల్

న్యూఢిల్లీ, జూలై 24: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్ కలిగిన దేశాల జాబితాలో సింగపూర్ మళ్లీ అగ్రస్థానం దక్కించుకుంది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ అనే సంస్థ తాజాగా విడుదల చేసిన ఈ జాబితాలో భారత్ మూడు స్థానాలు మెరుగై 82వ స్థానానికి చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత్ 85వ స్థానంలో నిలిచింది. భారత పాస్‌పోర్టు ఉన్నవారిని వీసా లేకుండా 58 దేశాలకు అనుమతిస్తారు. భారత్‌తోపాటు సెనెగల్, తజికిస్థాన్ కూడా 82వ స్థానంలో నిలిచాయి. ఈ జాబితాలో సింగపూర్ తన టాప్ ర్యాంకును నిలబెట్టుకుంది. సింగపూర్ పాస్‌పోర్టుతో 195 దేశాలకు వీసా లేకుండా వెళ్లవచ్చు. ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన పాస్‌పోర్టుగా అఫ్ఘానిస్థాన్ నిలిచింది. ఈ దేశ పాస్‌పోర్టు కలిగిన పౌరులు 26 దేశాలకు మాత్రమే వీసా లేకుండా వెళ్లగలరు.

ఆర్టీఐ కింద చీతాల ప్రాజెక్టు సమాచారం ఇవ్వలేం!

న్యూఢిల్లీ, జూలై 24: చీతాల ప్రాజెక్టు సమాచారం ఇవ్వడానికి మధ్యప్రదేశ్ అటవీ శాఖ నిరాకరించింది. వన్యప్రాణి సంరక్షణ కార్యకర్త అజయ్ దూబే... సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద చేసిన దరఖాస్తును తోసిపుచ్చింది. ఈ సమాచారం వెల్లడిస్తే దేశ భద్రత, విదేశాలతో సంబంధాలపై ప్రభావం పడుతుందని పేర్కొంది. నమీబియా నుంచి తెచ్చిన 8 చీతాలను 2022 సెప్టెంబరు 17న ప్రధాని మోదీ చేతులమీదుగా మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో విడిచిపెట్టారు. తర్వాత గత ఏడాది ఫిబ్రవరిలో అధికారులు దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన మరో 12 చీతాలను విడుదల చేశారు. చీతాలు వరుసగా చనిపోతుండడంతో ఈ ప్రాజెక్టుపై తీవ్ర విమర్శలు వచ్చాయి.

ప్రతీకారం తీర్చుకునేలా పాలన వద్దు: స్టాలిన్

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): 'ప్రతీకారం తీర్చుకునేలా పరిపాలన వద్దు. రాజకీయంగా మీ ఇష్టాయిష్టాల ప్రకారం ప్రభుత్వాన్ని నడిపితే మీరు ఒంటరి అవుతారు' అంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి హితవు పలికారు. ఈ మేరకు ఆయన బుధవారం సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ఆర్థిక నివేదికలో కొన్ని రాష్ట్రాలు మినహా పలు రాష్ట్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయంటూ 'ఇండియా' కూటమి ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. "ఎన్నికలు ముగిశాయి, ఇప్పుడు దేశం గురించి ఆలోచించాలని స్వయంగా మీరే అన్నారు. కానీ, నిన్నటి బడ్జెట్ మీ పాలనను కాపాడుతుందే కానీ, దేశాన్ని కాదు" అని స్టాలిన్ పేర్కొన్నారు.

జమ్మూలో కాల్పులు... జవాను మృతి

శ్రీనగర్, జూలై 24: జమ్మూకశ్మీర్ పూంచ్ జిల్లాలోని బట్టల్ సెక్టార్‌లో భద్రతా బలగాలకు, తీవ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ జవాను మృతిచెందారు. మంగళవారం తెల్లవారుజామున బట్టల్ సెక్టార్‌లో టెర్రరిస్టులు చొరబాటును అడ్డుకునే క్రమంలో ఈ ఘటన జరిగింది. చనిపోయిన జవాను లాన్స్ నాయక్ సుభాశ్ చందర్‌గా గుర్తించారు. అంతకుముందు సోమవారం రాజౌరీ జిల్లాలో ఆర్మీ క్యాంపుతో పాటు ఓ అధికారి నివాసంపై తీవ్రవాదులు జరిపిన దాడుల్ని సైన్యం తిప్పికొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు టెర్రరిస్టులు మృతిచెందగా, ఓ సైనికుడు మరో పౌరుడు గాయాలపాలయ్యారు.

యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, జూలై 24: పరువు నష్టం కేసులో ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. ముంబై బీజేపీ అధికార ప్రతినిధి సురేశ్ ఖరంషీ నఖువా ఈ పిటిషన్ దాఖలు చేశారు. జూలై 7న ధ్రువ్ రాఠీ తన యూట్యూబ్ చానెల్‌లో 'గోడీ యూట్యూబర్లకు నా జవాబు' పేరిట ఓ వీడియో పోస్టు చేశాడు. హింసావాదులు, దూషణలతో ట్రోల్ చేసే అంకిత్ జైన్, సురేశ్ నఖువా, తాజిందర్ బగ్గా వంటి వారిని కూడా ప్రధాని మోదీ తన అధికారిక నివాసంలో కలిశారని అందులో పేర్కొన్నాడు. అయితే ఏ ఆధారాలు లేకుండా అరాచకవాది, దూషణపరుడంటూ నిందించడం తన పరువుకు భంగం కలిగించడమేనంటూ సురేశ్ నఖువా పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఒక్కరోజే 2 వేలమంది ఉక్రెయిన్ సైనికులు హతం: రష్యా

మాస్కో, జూలై 24: ఉక్రెయిన్‌తో యుద్ధంలో భాగంగా మంగళవారం ఒకే రోజు ఆ దేశానికి చెందిన 2 వేల మంది సైనికులను మట్టుబెట్టినట్లు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. డాన్‌బాస్ ప్రాంతమైన డోనెట్స్క్ ప్రావిన్స్‌లోని ఇవానో-డారివ్కా నగరాన్ని హస్తగతం చేసుకున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. గత వారం 13 వేల మంది, అంతకు ముందు వారం 14 వేల మంది ఉక్రెయిన్ సైనికులను హతమార్చినట్లు వివరించింది. కాగా.. సిరియాపై రష్యా జరిపిన క్షిపణి దాడిలో.. నాటోకు చెందిన బంకర్ ధ్వంసమైనట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది.

విపక్ష రాష్ట్రాలపై వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

విపక్ష ఎంపీలు మెట్ల వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్నారని ఆయనతో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రస్తావించారు. కేటాయింపుల అంశాన్ని ప్రస్తావించనివ్వడం లేదంటూ విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. రాజ్యసభలోనూ విపక్ష పాలిత రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడంపై ఇండియా కూటమి సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 267 నిబంధన కింద ప్రశ్నోత్తరాలు, ఇతర ఎజెండాను సస్పెండ్ చేసి ఈ అంశంపై చర్చించాలని నోటీసు ఇచ్చారు. దానిని సభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. '2024-25 బడ్జెట్‌లో బిహార్, ఆంధ్రకు మాత్రమే నిధులు, పథకాలు ఇచ్చారు. మిగతా రాష్ట్రాల ప్రస్తావనే లేదు. ఈ బడ్జెట్ 'కుర్సీ బచావో డాక్యుమెంట్' అని ఆరోపించారు. ఈ వివక్షను కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పార్టీలు ఖండిస్తున్నాయన్నారు. దీనిపై స్పందించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు చైర్మన్ అవకాశమిచ్చారు. ఆమె మాట్లాడేందుకు లేవగానే విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. వారి ఆరోపణలు దారుణమని నిర్మలా సీతారామన్ ఆక్షేపించారు. బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రాల పేర్లు ప్రస్తావించనంత మాత్రాన విస్మరించినట్లు అవుతుందా అని ప్రశ్నించారు. తమ రాష్ట్రాలకు మోదీ ప్రభుత్వం ఏమీ చేయలేదని ప్రజల్లో నాటేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. తాజా బడ్జెట్‌లోనే కాదని.. ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు కూడా తాను చాలా రాష్ట్రాల పేర్లు ప్రస్తావించలేదన్నారు. దానర్థం కేంద్ర పథకాలు ఆ రాష్ట్రాల్లో అమలు కావడం లేదనా అని నిలదీశారు. ఈ రెండు బడ్జెట్లలో మహారాష్ట్ర పేరును కూడా తాను ప్రస్తావించలేదని.. అయినా ఆ రాష్ట్రంలో రూ.76 వేల కోట్ల భారీ పెట్టుబడితో వధావన్ పోర్టు ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించిందని గుర్తుచేశారు. 'ఫలానా రాష్ట్రం పేరు బడ్జెట్‌లో ప్రస్తావించలేదని.. కేంద్రప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రపంచబ్యాంకు, ఏడీబీ, ఏఐఐబీ తదితర ఆర్థిక సంస్థల ద్వారా అమలు చేసే విదేశీ రుణ సాయం ప్రాజెక్టులు (ఈఏపీ) ఈ రాష్ట్రాలకు రావా? ప్రభుత్వం ఇచ్చిన వ్యయ ప్రకటన చూస్తే దేనికెంత కేటాయింపులు జరిపారో తెలుస్తుంది. దమ్ముంటే గతంలో కాంగ్రెస్ ఆర్థిక మంత్రులు చేసిన బడ్జెట్ ప్రసంగాలను ఇవ్వండి. వాటిలో ప్రతి రాష్ట్రం పేరును వారు ప్రస్తావించారా? ఇది దారుణమైన ఆరోపణ. ఆమోదనీయం కాదు' అని స్పష్టం చేశారు. వాకౌట్ చేసిన కొందరు టీఎంసీ ఎంపీలు ఇదే సమయంలో సభలోకి వచ్చారు. బెంగాల్‌కు ఏమీ ఇవ్వలేదని వారు ఆరోపించారని.. ప్రధాని మోదీ గత పదేళ్లలో ప్రారంభించిన చాలా పథకాలు ఆ రాష్ట్రంలో అమలు కావడం లేదని నిర్మల తెలిపారు. టీఎంసీ ఎంపీలు ఖండించారు. తమ రాష్ట్రానికి కేంద్రం రూ.లక్ష కోట్ల బకాయి ఉందని ఆరోపించారు.



మాటల్లో నిర్మల ఎక్స్‌పర్ట్

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా నిర్మలపై ఖర్గే విమర్శలు సంధించారు. ఆమెను 'మాతాజీ' అని సంబోధించారు. 'మాతాజీ మాటలు చెప్పడంలో నేర్పరి అని నాకు తెలుసు' అని ఎద్దేవాచేశారు. చైర్మన్ ధన్‌ఖడ్ స్పందిస్తూ.. నిర్మలను అమ్మలా కాకుండా కుమార్తెగా చూడాలని ఖర్గేకు సూచించారు. ప్రతిపక్ష నేత తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. దేశ అవసరాల కోసం కాకుండా.. ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం బడ్జెట్ పెట్టారని ధ్వజమెత్తారు. 'మోదీ సర్కారు బడ్జెట్‌లో ఏ రాష్ట్రానికీ ప్రయోజనం కలుగలేదు. తమిళనాడు, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రధాన రాష్ట్రాలను విస్మరించారు. ఎన్నికల్లో బీజేపీని తిరస్కరించిన రాష్ట్రాలకు ఏమీ ఇవ్వలేదు. ప్రతి వారి ప్లేటు ఖాళీ. రెండు రాష్ట్రాల ప్లేట్లలో మాత్రం పకోడీ, జిలేబీ పెట్టారు. ఇలాంటి బడ్జెట్ నేను ఇప్పటివరకు చూడలేదు' అని ఎద్దేవాచేశారు.

పార్లమెంటు మెట్ల వద్ద విపక్ష ఎంపీల నిరసన

బుధవారం పార్లమెంటు మకర ద్వారం మెట్ల వద్ద విపక్ష ఎంపీలు నిరసనకు దిగారు. ఇతర రాష్ట్రాలను విస్మరించడం.. భారత సమాఖ్య పవిత్రతపైనే దాడి అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ సందర్భంగా విమర్శించారు. ఈ నిరసనలో ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియాగాంధీ, ఉభయసభల్లో ఆ పార్టీ ఉపనేతలు ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగోయ్, సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఎన్‌సీపీ (ఎస్‌సీపీ) నాయకుడు శరద్ పవార్, శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్, టీఎంసీ, డీఎంకే. జేఎంఎం, ఆప్, సీపీఎం తదితర విపక్ష ఎంపీలు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ భేటీ బహిష్కరణ

బడ్జెట్‌లో విపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని, ఇది ప్రమాదకరమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరించిందని, ఇందుకు నిరసనగా శనివారం (27న) ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ భేటీని కాంగ్రెస్ రాష్ట్రాల సీఎంలు బహిష్కరిస్తారని చెప్పారు.



భారత్‌లోని దగ్గు మందులు నాసిరకం..!

నాణ్యతా పరీక్షల్లో 100కుపైగా శాంపిల్స్ విఫలం

న్యూఢిల్లీ, జూలై 24: భారత్‌లోని వందకుపైగా ఫార్మా సంస్థల నుంచి సేకరించిన దగ్గు మందు శాంపిల్స్.. నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయని ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. గాంబియా, ఉజ్బెకిస్థాన్, కామెరూన్‌లలో చిన్నారుల మరణానికి కారణమైన దగ్గు మందుల్లో కనిపించిన విషపూరిత పదార్థాలు వీటిలోనూ కనిపించాయని ఈ నివేదిక పేర్కొంది. ఈ దగ్గు మందుల్లో డైథిలీన్ గ్లైకాల్, ఇథలీన్ గ్లైకాల్, సూక్ష్మజీవుల పెరుగుదల వంటి సమస్యలను గుర్తించడంతో సీడీఎస్‌సీవో వాటిని ప్రామాణిక నాణ్యత లేని (ఎన్ఎస్‌క్యూ) మందులుగా వర్గీకరించింది. భారత్‌లో తయారైన దగ్గు మందుల కారణంగా వివిధ దేశాల్లో 141 మంది చిన్నారులు మృతిచెందారన్న ఆరోపణల నేపథ్యంలో.. దేశవ్యాప్తంగా ఫార్మా కంపెనీల్లో శాంపిల్స్‌ను సేకరించి ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

స్వదేశీ బాలిస్టిక్ క్షిపణి పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, జూలై 24: ఒడిసా తీరంలోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి బుధవారం డీఆర్‌డీవో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రెండో దశ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణశాఖ వెల్లడించింది. రెండు దశల సాలిడ్ మోటార్ ద్వారా నడిచే ఈ మిస్సైల్.. 5000 కిమీల పరిధిలోని శత్రు దేశాలకు చెందిన క్షిపణులను ధ్వంసం చేసే వ్యవస్థను కలిగి ఉందని తెలిపింది. కచ్చితమైన లక్ష్యాన్ని చేరుకోవడం కోసం అధునాతన సాంకేతికతతో దీన్ని రూపొందించినట్లు పేర్కొంది. ఈ క్షిపణి పరీక్ష నేపథ్యంలో సమీప గ్రామాల్లోని 10వేల మందికిపైగా ప్రజలను తాత్కాలిక శిబిరాలకు తరలించారు.

మాల్దీవులకు 'సాయం'లో కోత

- గతంలో రూ.770 కోట్లు.. ఇప్పుడు రూ.400 కోట్లే

న్యూఢిల్లీ, జూలై 24: కేంద్ర బడ్జెట్ 2024-25లో మాల్దీవులకు మోదీ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. 'పొరుగుకే మొదటి ప్రాధాన్యం' విధానం కింద అభివృద్ధి సాయం నిధుల్లో భూటాన్‌కు రూ.2,068 కోట్ల అత్యధిక వాటా కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో మాల్దీవులకు రూ.770.9 కోట్లు కేటాయించగా ఇప్పుడు దాన్ని రూ.400 కోట్లకు పరిమితం చేసింది. ఈ కేటాయింపు చేయడం ద్వారా గ్రేటర్ మాలే కనెక్టివిటీ ప్రాజెక్టు వంటి అభివృద్ధి పనులకు ఆ దేశంతో ఉన్న ఉద్రిక్తతలను కేంద్రం అడ్డంకిగా మారనివ్వలేదు. అలాగే మాల్దీవులకు కేటాయింపులన్నీ రుణంగా కాకుండా గ్రాంటు రూపంలో ఇచ్చింది. చైనా అనుకూలుడుగా ముద్రపడిన మయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడైన తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన విషయం తెలిసిందే. భూటాన్ తర్వాత అత్యధికంగా నేపాల్‌కు రూ.700 కోట్లు కేటాయించారు. మారిషస్‌కు రూ.370 కోట్లు, మయన్మార్‌కు రూ.250 కోట్లు, శ్రీలంకకు రూ.245 కోట్లు చొప్పున కేంద్రం బడ్జెట్‌లో అభివృద్ధి సాయం ప్రకటించింది. ఇరాన్‌లో చాబహార్ పోర్టు నిర్వహణకు రూ.100కోట్లు మంజూరు చేసింది. తాజా బడ్జెట్‌లో విదేశాలకు అభివృద్ధి సాయం కింద భారత్ మొత్తం రూ.4,883.56 కోట్లు కేటాయించింది.

ఎంపిక చేసిన హైవేలపై జీఎన్ఎస్ఎస్ టోల్ వసూలు

న్యూఢిల్లీ, జూలై 24: ఎంపిక చేసిన జాతీయ రహదారులపై టోల్ వసూలుకు ఫాస్టాగ్‌ను కొనసాగిస్తూనే గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (జీఎన్ఎస్ఎస్) విధానాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. బుధవారం కేంద్ర రోడ్డు రవాణా మంత్రి గడ్కరీ రాజ్యసభలో లిఖిత పూర్వక సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. 'జీఎన్ఎస్ఎస్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని ప్రయోగాత్మకంగా కర్ణాటకలోని ఎన్‌హెచ్-275లోని బెంగళూరు-మైసూరు సెక్షన్, హరియాణాలోని ఎన్‌హెచ్-709లోని పానిపట్-హిసార్ సెక్షన్‌లో అమలు చేసి దాని ప్రభావాన్ని పరిశీలిస్తున్నాం' అని వివరించారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ.. '697 ప్రాజెక్టులు పూర్తి కావాల్సిన గడువు తేదీలను దాటాయి. భూసేకరణ సమస్యలు, అనుమతులు, ఆక్రమణల తొలగింపు, ప్రకృతి విపత్తులే ఇందుకు కారణం' అన్నారు.

పూజా ఖేద్కర్ అదృశ్యం!

- సెల్‌ఫోన్‌నూ స్విచ్ ఆఫ్ చేసిన వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్



ముంబై, పుణె, న్యూఢిల్లీ, జూలై 24: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ(ఎల్‌బీఎస్ఎన్ఏఏ)లో మంగళవారంలోగా ఆమె రిపోర్టు చేయాలని గడువు విధించగా, గడువు ముగిసినా ఆమె ఎల్‌బీఎస్ఎన్ఏఏకు రాలేదు. ఆమె సెల్‌ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయ్యింది. దీంతో ఆమెపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే సివిల్ సర్వీస్ పరీక్షల దరఖాస్తులో తప్పుడు వివరాలతో మోసగించారంటూ యూపీఎస్సీ ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసింది. తన తల్లిదండ్రులు విడిపోయారంటూ తప్పుడు వివరాలతో నాన్ క్రీమీలేయర్ ఓబీసీ సర్టిఫికెట్‌ను పూజ పొందినట్టు నిర్ధారణ కావడంతో ఆమె తల్లిదండ్రుల వైవాహిక సంబంధంపై నివేదిక సమర్పించాలని తాజాగా పుణె పోలీసులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. లెక్కల్లో చూపని ఆస్తులకూ ప్రభుత్వ చిహ్నాలను వాడుకోవడం ద్వారా నిబంధనలు ఉల్లంఘించిన కేసులు కూడా పూజ, ఆమె తల్లిదండ్రులపై నమోదయ్యాయి. వ్యవసాయ నుంచి ఆటోమొబైల్స్ వరకు ఎనిమిది కంపెనీలను పూజ కుటుంబం తమ బంధువులు, స్నేహితుల పేర్లతో నిర్వహిస్తున్నట్టు తాజాగా ఓ ఆంగ్ల పత్రిక పరిశోధనలో వెల్లడైంది. ఆయా వ్యక్తులను పత్రిక సంప్రదించగా.. ప్రస్తుతం ఆ సంస్థలతో తమకేమీ సంబంధం లేదని వెల్లడించారు. కాగా, పూజా ఖేద్కర్‌కు దివ్యాంగ సర్టిఫికెట్ జారీ చేసిన పుణెలోని యశ్వంత్‌రావు చవాన్ మెమోరియల్ ఆస్పత్రి ఇందులో తామేమీ తప్పు చేయలేదని ప్రకటించింది. చట్టంలోని నిబంధనల ప్రకారమే ఆమెకు 7% లోకోమోటర్ వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్ జారీ చేశామని, ఆ సర్టిఫికెట్ విద్య, ఉపాధి అవకాశాలకు ఏ మాత్రం ఉపయోగపడదని ఆస్పత్రి డీన్ డాక్టర్ రాజేంద్ర వాబ్లే చెప్పారు. కలెక్టర్ ఆదేశం మేరకు ఆస్పత్రిలో అంతర్గత దర్యాప్తు జరిపించామని, వైద్యుల, సిబ్బంది తప్పు ఏమీ లేదని తేలిందని పేర్కొన్నారు.

రైతుల డిమాండ్లపై కమిటీ వేయండి

మీ సర్కార్‌పై వారికి విశ్వాసం లేనట్టుంది.. రైతుల దగ్గరకు మీరు ఎందుకు వెళ్లరు?

- హరియాణా సర్కార్‌కు సుప్రీంకోర్టు ప్రశ్న
- రైతులకోసం శంభు సరిహద్దు తెరవాలన్న హైకోర్టు ఉత్తర్వులపై వారంపాటు స్టే
- కమిటీ అంశం పరిశీలించాలని సూచన

న్యూఢిల్లీ, జూలై 24 : రైతుల పంటలకు ఇచ్చే కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించే అంశాన్ని పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటుచేయాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు సూచించింది. పలు సాగు అంశాలపై ఈ రెండు రాష్ట్రాల రైతాంగం పోరాడుతున్న విషయం తెలిసిందే. ఢిల్లీ పొలిమేరల్లోని శంభు సరిహద్దు వద్ద ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి శిబిరాలు వేసుకుని రైతులు ఉంటున్నారు. అక్కడి సరిహద్దులను అదే రోజున హరియాణా ప్రభుత్వం మూసివేసింది. దీనిపై రైతులు న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. అడ్డంగా పెట్టిన బారికేడ్లను తొలగించి రైతుల కోసం సరిహద్దులను తెరవాలని ఈ నెల 10న పంజాబ్-హరియాణా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హరియాణా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశాల అమలును సుప్రీంకోర్టు ఒక వారంపాటు నిలుపుదల (యథాతథ స్థితి) చేసింది. హరియాణా తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. "సరిహద్దులు తెరిచి ఆందోళన చేస్తున్న రైతులను ఢిల్లీలోకి అనుమతిస్తే శాంతిభద్రతలు అదుపు తప్పే ప్రమాదం ఉంది. దాదాపు 500-600 ట్యాంకులు శంభు సరిహద్దుల్లో నిలిపి ఉంచారు. అవి సాయుధీకరించిన ట్యాంకులు" అని తెలిపారు. అయితే, ట్యాంకులు, ట్రాక్టర్లు లేకుండా రైతులు ఢిల్లీకి వెళితే సరిపోతుందా అని కోర్టు ప్రశ్నించింది. రైతులకు, ప్రభుత్వానికి మధ్య విశ్వాసం సమస్యగా ఉన్నట్టు అనిపిస్తోందని వ్యాఖ్యానించింది. రైతుల వద్దకు ప్రభుత్వం వెళితే..వాళ్లెందుకు ఢిల్లీ దాకా వస్తారని ప్రశ్నించింది. ఈ దిశగా ఇప్పటివరకు రైతులతో సంప్రదింపులు జరిపారా? మంత్రులు రైతుల శిబిరాలకు వెళ్లవచ్చు కదా? పరస్పరం విశ్వాసాన్ని కల్పించేలా మధ్యవర్తులు ఎవరు లేరా? అని ఆరా తీసింది.

రాహుల్‌ను కలిసిన రైతులు



కనీస మద్దతు ధరకు చట్టబద్ధత సహా పలు సాగు అంశాలపై ఉద్యమిస్తున్న రైతులు బుధవారం పార్లమెంటు ఆవరణలో రాహుల్‌గాంధీని కలిశారు. రైతుల డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ తొలినుంచీ మద్దతు ఇస్తోందని వారికి రాహుల్ తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాకు చెందిన ప్రతినిధులు తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో, రైతుల డిమాండ్లపై 'ఇండియా' పార్టీలతో చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

కెనడాలో ఖలిస్తాన్‌వాదుల దుశ్చర్య

- స్వామి నారాయణ్ మందిర్‌పై భారత వ్యతిరేక రాతలు

న్యూఢిల్లీ, జూలై 24: ఖలిస్తాన్‌వాదులు మరోసారి దుశ్చర్యకు తెగబడ్డారు. కెనడాలోని ఎడ్మాంటన్‌లో ఉన్న బీఏపీఎస్ స్వామి నారాయణ్ మందిర్ గోడలను భారత వ్యతిరేక రాతలతో నింపేశారు. ప్రధాని మోదీ, భారత మూలాలున్న కెనడా ఎంపీ చంద్ర ఆర్యలను బెదిరిస్తూ రాతలు రాశారు. మరోవైపు, చంద్ర ఆర్య, ఆయన మద్దతుదారులు తక్షణం భారత్‌కు తిరిగి వెళ్లాలని ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ హెచ్చరించాడు. ఈ మేరకు ఒక వీడియో విడుదల చేశాడు. కెనడాలోని కాల్గరిలో జూలై 28న ఖలిస్తాన్ రిఫరెండమ్‌కు సంబంధించి వోటింగ్ జరగనున్నట్లు అందులో ప్రకటించాడు. ఖలిస్తాన్‌వాదుల విద్వేష చర్యలను ఖండించినందునే తనకు పన్నూన్ హెచ్చరికలు జారీ చేశాడని చంద్ర ఆర్య పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా కెనడాలో పలు ప్రాంతాల్లోని హిందూ ఆలయాలపై భారత వ్యతిరేక రాతలు రాస్తూనే ఉన్నారని తెలిపారు. హిందూ వ్యతిరేక వ్యాఖ్యలతో వారు బహిరంగంగా హింసావాదాన్ని ప్రదర్శిస్తున్నా ఎప్పటిలాగానే వారిపై ఎటువంటి చర్యలు లేకుండాపోతున్నాయని వాపోయారు. ఖలిస్థాన్ వాదులు కెనడాలో సామరస్యపూర్వక వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని చంద్ర ఆర్య విమర్శించారు.

మమత వ్యాఖ్యలు సరికాదు: బంగ్లాదేశ్

న్యూఢిల్లీ, జూలై 24: బంగ్లాదేశ్ నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు సరికాదని బంగ్లాదేశ్ పేర్కొంది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి ఒక అధికారిక నోట్ పంపింది. తాము ఎంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతపై తమకు ఎంతో గౌరవం ఉందని, అయితే ఆమె చేసిన వ్యాఖ్యలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి హసన్ మహ్మూద్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై బంగ్లాదేశ్‌లో హింస జరుగుతున్న నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చే శరణార్థులకు బెంగాల్‌లో ఆశ్రయం కలిస్తామని మమతాబెనర్జీ ఇటీవల ఓ ర్యాలీలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

నేపాల్‌లో కుప్పకూలిన విమానం



విమానం కూలిన స్థలంలో శకలాలు

- 18 మంది దుర్మరణం.. పైలట్‌కు తీవ్ర గాయాలు
- ప్రమాద సమయంలో విమానంలో 19 మంది
- బాధితులందరూ శౌర్య ఎయిర్‌లైన్స్ సిబ్బందే
- మెయింటెనెన్స్ చెకప్ కోసం విమానంలో ప్రయాణం

కాఠ్మాండూ, జూలై 24: నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. కాఠ్మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ విమానం టేకాఫ్ అవుతుండగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో 18 మంది అక్కడికక్కడే చనిపోయారు. పైలట్ మనీశ్ ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. ఆయన కళ్లకు, నుదురుకు గాయాలయ్యాయని, ప్రాణానికి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. నేపాల్‌లోని శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన బాంబార్డియర్ సీఆర్‌జే-200 విమానం బుధవారం ఉదయం 11.15 గంటలకు త్రిభువన్ ఎయిర్‌పోర్టు నుంచి పొఖారాకు బయల్దేరింది. టేకాఫ్ అయిన క్షణాల్లోనే అదుపుతప్పి కూలిపోయింది. విమానం నేలను తాకగానే మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో ఉన్నవాళ్లంతా శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన సిబ్బందేనని ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ చీఫ్ అర్జున్ చాంద్ తెలిపారు. వీరిలో ఇద్దరు విమాన సిబ్బంది కాగా, 17 మంది టెక్నీషియన్లని పేర్కొన్నారు. రొటీన్‌గా చేసే నిర్వహణా పరీక్షల(మెయింటెనెన్స్ చెకింగ్) కోసం వారు ఆ విమానంలో ఎక్కారని తెలిపారు. విమానం కూలిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, విమానం ఎగరగానే ఎడమవైపు తిరగాల్సి ఉండగా అదుపు తప్పి కుడివైపు తిరిగిందని, వెంటనే కూలిపోయిందని త్రిభువన్ ఎయిర్‌పోర్టు సిబ్బంది తెలిపారు. నేపాల్‌లో గడిచిన 30 ఏళ్లలో 720 విమాన ప్రమాదాలు జరిగాయి. గతేడాది పొఖారా విమానాశ్రయంలో యతి ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కూలిపోయి 72మంది దుర్మరణం పాలయ్యారు. కాగా, తాజా విమాన ప్రమాదానికి ఎయిర్‌పోర్టులోని టేబుల్ టాప్ రన్‌వేనే కారణమని నిపుణులు భావిస్తున్నారు. ఎయిర్‌పోర్టుల్లోనే ఎత్తైన ప్రదేశంలో ఉండే రన్‌వేలను టేబుల్ టాప్ రన్‌వేలు అంటారు. వీటిపై టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో పైలట్లు అప్రమత్తతతో వ్యవహరించాలి. నేపాల్‌లో జరిగిన విమాన ప్రమాదాల్లో ఎక్కువగా టేబుల్‌టాప్ రన్‌వేలపైనే జరిగినట్లు గణాంకాలు చెప్తున్నాయి.

డొనాల్డ్ ట్రంప్‌పై కమల పైచేయి

(మొదటి పేజీ తరువాయి)

మారిస్ట్ సంయుక్తంగా నిర్వహించిన మరో సర్వేలో ట్రంప్, కమల మధ్య హోరాహోరీ పోటీ నెలకొనబోతోందని వెల్లడైంది. ఈ సర్వేలో ట్రంప్‌నకు 46% మంది మద్దతు లభించగా, కమలకు 45% మంది ఓటర్లు మద్దతు తెలిపారు. పోటీ నుంచి బైడెన్ తప్పుకోవటం సరైన నిర్ణయమని పార్టీలకు, వయసులకు అతీతంగా పలువురు ఓటర్లు పేర్కొన్నట్లుగా ఈ సర్వే తెలిపింది. బైడెన్ నిర్ణయం వల్ల డెమోక్రటిక్ అభ్యర్థి అధ్యక్ష ఎన్నికల్లో గెలిచే అవకాశాలు పెరిగాయని దాదాపు 41% మంది అభిప్రాయపడినట్లు వెల్లడించింది. కాగా, బరి నుంచి వైదొలుగుతున్నట్లు బైడెన్ ఆదివారం ప్రకటించిన తర్వాత కేవలం 2 రోజుల్లోనే కమలకు ఈ స్థాయిలో ప్రజాదరణ లభిస్తే.. ఎన్నికల నాటికి ట్రంప్‌పై ఆమె పూర్తి ఆధిపత్యం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వయసు పరంగా కూడా 78 ఏళ్ల ట్రంప్ కంటే 59 ఏళ్ల కమల వైపు ఎక్కువ మంది ఓటర్లు మొగ్గు చూపే అవకాశం ఉంది. మరోవైపు, దేశాధ్యక్షుడు బైడెన్ ఎన్నికల ప్రచారం కోసం సేకరించిన నిధుల్ని కమలా హారిస్ ఉపయోగించుకోవడం చట్టబద్ధం కాదంటూ ట్రంప్ ప్రచార బృందం ఫెడరల్ ఎలక్షన్ కమిషన్(ఎఫ్ఈసీ)కు ఫిర్యాదు చేసింది. బైడెన్ సేకరించిన 91.5 మిలియన్ డాలర్లను ఎన్నికల ప్రచార నిధుల్ని కమల వినియోగించుకోవాలనుకుంటున్నారు.

ఢిల్లీ నిరసనల్లో టీ కాంగ్రెస్ ఎంపీలు

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆగ్రహం
- తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారంటూ నినాదాలు

న్యూఢిల్లీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తీరును నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, అఖిలేష్ యాదవ్ పాల్గొన్న ఈ నిరసనలో.. బడ్జెట్‌ను ఏకపక్షంగా రూపొందించారని ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, కడియం కావ్య, మల్లు రవి, సురేశ్ షెట్కార్, బలరాంనాయక్, రఘువీర్‌రెడ్డి, రఘురామిరెడ్డి 'గాడిద గుడ్డు' ప్లకార్డుతో తమ నిరసన వ్యక్తం చేశారు. 8 మంది ఎంపీలను బీజేపీకి ఇస్తే తెలంగాణకు కేంద్రం ఇచ్చింది గాడిద గుడ్డు అంటూ నినాదాలు చేశారు. తెలంగాణ ద్రోహి మోదీ అని, బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను విస్మరించారని, నిధుల కేటాయింపులో తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసిందని విమర్శించారు.

మళ్లీ తెరపైకి గాడిద గుడ్డు!

తెలంగాణకు బీజేపీ ఇచ్చింది "గాడిద గుడ్డు!" అంటూ కాంగ్రెస్ ఫ్లెక్సీలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమిచ్చింది?" లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రతి సభలోనూ సభికులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి అడిగిన ప్రశ్న ఇది. "గాడిద గుడ్డు!" - రేవంత్ అడిగిన ప్రశ్నకు సభికులు ముక్తకంఠంతో ఇచ్చిన సమాధానం ఇది. ప్రతి సభలోనూ గాడిద గుడ్డు నమూనాను ప్రదర్శిస్తూ ఒకటికి 4సార్లు రేవంత్ ఈ ప్రశ్నను సంధించడం, గాడిద గుడ్డు అంటూ సభలో పాల్గొన్నవారు సమాధానం ఇవ్వడం అప్పట్లో విపరీతంగా ట్రెండ్ అయింది. తొలుత గాంధీభవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఈ ప్రచారం ప్రారంభించగా.. రాహుల్, ప్రియాంక సభలవరకూ ఇది పాకింది. తాజాగా కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు ఆశించిన మేరకు కేటాయింపులు లేకపోవడంతో ఈ ప్రచారాన్ని కాంగ్రెస్ మరోమారు తెరపైకి తీసుకొచ్చింది. హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో 'గాడిద గుడ్డు' ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. బీజేపీ ప్రభుత్వం.. బడ్జెట్లో తెలంగాణకు ఏమిచ్చింది?'అంటూ ప్రశ్న.. 'గాడిద గుడ్డు' అంటూ సమాధానాన్ని ఆ ఫెక్సీల్లో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తెలంగాణ 8 సీట్లు ఇస్తే.. బడ్జెట్లో తెలంగాణకు ఆ పార్టీ ప్రభుత్వం గాడిద గుడ్డు ఇచ్చిందని బ్యానర్లనూ ఏర్పాటు చేశారు.



హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తుంగభద్రకు మళ్లీ పెరిగిన వరద

(మొదటి పేజీ తరువాయి)

వదులుతున్నారు. పూర్తి సామర్థ్యం 105 టీఎంసీలకు ప్రస్తుతం 99.195 టీఎంసీలున్నాయి. ఇక ఎగువన ఉన్న ఆల్మట్టి జలాశయానికి 2 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా గేట్లు ఎత్తి యథావిధిగా విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ జలాశయానికి 2.25 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదవుతుండగా.. ఇది మరింత పెరిగే అవకాశం ఉండటంతో బుధవారం రాత్రి దాన్ని 2.30 లక్షల క్యూసెక్కులకు పెంచి దిగువకు వదిలారు. జూరాలకు 1.80 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 43 గేట్లను ఎత్తి 1.57 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 24,688 క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. శ్రీశైలానికి 1.76 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా విద్యుదుత్పత్తి ద్వారా 6,474 క్యూసెక్కులను వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం నిల్వ 79.63 టీఎంసీలకు చేరింది. నాగార్జునసాగర్‌కు పైనుంచి ఎటువంటి వరద లేదు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 9,447 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇటు గోదావరి బేసిన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 17,948 క్యూసెక్కులే వస్తుండటంతో నీటిని దిగువకు విడవట్లేదు. కడెం ప్రాజెక్టులోకి 17,557 క్యూసెక్కులు వస్తుండగా.. 14,391 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి 9.75 లక్షల క్యూసెక్కులు, సీతమ్మసాగర్(దుమ్ముగూడెం)కు 10 లక్షల క్యూసెక్కులు, మేడిగడ్డకు 7.71 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. దాంతో వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి 45.2 అడుగులకు నీటి మట్టం చేరింది.

మోస్తరు నుంచి ముసురు వానలు..

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి ముసురు వానలు కురిశాయి. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి సహా హైదరాబాద్‌లో వానలు పడ్డాయి. ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరులో అత్యధికంగా 10.4 సెం.మీ., కౌటలలో 8.9, చింతలమానేపల్లిలో 8.6 సెం.మీ. వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 3.2, నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 2 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో పంట పొలాలు మునిగిపోయాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మారుమూల గ్రామాలకు రవాణా వ్యవస్థ దెబ్బతిన్నది. దహెగాం మండలంలో పంటపొలాల్లోకి నీరు చేరింది. బెజ్జూర్, చింతలమానేపల్లి మండలాల్లో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో దాదాపు రూ.45.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లింది. బొగత, కుంటాల, పొచ్చెర జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి. వర్షాల కారణంగా పర్యాటకుల సందర్శనను అధికారులు పూర్తిగా నిలిపివేశారు.

తెలంగాణకు ఎంతో చేశాం.. ఇంకా చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వెళుతున్నారన్నారు. కేసీఆర్ గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీ పెట్టుకుంటే, రేవంత్ సీఎం కాగానే కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదని, కొత్త పింఛన్లు లేకపోగా పాత పింఛన్లకు ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏం చేశారో చెప్పమంటే చేతకాదు కానీ కేంద్ర బడ్జెట్ పేరు చెప్పి అసెంబ్లీలో తీర్మానం పెడతారా? అంటూ మండిపడ్డారు. తాను అవసరం కోసం పార్టీ మార్చే వ్యక్తిని, అధికారం, పదవుల కోసం జెండా మార్చే ఆలోచన ఉన్నోడిని కాదని చెప్పారు. డబ్బులిచ్చి సీఎం సీట్లు కొనుక్కోవడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అని, ఆ విషయం ప్రజలకు తెలుసన్నారు. తాను సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం, తెలంగాణ ప్రజలకు, దేశానికి, తమ పార్టీకి బానిసని, అంతే తప్ప గాంధీ కుటుంబానికి బానిసను కాదని చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చినపుడు ఏ జెండా పట్టుకున్నానో తుది శ్వాసవరకు అదే జెండాతో ఉంటానని స్పష్టం చేశారు. రాజీనామా చేయాల్సింది తాను కాదని.. హామీలు అమలు చేయని రేవంత్ రెడ్డే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎకరానికి 18వేల చొప్పున 60 లక్షల మంది తెలంగాణ రైతులకు ఎరువుల సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. 20లక్షల మంది రైతులనుంచి ధాన్యం సేకరణకు రూ.25వేల కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. లక్షా 32వేలతో చేపట్టిన జాతీయ రహదారులు తెలంగాణకు లబ్ధి చేయడం లేదా? అని ప్రశ్నించారు. రామగుండం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 10,990 కోట్లతో 1600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. రామగుండంలో 6300 కోట్లతో ఫర్టిలైజర్ కంపెనీ ఏర్పాటు చేశామన్నారు. ఇవన్నీ దాచేసి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.



సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని కిషన్ రెడ్డి చెప్పారు. బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. సింగరేణి ప్రైవేటీకరణ విషయంలో ఉద్దేశపూర్వకంగా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సింగరేణి సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ప్రయోజనాలను కాపాడే ఆలోచనతో అవసరమైన అన్ని చర్యలను కేంద్రం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఇటీవల ఒడిసాలోని నైనీ కోల్ బ్లాక్‌ను సింగరేణికి ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని ఆయన చెప్పారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే

- కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అసెంబ్లీలో చేసిన తీర్మానంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఆ తీర్మానం పొలిటికల్ బ్లాక్ పేపర్ అని విమర్శించారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి దాదాపు రూ.10 లక్షల కోట్ల నిధులు వెచ్చించిందనే స్పృహ కూడా లేకుండా నిందించడం విచారకరమంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. భారతదేశంలో తెలంగాణ ఓ భాగమనే విషయాన్ని మరిచి ముఖ్యమంత్రి, మంత్రులు, బీఆర్ఎస్, ఎంఐఎం నేతలు మాట్లాడటం అవకాశవాదానికి పరాకాష్ఠ అని సంజయ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా రాష్ట్రంలోని ఏ పంచాయతీలోనైనా అభివృద్ధి జరిగిందని నిరూపించే దమ్ముందా ? అంటూ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. అధికారం చేపట్టిన వెంటనే బీఆర్ఎస్ పాలనపై శ్వేత పత్రాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం తెలంగాణకు ఖర్చు చేసిన నిధులపైనా శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై కలిసి పోరాడతామంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడుతున్న డ్రామాలు చూస్తే ఆ రెండు పార్టీలు ఒక్కటేనని అర్థమవుతోందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి ఇది సంకేతమా? అని ప్రశ్నించారు.

గొర్రెల కుంభకోణం.. వివరాల సేకరణకు ఈడీ తంటాలు!

- సమాచారం ఇవ్వని సహకార సంస్థ
- కారణాలు, ఆలస్యంపై ఈడీ అధికారుల ఆరా

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల గోల్‌మాల్ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు వివరాల సేకరణకు తంటాలు పడుతున్నారు. కేసులో మనీలాండరింగ్ కోణంపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఈ క్రమంలో కేసు విచారణకు అవసరమైన సమాచారాన్ని అందజేయాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ(టీజీ ఎస్‌జీడీసీఎఫ్ఎల్) అధికారులకు లేఖ రాసి నెలరోజులు గడిచినా.. అడిగిన వివరాలు ఇప్పటి వరకు ఈడీ అధికారులకు అందలేదు. దీంతో సహకార సంస్థపై ఈడీ అధికారులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల పేర్లు, చిరునామా, ఫోన్ నంబర్లు, గొర్రెల యూనిట్లు ఎవరి నుంచి కొనుగోలు చేశారు? ఎంత చెల్లించారు? పేరు, బ్యాంకు ఖాతా నంబర్, సంస్థ ఏ ఖాతా నుంచి ఎంత మొత్తం బదిలీ చేసింది? గొర్రెలకు దాణా అమ్మిన వారెవరు? అనే వివరాలను ఈడీ అధికారులు కోరుతున్నారు. రూ.వందల కోట్ల అక్రమాల నేపథ్యంలో ప్రతి అంశానికి సంబంధించిన వివరాలు కావాలని ఈడీ డైరెక్టర్ అప్పట్లో స్పష్టం చేశారు. నెల దాటినా ఇంకా వివరాలు అందకపోవడంతో.. ఇటీవల ఈడీ అధికారులు "ఇంకెంత సమయం పడుతుంది?" అంటూ కారణాలు, ఆలస్యంపై విచారించినట్లు తెలిసింది. దానికి సహకార సంస్థ అధికారులు.. జిల్లాల వారీగా వివరాల సేకరణకు సమయం పడుతుందని చెప్పినట్లు సమాచారం. కాగా.. ఈ కేసులో కీలక నిందితుడు మొహియుద్దీన్, అతని కుమారుడు విదేశాల్లో ఉండగా.. ఏపీకి చెందిన దళారికి నోటీసులు జారీ చేసి, విచారించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు.



మధులతకు చెక్కును అందజేస్తున్న గిరిజన శాఖ అధికారులు

గిరిజన ఆడబిడ్డకు ప్రభుత్వ చేయూత

- ఐఐటీలో చేరేందుకు ఆర్థిక సాయం.. అండగా ఉంటామని హామీ

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చదువు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిరిసిల్ల జిల్లా గిరిజన ఆడబిడ్డకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఐఐటీలో చేరేందుకు ఆ విద్యార్థినికి ఆర్థిక సహాయం చేసింది. వీర్నపల్లి మండలం గోనేనాయక్ తండాకు చెందిన బాదావత్ మధులత జేఈఈలో ర్యాంకు సాధించి పట్నా ఐఐటీలో సీటు పొందింది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఐఐటీకి వెళ్లలేక ఆగిపోయింది. అందుకు సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, సదరు విద్యార్థినికి తక్షణమే సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. దాంతో బుధవారం సచివాలయంలో విద్యార్థినికి గిరిజనశాఖ కార్యదర్శి శరత్ రూ.1,51,831 చెక్‌ను అందించారు. మధులత కోరిక మేరకు కంప్యూటర్ కొనుగోలు కోసం రూ.70 వేలు, అదనంగా మరో రూ.30 వేలు కూడా ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని తెలిపారు. కాగా, పేదరిక కష్టాలను ఎదుర్కొని, ప్రఖ్యాత ఐఐటీలో సీటు సాధించినందుకు మధులతకు సీఎం రేవంత్ ఎక్స్(ట్విటర్)లో అభినందనలు తెలిపారు. ఏ ఆటంకం లేకుండా ఐఐటీలో ఆమె రాణించి, తెలంగాణకు మరింత మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నానని సీఎం పేర్కొన్నారు.

కంటిచూపు తగ్గితే డెమెన్షియా ముప్పు

- ఎల్వీపీఈఐ పరిశోధనలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కంటిచూపు క్షీణించిన వృద్ధుల్లో మెదడు పనితీరు కూడా తగ్గుముఖం పడుతున్నట్లు తమ పరిశోధనలో తేలిందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి (ఎల్వీపీఈఐ) పరిశోధకులు డాక్టర్ శ్రీనివాస్ మర్మముల వెల్లడించారు. కంటిచూపు సరిగా ఉన్నవారితో పోల్చితే.. దృష్టిలోపం ఉన్నవారికి మతిభ్రంశం(డెమెన్షియా) వచ్చే అవకాశాలు నాలుగు రెట్లు ఎక్కువని తెలిపారు. వెల్‌కం ట్రస్ట్, డీబీ ఇండి యా సహకారంతో నగరంలోని వృద్ధాశ్రమాల్లో 60 ఏళ్ల పైబడిన 1,515 మంది వృద్ధులపై 'హైదరాబాద్ ఆక్యులర్ మోర్బిడిటీ ఇన్ ఎల్డర్లీ' పేరుతో పరిశోధన నిర్వహించారు. కంటిచూపు మందగించడంతో డెమెన్షియా వచ్చే అవకాశం పురుషులకంటే మహిళలకు 2 రెట్లు ఎక్కువని అధ్యయనంలో తేలిందన్నారు. ఈ పరిశోధన ఫలితాలను బీఎంజే ఓపెన్ యాక్సిస్ జర్నల్‌లో ప్రచురించారు.

జీవో 317 కింద సచివాలయ పరిధిలో దరఖాస్తులను పరిశీలించండి

- శాఖాధిపతులకు జీఏడీ ముఖ్య కార్యదర్శి ఆదేశం

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సచివాలయంలో వివిధ శాఖల్లో జీవో 317 కింద దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను పరిశీలించాలని జీఏడీ సర్వీసెస్ ముఖ్యకార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా బుధవారం శాఖాధిపతులను కోరారు. శాఖల వారీగా జీవో 317కి సంబంధించి పేరా 22లో పేర్కొన్న విధంగా వైకల్యం, కంపాసినేట్ కింద నియమించిన వితంతు ఉద్యోగులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలనలోకి తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులకు సూచించారు.

హాస్టల్ నుంచి పంపించేస్తారని.. తోటి విద్యార్థిపై పెట్రోలు పోసి అంటించాడు

- బాలుడికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స

ఏలూరు క్రైం, జూలై 24: ఆ విద్యార్థికి హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదు. ఇంటికెళ్లిపోవాలని ఓ క్రూరమైన ఆలోచన చేశాడు. తోటి విద్యార్థిపై పెట్రోలు పోసి నిప్పంటిస్తే తన అల్లరి భరించలేక తనను ఇంటికి పంపించేస్తారని భావించాడు. తన పథకాన్ని అమలుచేసి సహచర విద్యార్థిని తీవ్రంగా గాయపరిచాడు. చివరకు కటకటాల పాలయ్యాడు. ఏలూరు జిల్లా ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకకు చెందిన ఒక విద్యార్థి మూడు వారాల క్రితం ఏలూరు విద్యానగర్‌లోని సెయింట్ జేవియర్ హైస్కూలులో 7వ తరగతిలో చేరాడు. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన మరో విద్యార్థి అదే స్కూలులో 7వ తరగతిలో చేరి అదే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆ విద్యార్థికి హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక హోమ్‌సిక్ హాలీడేస్‌కు వెళ్లి తిరిగి వస్తూ పావు లీటర్ పెట్రోల్ తెచ్చుకుని దాచుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఆ పెట్రోల్‌ను హాస్టల్‌లో నిద్రిస్తున్న గుడివాకలంక గ్రామానికి చెందిన విద్యార్థిపై చల్లి నిప్పంటించాడు. తీవ్ర గాయాలపాలైన ఆ విద్యార్థికి మిషనరీ ఆస్పత్రిలోనే వైద్యం చేయిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టం లేని పెళ్లి చేశారని అన్నపై తమ్ముడి ఉన్మాదం


- వదినను, ఆమె ఇద్దరు కుమార్తెలను నరికి చంపి ఆత్మహత్య

తిరుపతి (నేరవిభాగం), జూలై 24: అన్నపై కక్షతో ఓ తమ్ముడు ఉన్మాదిలా మారాడు. అన్న భార్యను, వారి ఇద్దరి కూతుళ్లను కత్తితో నరికి దారుణంగా హతమార్చాడు. ఏపీలోని తిరుపతికి చెందిన దాసు, మోహన్ అన్నదమ్ములు. దాసు 2019లో తన తమ్ముడు మోహన్‌కు ఇష్టం లేకపోయినా నచ్చజెప్పి బలవంతంగా పెళ్లి చేశాడని సన్నిహితులు చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మోహన్‌కు పెళ్లయ్యాక ఓ బిడ్డ కలిగిందని, తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య.. బిడ్డను తీసుకుని వేరుగా ఉంటోందని పేర్కొన్నారు. ఇష్టం లేని పెళ్లి చేసినందునే తాము విడిపోయామని మోహన్ తరచూ అన్నతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అన్న ఇంటికి వెళ్లిన మోహన్.. వదిన సునీత (35), పిల్లలు దేవిశ్రీ (13), నీరజ (11)ను కత్తితో నరికి చంపాడు. ఆపై అదే గదిలో ఫ్యానుకు ఉరేసుకుని తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8ఏళ్ల అంధ బాలికపై అత్యాచారం

మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో ఘటన.. నిందితుడు అక్కడ బాత్రూంలు శుభ్రంచేసే వాడే

- బాలికకు తీవ్ర రక్తస్రావం.. ఆస్పత్రికి తరలించని నిర్వాహకులు
- కన్నవారిని పిలిపించి ఇంటికి తీసుకెళ్లండంటూ ఉచిత సలహా
- తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- నిలోఫర్ వైద్యుల సమాచారంతో కదలిక.. నిందితుడి అరెస్టు



చాదర్‌ఘాట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ప్రభుత్వ అంధ బాలికల వసతిగృహంలో చదువుతున్న బాలిక(8)పై అక్కడ బాత్రూంలు శుభ్రం చేసే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో బాలిక అస్వస్థతకు గురవడంతో విషయం తల్లిదండ్రుల దాకా వెళ్లింది. తమ చిన్నారి పట్ల జరిగిన ఘోరంపై వారు కన్నీరు పెడుతూ పోలీస్‌స్టేషన్ మెట్లెక్కినా పోలీసులు పట్టించుకోలేదు. వైద్యం చేయిస్తున్నా రక్తస్రావం ఆగకపోవడంతో పెద్దాస్పత్రిలో చూపెడితే బాలికపై దారుణ అత్యాచారం జరిగిందని గుర్తించి ఆ వైద్యులే పోలీసులకు సమాచారమిచ్చారు! ఘటన జరిగిన 15 రోజుల తర్వాత పోలీసులు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై వసతిగృహం నిర్వాహకులు, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధిత బాలిక వికారాబాద్ జిల్లా వాస్తవ్యురాలు. మలక్‌పేటలోని వసతిగృహంలో ఉంటూ అక్కడే చదువుకుంటోంది. ఈనెల 7న ఉదయం బాలికకు రక్తస్రావం జరిగినట్లు కేర్ టేకర్ గుర్తించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చింది. వెంటనే వారు వసతిగృహానికొచ్చి నిలదీసినా నిర్వాహకులు ఏమీ చెప్పలేదు. కూతురే తన పట్ల జరిగిన ఘోరాన్ని చెప్పడంతో అత్యాచారం జరిగినట్లు అనుమానించి.. మలక్‌పేట పోలీసులను ఆశ్రయించారు. ఆ స్టేషన్‌లో ఎవరూ వీరి గోడు పట్టించుకోలేదు. ఫిర్యాదు స్వీకరించలేదు. బాలిక అంధురాలు అని, ఆమె చెప్పినదాన్ని నమ్మలేం అని ఊరు తీసుకెళ్లి వైద్యం చేయించండి అంటూ ఉచిత సలహా ఇచ్చినట్లు తెలిసింది. చేసేదేమీ లేక తల్లిదండ్రులు బాలికను ఇంటికి తీసుకెళ్లి దగ్గర్లోని ఆస్పత్రిలో చూపించారు. ఎంతకీ రక్తస్రావం ఆగకపోవడంతో హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలికను పరీక్షించిన వైద్యులు చిన్నారిపై అత్యాచారం జరిగిందని తల్లిదండ్రులకు చెప్పి, మలక్‌పేట పోలీసులకు సమాచారమిచ్చారు. ప్రభుత్వ వైద్యులు చెప్పాక పోలీసుల్లో కదలిక వచ్చింది. ఈనెల 16న పోక్సో కేసు నమోదు చేసి, బుధవారం (24వ తేదీ) నిందితుడైన స్కావెంజర్ నరేశ్(25)ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అత్యాచార ఘటనపై స్థానిక నాయకులు, ఏబీవీపీ ప్రతినిధులు బుధవారం మలక్‌పేట పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఘటనపై మలక్‌పేట పోలీసులు విచారణ జరుపుతున్నారని దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్ పేర్కొన్నారు. విచారణలో తేలిన ఆధారాల మేరకు దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు.

మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, బొల్లారం (సంగారెడ్డి జిల్లా)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నిట్ నం. E1/18/2024 to E1/25/2024
మొత్తం పనుల సంఖ్య: ఎంజీఎఫ్ 2024-25 (8 నం.లు) 1వ పిలుపు
బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ మరియు సమయం: 25.07.2024న మ.1.00 గం.కు, బిడ్ దాఖలుకు ముగింపు తేదీ మరియు సమయం: 01.08.2024న ఉ.11.00 గం.కు. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.in చూడగలరు. ఫోన్ నం.కమిషనర్ మునిసిపాలిటీ: 9949689529
సం/- మునిసిపల్ కమిషనర్, బొల్లారం మునిసిపాలిటీ
DIPR RO No.2076-PP/CL/ADVT/1/2024-25 తేది:24.07.2024

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (GHMC)
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం కూకట్‌పల్లి జోన్, GHMC
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No.07/SE/KPZ/GHMC/2024-25, తేది:24.07.2024. పని పేరు: తుఫాను నీటి డ్రైన్, నీటి హైసంఫిన్ యొక్క ప్రారంభ తొలగింపు. అంచనా మొత్తం/ECV (రూ.లక్షల్లో): రూ.713.00 లక్షలు, బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ/ఆఖరి తేదీ & సమయం: 25.07.2024న మ.02.00 గం.లకు మరియు 01.08.2024న మ.02.00 గం.లకు, అధికారి పేరు & చిరునామా, సెల్ నం: SE/KPZ, GHMC, 9989930363.
సం/-సూపరింటెండింగ్ ఇంజినీర్, కూకట్‌పల్లి జోన్, GHMC
DIPR RO No.2087-PP/CL/ADVT/1/2024-25 తేది:24.07.2024

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (GHMC)
బహిరంగ ప్రకటన
SLP(C) No.(S) 8675-8678 of 2008 ప్రకారం గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థానం యొక్క ప్రస్తుత స్టేటస్ Quo ఉత్తర్వులలో ఉన్న ఖానామెట్ గ్రామం (అయ్యప్ప సొసైటీ, మాదాపూర్) యొక్క సర్వే నం. 11లో ఎటువంటి విక్రయ లావాదేవీలు మరియు నిర్మాణాలలో ప్రవేశించరాదని ఇందుమూలంగా సాధారణ ప్రజలందరికీ తెలియజేయడమైనది. ఖానామెట్ గ్రామం సర్వే నం. 11లో సర్వోన్నత న్యాయస్థానం యొక్క సదరు స్టేటస్ Quo ఉత్తర్వులు ఈ రోజు నుండి అమలులోకి వచ్చును. గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థాన ఉత్తర్వులను ఉల్లంఘించిన యెడల తీవ్రంగా పరిగణించబడును.
DIPR RO.No 2091-PP/CL/ADVT/1/2024-25 తేది.24.07.2024 సం./- కమిషనర్, జిహెచ్ఎంసి

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (hmda)
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం
5వ అంతస్తు వెస్ట్ వింగ్, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్-500 038
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT NO.HMDA/DEV/EE(Div-V)/01/2024-25, తేది:08-07-2024, దిగువ పనికొరకు అర్హత గల నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. క్ర.సం.1: పని పేరు: బంగ్లా‌హౌస్ పార్క్ వద్ద లైటింగ్ నిర్వహణ ఏర్పాట్లు చేయుట. అథారిటీ టెండరు కోరబడినది: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-V, HMDA. బిడ్ దాఖలుకు ప్రారంభ తేది: 25.07.2024 మరియు చివరి తేది: 02.08.2024న మ.3.30 గం.ల వరకు. ఇతర వివరాలకు https://tender.telangana.gov.in//. దర్శించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-V, HMDA.
DIPR RO.No.2063-PP/CL/ADVT/1/2024-25 తేది: 24.07.2024

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (hmda)
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్
HMDA చట్టం 2008 సెక్షన్ 15 (3) క్రింద బహిరంగ ప్రకటన
ప్రభుత్వ మెమో నం. 14698/Plg.I(1)/2023, తేది: 07.10.2023
HMDA చట్టం 2008 (చట్టం నం. 8 ఆఫ్ 2008) సెక్షన్ 15 యొక్క సబ్ సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుని G.O.Ms.No.33, MA&UD తేది:24.01.2013 ప్రకారం ప్రభుత్వంచే ఆమోదిస్తూ తెలిపిన బృహత్ ప్రణాళిక MDP-2031లో ఊహించిన భూ వినియోగానికి ఈ క్రింది ముసాయిదా మార్పు రూపొందించాలని ప్రతిపాదించబడింది.
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామం యొక్క సర్వే నం.లు 242, 247/పి లో 76,335.05 చ.మీ.లు/ఎ.18-34.51 గుంటల విస్తీర్ణ స్థలం, G.O.Ms.No.33, MA&UD తేది:24.01.2013 ప్రకారం ప్రభుత్వం ఆమోదిస్తూ తెలిపిన బృహత్ ప్రణాళిక MDP-2031 ప్రకారం ప్రస్తుతం కన్జర్వేషన్ యూజ్ జోన్‌గా గుర్తించబడినది, ఇప్పుడు అది నివాసిత వినియోగంగా మార్చిందాలని ప్రతిపాదించబడింది.
పైన పేర్కొన్న వివరాలు వెబ్‌సైట్‌లు http://gazette.telangana.gov.in & http://hmda.gov.in లో లభించును. సదరు ప్రతిపాదనలకు ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ నుండి ఆక్షేపణలు/సూచనలు పరిగణించబడతాయి. వారు తమ ఆక్షేపణలు/సూచనలను ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి పదిహేను (15) రోజులలో M.C, HMDA లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ, MA&UD శాఖ, తెలంగాణ సచివాలయం, హైదరాబాద్ వారికి రాతపూర్వకంగా దాఖలు చేయగలరు.
సం/-మెట్రోపాలిటన్ కమిషనర్, HMDA తరఫున
DIPR RO.No 2056-PP/CL/ADVT/1/2024-25 తేది.24.07.2024

OFFICE OF THE NARAYANKHED MUNICIPALITY SANGAREDDY DISTRICT
File No.E1/277/MCN/2024-25 Dt: 22.07.2024
QUOTATION NOTICE
క్ర.సంఖ్య-పని వస్తువు యొక్క వివరణ-1.Wall Painting works-1 Sqm, 2.Drip water system-Each, 3.Procurement of office furniture-Each, 4.Procurement of electrical materials-Each, 5.Procurement of false ceiling-1 Sqm, 6.Lighting Arrangements hire basis-Each, 7.Crane Arrangements hire basis-1 hour, 8.Pooja Materials Arrangements- 1 job, 9.Stage Arrangements- 1 job, 10.Procurement of different plants with different bag sizes- Each, 11.Procurement of sanitation materials & Safety Materials- Each, 12.Procurement of open Gym material & Repairing work-Each, 13.Procurement of median divider blocks- Each, 14.Hiring of JCB- 1 Hour, 15.Hiring of Dozer- 1 Hour, 16.Providing of Tent of different sizes on hire basis-Each, 17.Providing of tables, chairs, side wall on hire basis- Each, 18.Procurement of cloths for sanitary & water supply workers- Smt, 19.Stitching charges for various Dresses- Each, 20.Procurement of sports materials- Each, 21.Engaging of cultivator rotivator per hour- 1 Hour, 22.Procurement of computer, printer& related Accessories- Each, 23.Procurement of CC camera's & Accessories- Each, 24.Procurement of Different Water Supply Materials- Each, 25.Engaging of Tippers-1 Hour, 26.Procurement of Bleaching powder- Kg, 27.Procurement of lime powder-Kg, 28.Procurement of Safety Materials- Each, 29.Procurement of Tree Cutting Machine- Each, 30.Procurement of Breaker Machine- Each-రిమార్క్స్: For All: Interested agencies may submit quotations. అంశాల వివరణాత్మక వివరణ ఈ కార్యాలయ నోటీసు బోర్డుకు జోడించబడింది. 1) కొటేషన్ల సమర్పణకు ప్రారంభ తేది/సమయం: 22.07.2024 02.00 PM 2) కొటేషన్ల సమర్పణకు ముగింపు తేది/ సమయం: 29.07.2024 03.00 PM 3) కొటేషన్ల తెరిచే తేది/ సమయం: 29.07.2024 04.00PM
Contact Details: The Municipal Commissioner Narayanakhed Municipality Cell No.9133449496, Email: maenarayankhed@gmail.com
Sd/- Commissioner, Narayankhed Municipality
DIPR R.O.No.2096-PP/CL/ADVT/1/2024-25, DT: 24.07.2024





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


కోటా కలహంలో బంగ్లా

పది రోజులపాటు తీవ్ర హింసనీ, రక్తపాతాన్ని చవిచూసిన బంగ్లాదేశ్ ప్రస్తుతం కర్ఫ్యూ కారణంగా నివురుగప్పిన నిప్పులాగా ఉంది. మళ్ళీ అగ్గిరాజుకుంటుందో, ప్రశాంతతనెలకొంటుందో ఇప్పుడే చెప్పలేం కానీ, రిజర్వేషన్ల రద్దుకోసం పోరాడిన యువకులమీద పోలీసులు, మిలటరీ అమానుషంగా విరుచుకుపడిన ఆ దృశ్యాలు మనసు కలిచివేస్తాయి. దాదాపు రెండువందలమంది యువకులు మరణించారు, వేలాదిమంది తీవ్రంగా గాయపడ్డారు. భద్రతాదళాలు అంత అరాచకంగా వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

బంగ్లాదేశ్ స్వాతంత్ర్యపోరాటంలో ప్రాణత్యాగం చేసినవారి కుటుంబీకులకు ప్రభుత్వోద్యోగాల్లో ముప్పైశాతం కోటానిచ్చే అంశం తిరిగి తెర మీదకు రావడం ఈ రక్తపాతానికి ప్రధాన కారణం. ఆరేళ్ళక్రితం ఇదే తరహా ఉద్యమాలవల్ల ఆ విధానాన్ని నిలుపుదలచేసిన హసీనా, ఇటీవల హైకోర్టు తీర్పు మేరకు మళ్ళీ దానిని పునరుద్ధరించేందుకు సిద్ధపడుతూండటంతో విద్యార్థులు రగిలిపోయారు. పాత రిజర్వేషన్ వ్యవస్థను పునరుద్ధరించమంటూ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు వెనుక హసీనా హస్తం ఉన్నదని వారు పరిపూర్ణంగా విశ్వసించారు. మిగతా రిజర్వేషన్లన్నీ కలుపుకుంటే యాభైఆరుశాతాన్ని దాటిపోయి, ఓపెన్ కాంపిటేషన్‌లో దక్కే ఉద్యోగాలు కుంచించుకుపోతాయి కనుక, విద్యార్థిలోకం ఈ కోటాకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడింది. ఉద్యమం యూనివర్శిటీలను దాటి అన్ని నగరాలకు విస్తరించింది. భద్రతాదళాలన్నీ ఏకమై విరుచుకుపడినా ప్రాణాలకు వెరవకుండా, తోటివారు కళ్ళముందే పిట్టల్లారాలిపోతున్నా జడవకుండా యువత పోరాడింది. దేశ స్వాతంత్ర్యపోరాటంలో ప్రాణత్యాగాలు చేసినవారి కుటుంబీకులను ఈ రీతిన ఆదుకోవాల్సిన బాధ్యత సమాజం మీద ఉన్నదని ప్రధాని షేక్ హసీనా వాదన సముచితమైనదే. ఆమె తండ్రి ముజిబూర్ రహ్మాన్ నాయకత్వంలో, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా, బంగ్లాదేశ్ సాగించిన విముక్తి పోరాటంలో లక్షలాదిమంది మరణించారు, వేలాదిమంది స్త్రీలు అత్యాచారాలకు గురైనారు. పాకిస్థాన్ సైన్యమూ, దానికి అండగా నిలిచిన శక్తులు కలసిచేసిన అకృత్యాలకు అంతేలేదు. చివరకు భారతసైన్యం ప్రవేశంతో కానీ తూర్పుపాకిస్థాన్‌కు విముక్తి దక్కలేదు. ఈ నేపథ్యంలో, స్వాతంత్ర్యానంతరం 1972నుంచి బంగ్లాదేశ్‌లో ఈ కోటా విధానం అమలులోకి వచ్చింది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పోరాడిందీ, ప్రాణాలు కోల్పోయిందీ ముజిబూర్ రహ్మాన్ సారథ్యంలోని శక్తులే కనుక, ఈ కోటా విధానం ఆయన అనుచరగణానికీ, పార్టీకే మేలుచేసిందన్న విమర్శలు సహజం. ఈ కోటాద్వారా ప్రభుత్వంలోని సమస్తవ్యవస్థల్లోనూ అవామీలీగ్ మనుషులు తిష్టవేశారని విపక్షనేతల విమర్శ. నిజానిజాలు అటుంచితే, ఇప్పటి విద్యార్థి ఉద్యమానికి విపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ మద్దతు ఇచ్చినంత మాత్రాన, కోటాకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నవారినంతా రజాకార్లుగా హసీనా అభివర్ణించడం ఉద్రిక్తతలను పెంచింది. పాకిస్థాన్‌తో అంటకాగి, తూర్పుపాకిస్థాన్‌లో స్థానికులపై అఘాయిత్యాలకు, ఊచకోతలకు కారకులైన రజాకార్ల పేరిట ఈ విమర్శలు చేయడం వారికీ, ప్రభుత్వానికీ మధ్య అగాధాన్ని పెంచింది. దీనికితోడు, హసీనా ప్రభుత్వాన్ని ఎన్నికలతో సహా సమస్త సందర్భాల్లోనూ కంటికిరెప్పలాగా కాపాడుకొచ్చే అవామీలీగ్ విద్యార్థివిభాగం కూడా ఈ సందర్భంలో సైనికబలగాలతో కలసి విద్యార్థులపై దాడులు సాగించింది.

ఈ తీవ్ర ఉద్రిక్త వాతావరణంలో, స్వాతంత్ర్యసమరయోధుల కోటాను 5శాతానికీ, మొత్తం రిజర్వేషన్లన్నీ ఏడుశాతానికీ పరిమితం చేస్తూ ఆదివారంనాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కోటా వ్యతిరేక విద్యార్థి ఉద్యమకారులకు అమితబలాన్నిచ్చింది. కానీ, హసీనా ప్రభుత్వం ఈ ఆదేశాలను వమ్ముచేయడానికి ప్రయత్నిస్తుందన్న అనుమానం వారిని ఇంకా వెంటాడుతోంది. ఈ కొత్త రిజర్వేషన్ల విధానాన్ని యథాతథంగా అమలులోకి తెచ్చేవరకూ పోరాటాన్ని ముగించబోమని, తాత్కాలికంగా నిలుపుదలచేస్తామని వారు ప్రకటించారు. హసీనా ప్రభుత్వం కూడా ఈ వ్యవహారాన్ని సాగదీయకుండా తక్షణమే పరిష్కరించడం సముచితం. బంగ్లాదేశ్‌లో ప్రతీ ఉద్యమంలోనూ, ప్రజాపోరాటాల్లోనూ విపక్ష బీఎన్పీతో పాటు దానికి మద్దతునిచ్చే ఇస్లామిక్ శక్తులు చేరడం, ప్రతిగా హసీనా తీవ్రంగా విరుచుకుపడటంతో అవి హింసాయుతంగా మారిపోతున్నాయి. హసీనా అభద్రత, పరిస్థితి తెలిసిందే కానీ, వరుసగా నాలుగుసార్లు గెలిచి, ఇటీవలే ఐదోసారి ప్రధాని అయిన ఆమె ఇంకా అదే అణచివేత ధోరణితో, అమానుషంగా వ్యవహరిస్తూ తీవ్రమైన అప్రదిష్ట మూటగట్టుకుంటున్నారు.

తూటాలతో మాటలను ముడిపెట్టవచ్చునా?




■ కె. శ్రీనివాస్

సందర్భం

డొనాల్డ్ ట్రంప్ మీద కాల్పులు జరిగి పదిరోజులు దాటిపోయింది. దుండగుడు చనిపోయాడు. అతను ట్రంప్ పార్టీ సభ్యుడే. దాడికి కారణాలేమిటో ఇంకా తెలియదు. ఈ ఏడాది చివర జరిగే ఎన్నికలకు ముందస్తుగా పార్టీల స్థాయిలో జరిగే ప్రచారకార్యక్రమంలో జరిగిన సంఘటన అది. ఒక మాజీ అధ్యక్షుడు, రానున్న ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థి అయిన నేత మీద దాడి జరగడం చిన్న విషయం కాదు. అమెరికన్ సమాజమే కాదు, యావత్ ప్రపంచమే నివ్వెరపోయిన సంఘటన అది. కానీ, ఇటువంటి దాడి సంఘటనలు భారత్ వంటి వర్ధమాన దేశాలలోనే కాదు, గొప్ప నాగరికత, ప్రజాస్వామిక చైతన్యం కలిగిన దేశంగా చెప్పుకునే అమెరికాలోనూ ఇంత బలంగా రాజకీయ ప్రభావం వేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

అక్కడి రెండు ప్రధాన పార్టీలలోనూ, ఎక్కువ మితవాదంతో ఉండే రిపబ్లికన్ పార్టీ, 2016 ఎన్నికల్లో ట్రంప్ వంటి తీవ్ర మితవాద నాయకుడి నాయకత్వంలో పోటీపడినప్పుడు, అక్కడి రాజకీయ సంవాదం కూడా ఒక కొత్త క్షీణతకు దిగజారింది. ట్రంప్ పాలనను చవిచూసిన తరువాత, 2020 ఎన్నికల్లో దేశంలోని ఉదారవాద, వామపక్ష, మధ్యేవాద మితవాద శ్రేణులన్నీ ఏకమై, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జోబైడెన్‌ని బలపరచి గెలిపించాయి. ఓడిపోయి, తన ఓటమిని ఒప్పుకోకుండా, రాజధానిలోని కేపిటల్ హిల్‌పై దాడికి తన అభిమానుల్ని ప్రేరేపించి, ట్రంప్ బాగా చెడ్డ పేరు తెచ్చుకున్నారు. అతను దిగిపోయినా, దేశంలో తీవ్ర మితవాద శక్తులు బలంగానే మిగిలాయి. రిపబ్లికన్ పార్టీలో ట్రంప్ ఆధిక్యమూ కొనసాగింది. అప్పుడు ఓడినా, ఇప్పుడు రెండో దఫా గెలవాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నానికి, బైడెన్ జరాభారం ఒక సానుకూలత కల్పించింది. ట్రంప్‌కూ బైడెన్‌కూ వయస్సులో పెద్ద తేడా ఏమీ లేదు. కానీ, వృద్ధాప్య బలహీనతలు ప్రస్ఫుటంగా వ్యక్తమవుతున్న బైడెన్ మొదటి వాగ్యుద్ధంలో నవ్వులపాలయ్యారు. అభ్యర్థిత్వం నుంచి తప్పుకోవలసిందిగా డెమొక్రాటిక్ పెద్దలు పోరుపెట్టారు. సరిగ్గా అప్పుడే ఈ దాడి జరిగింది. ట్రంప్ రేటింగ్ రివ్వున ఎగిసింది. కొవిడ్ మాటున బైడెన్ తప్పుకున్నారు. కమలా హారిస్ అభ్యర్థిత్వ అవకాశాలు పెరిగాయి.

దూకుడు మీద ఉన్న రిపబ్లికన్లకు ట్రంప్ మీద జరిగిన దాడి ఒక రాజకీయ అవకాశం ఇచ్చింది. దానితో, బైడెన్ కల్పించిన వాతావరణం వల్లనే దాడి జరిగిందన్న విమర్శ మొదలయింది. ట్రంప్ మీద గురిపెట్టాలి (ఇట్స్ టైమ్ టు పుట్ ట్రంప్ ఇన్ ఎ బుల్స్ ఐ), అని పార్టీ దోనర్లతో బైడెన్ ఫోన్‌లో అన్నారట. ఆ సందేశం తెలిసి, దుండగుడు నిజంగానే తుపాకీ గురిపెట్టాడట. పోనిస్తు ట్రంపును తిరిగి అధికారంలోకి రాకుండా ఎట్లాగైనా నివారించాలని డెమొక్రాటిక్ పార్టీ పదే పదే చేస్తున్న ప్రచారం అతన్ని భౌతికంగా నిర్మూలించాలన్న ప్రేరణ కలిగించిందని అనేకమంది రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదం అంటూ వామపక్షీయులు, మీడియా కలిసి చేసిన ప్రచారమే ఈ దాడికి కారణమని, బైడెన్ దీనికి బాధ్యుడని ఆరోపించారు. ఆ సాయుధుడిని పంపింది బైడెనే అని అన్నవారూ ఉన్నారు. ట్రంప్ మిత్ర దేశం రష్యా కూడా అదే అభిప్రాయం చెప్పింది. ట్రంప్ మీద దాడి వెనుక ఉన్నదనడం లేదు కానీ, బైడెన్ ప్రభుత్వమే దాడికి కావలసిన భావ వాతావరణాన్ని కల్పించిందని రష్యా వ్యాఖ్యానించింది.

రాజకీయ ప్రత్యర్థుల మీద విమర్శ భౌతిక దాడులకు కారణమవుతుందా? ఆ పేరుతో విమర్శలకు పాల్పడవద్దని, నిందించవద్దని రాజకీయపక్షాలను కోరవచ్చునా? భౌతిక దాడులు ప్రజాస్వామ్యంలో అవాంఛనీయాలని, విభేదాలతో వ్యవహరించడానికి హింస సాధనం కాదని పదే పదే చెప్పనక్కరలేదు. కానీ, ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు ఏవో సంఘటనలు జరుగుతాయి. వాటిని అనుమతించబోమని చెప్పడం, ఆ సంఘటనలకు నేపథ్యకారణాలను సరిదిద్దడం వంటి నివృత్తిచర్యలను చేయవలసి ఉంటుంది తప్ప, తీవ్రమైన రాజకీయ విమర్శలను నిషేధించడం ప్రజాస్వామ్య మౌలికతకే చేటు చేస్తుంది. ట్రంప్‌కు మిత్ర దేశమైన రష్యా స్పందనలకు అనుగుణంగానే, ట్రంప్‌కు, పుతిన్‌కు సన్నిహిత పక్షమైన భారతీయ జనతాపార్టీ కూడా వైఖరి తీసుకోవడం గమనించవలసిన పరిణామం.

ప్రధాని మోదీ మీద ప్రతిపక్షం హింసను ప్రేరేపించే భాషను ఉపయోగిస్తోందని భారతీయ జనతాపార్టీ ఐటీ విభాగం అధినేత అమిత్ మాలవీయ, రాజ్యసభ సభ్యుడు, పార్టీ అధికారప్రతినిధి అయిన సుధాంశు త్రివేది ఆరోపించారు. ట్రంప్ మీద హత్యాయత్నం నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం 'హింస', 'హత్య' వంటి మాటను ప్రధానిని ఉద్దేశించి వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు అడిగారు. రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష నాయకులు రెచ్చగొట్టే మాటలతో మోదీని విమర్శిస్తున్నారని వారు అన్నారు. ట్రంప్‌ను బైడెన్ వంటి వారు నియంత అన్నట్టుగానే, మోదీని కూడా రాహుల్‌గాంధీ ఆటువంటి భాషలో నిందిస్తున్నారని అమిత్ మాలవీయ విమర్శించారు. అంతర్జాతీయ వామపక్షీయుల దాడిని తట్టుకుని భారత ప్రజాస్వామ్యం నిలబడిందని, మోదీ మూడోసారి ప్రధాని అయ్యారని మాలవీయ ఒక కొత్త సూత్రీకరణ చేశారు.

నిజానికి రాజకీయ భాషలో విమర్శ, నింద, అభియోగం వంటివి అన్ని సందర్భాలలో ఒకే విధంగా ఉండవు. భూస్థాపితం చేస్తాం, ఓడిస్తాం, నిర్మూలిస్తాం, నామరూపాలు లేకుండా చేస్తాం వంటి ప్రయోగాలు వాస్తవంలో ప్రత్యర్థుల చర్యలను, సంస్థలను, లేదా, వారి విధానాలను ఉద్దేశించి చేస్తారు. వాటిని వాచ్యార్థంలో తీసుకోగూడదు. అటువంటి మాటల్లో కొన్నిటిలో సభ్యత లేదని అనవచ్చును కానీ, అవి నేరపూరితాలని అన్వయించలేము. కేసీఆర్, రేవంత్‌రెడ్డి వంటి వారి రాజకీయ భాషలో ఈ ప్రయోగాలు ఎక్కువగా గమనించవచ్చు. అన్ని ప్రాంతాల్లో, భాషల్లో కూడా ఈ యుద్ధభాష రాజకీయ సంవాదంలో కనిపిస్తుంది. సాధారణంగా అటువంటి ప్రయోగాలు ప్రత్యర్థులను అధికారంలోకి రానివ్వకుండా నిరోధించడం, బలహీనపరచడం, అక్రమాలకు బాధ్యులను చేయడం, చట్టపరంగా శిక్షించడం వంటి అర్థాలనే ఇస్తాయి. ఆలంకారికప్రయోగాలు సానుకూల అర్థాలలోనే కాదు, ప్రతికూల అర్థాలలోనూ ఉంటాయి. తుపాకీ పేల్చడం సాధన చేసేవారు, వలయాల మధ్య ఉండే బిందువును లక్ష్యంగా పెట్టుకుంటారు. ఆ బిందువునే 'బుల్స్ ఐ' అంటారు. లక్ష్యంగా ఒకరిని పెట్టుకోవడం అంటే, తుపాకీ గురి పెట్టమని కాదు.

ఆ మాటకు వస్తే, తీవ్రమితవాద, తీవ్రజాతీయవాద పక్షాలు వాడినంత హింసాత్మక భాష ఇతరులెవరూ వాడరు. ఆ పక్షాలు ఆ మాటలను జనసామాన్యం దగ్గర, వారి ఉద్వేగాలను ప్రేరేపిస్తూ వాడతాయి కాబట్టి, అవి నిజంగా ప్రమాదకరం. ఆ మాటలను నిజంగా ఆచరణలో పెడుతూ దాడులు జరుగుతాయి. అటువంటి దాడిభాష మాట్లాడడంలో ట్రంప్ ఆరితేరినవాడు. 2020 జనవరిలో కేపిటల్ హిల్ మీద దాడి జరగడానికి ముందు, ట్రంప్ తన అనుచరులకు ఇచ్చిన పిలుపు ఏమిటి? "దేశాన్ని తిరిగి స్వాధీనం చేసుకోండి" (టేక్ ద కంట్రీ బ్యాక్). ఆ ఎన్నికను తన నుండి అపహరించారని వాదించడమే కాక, దాన్ని తిరిగి పొందడానికి జనాన్ని రాజధానికి నడిపించాడతను.

తన ప్రచార ర్యాలీలలో నిరసన తెలిపే ప్రతిపక్ష కార్యకర్తలను "ఈడ్చిపారేయండి" అనడం ట్రంప్‌కు అలవాటు. "ఎవరన్నా విసరడానికి చేతిలో టమాటా పెట్టుకుని కనిపించారా వదలకండి, తొక్కిపారేయండి", అది మరో సందేశం! 2016 ప్రచారంలో ట్రంప్ తన ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా 'జైలుకు పంపండి ఆమెని' (లాక్ హర్ అప్) అని అరిచేవారు. ఇక మెక్సికన్లకు, ముస్లిములకు వ్యతిరేకంగా సభల్లో ఆయన చేసిన బెదిరింపులు, నినాదాలు, వ్యంగ్య వ్యాఖ్యలు అనేకం. అధికారంలోకి వచ్చాక కూడా అతని పద్ధతేమీ మారలేదు. సాయుధులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినప్పుడు వాటిని ఖండించడానికి ఆయనకు మనసొప్పేది కాదు. జార్జి ఫ్లాయిడ్ మరణం తరువాత, హింసాకాండ, లూటీలు జరుగుతున్నప్పుడు, నిరసనకారులు బందిపోట్లని, 'లూటింగ్ మొదలైతే షూటింగ్ మొదలవుతుంది' అని చేసిన వ్యాఖ్యలకు ఎంతో నిరసన వ్యక్తమైంది. ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్ వంటి నేతలు మైనారిటీల మీదా, వలసదారుల మీదా చేసే విద్వేషపూరిత వ్యాఖ్యలు సమాజాన్ని హింసాత్మకంగా మార్చాయి. భారతదేశంలో కూడా 2024 ఎన్నికల ప్రచారంలో సాక్షాత్తూ ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలు ఎంతటి విస్ఫోటన శీలంగా ఉన్నాయో తెలిసిందే.

తమ తీవ్ర విధానాల కారణంగా, వ్యక్తిగతంగా దూకుడు స్వభావం వల్లా ఎంతో అతిశయంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు కనిపించే నాయకులు, ఎంతో కొంత బాధితులైనప్పుడు, ఆ సందర్భంలో ఎంతో బేలగా కనిపిస్తారు. నిన్నటి వరకు తమ అవక్రపరాక్రమంతో ప్రయోజనం పొందిన వారు, ఇప్పటి బలహీనత నుంచి కూడా లాభం పొందాలని చూస్తారు. ట్రంప్‌ను చూడండి, ఆ క్షణంలో దేవుని దయ వల్ల నేను తప్పుకుని ఉండకపోతే, మీ ముందు ఇట్లా నిలబడేవాణ్ణి కాదు అని కనీసం నాలుగైదు సార్లన్నా సమావేశాల్లో అని ఉంటారు. ఓట్లు తగ్గిన ప్రాభవం తగ్గిన మోదీని చూడండి, తనను రెండున్నర గంటలు మాట్లాడనివ్వలేదని, తనతో పాటు పార్లమెంటు సభ్యుల హక్కులన్నీ హననం అయ్యాయని ఆవేదన ప్రకటిస్తున్నారు. నేను గెలిచాను, మూడోసారి ప్రధాని అయ్యాను, అయినా ఎందుకు ఈ వాస్తవాన్ని గుర్తించరు? అని పదే పదే బాధపడుతున్నారు.

మాటలతో, నికరమైన ప్రజాస్వామిక ఆచరణలతో రాజకీయ విభేదాలను, ప్రత్యామ్నాయాలను సాధన చేసే అవకాశం ఉన్నప్పుడు, ఎంతటి తీవ్ర విమర్శ కూడా అవాంఛనీయ రూపం తీసుకోదు. విసుగుచెందినవారో, నిస్పృహ చెందినవారో, తీవ్రబాధితులో చేసే చర్యలకు కారణాలను తమ చర్యలలో, వైఫల్యాలలో కాక, రాజకీయ ప్రతిపక్షంలో వెదకడం సమంజసం కాదు.

> తమ తీవ్ర విధానాల కారణంగా, వ్యక్తిగతంగా దూకుడు స్వభావం వల్లా ఎంతో అతిశయంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు కనిపించే నాయకులు, ఎంతో కొంత బాధితులైనప్పుడు, ఆ సందర్భంలో బేలగా కనిపిస్తారు. నిన్నటివరకు తమ అవక్రపరాక్రమంతో ప్రయోజనం పొందినవారు, ఇప్పటి బలహీనత నుంచి కూడా లాభం పొందాలని చూస్తారు. ట్రంప్‌ను చూడండి, ఆ క్షణంలో దేవుని దయ వల్ల నేను తప్పుకుని ఉండకపోతే, మీ ముందు ఇట్లా నిలబడేవాణ్ణి కాదు అని కనీసం నాలుగైదు సార్లన్నా సమావేశాల్లో అని ఉంటారు. ఓట్లు తగ్గిన, ప్రాభవం తగ్గిన మోదీని చూడండి, తనను రెండున్నర గంటలు మాట్లాడనివ్వలేదని, తనతో పాటు పార్లమెంటు సభ్యుల హక్కులన్నీ హననం అయ్యాయని ఆవేదన ప్రకటిస్తున్నారు.

> దూకుడు మీద ఉన్న రిపబ్లికన్లకు ట్రంప్ మీద జరిగిన దాడి ఒక రాజకీయ అవకాశం ఇచ్చింది. దానితో, బైడెన్ కల్పించిన వాతావరణం వల్లనే దాడి జరిగిందన్న విమర్శ మొదలయింది. ట్రంప్ మీద గురిపెట్టాలి (ఇట్స్ టైమ్ టు పుట్ ట్రంప్ ఇన్ ఎ బుల్స్ ఐ), అని పార్టీ దోనర్లతో బైడెన్ ఫోన్‌లో అన్నారట. ఆ సందేశం తెలిసి, దుండగుడు నిజంగానే తుపాకీ గురిపెట్టాడట.

ఈ వివక్షతో 'వికసిత్ భారత్' సాధ్యమా?

చిన్న రాష్ట్రాల ఛాంపియన్‌గా తనను తాను అభివర్ణించుకునే బీజేపీ డిక్షనరీలో అది నిజానికి ఒక పడికట్టు పదం మాత్రమే. కాకినాడ తీర్మానం నాడు చిన్న రాష్ట్రాల అవసరంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం అవశ్యమన్నపుడు బీజేపీకి తెలంగాణ రాష్ట్రం ఒక ప్రధాన అంశం. కానీ, పదేళ్ల క్రితం కాంగ్రెస్ నేతృత్వంలో సోనియాగాంధీ నిర్ణయం మేరకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రం ఏర్పడ్డనాడు బీజేపీకి 'తెలంగాణ' అన్నది ఒక పడికట్టు పదంగా మారింది.

నిన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పదం గానీ, తెలంగాణ అభివృద్ధి గాని కనిపించకపోవడం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమికి ఎలాంటి ఆశ్చర్యాన్ని కలిగించలేదు. తెలంగాణ లాంటి అభివృద్ధి చెందాల్సిన, ప్రగతి పథంలో పయనించాల్సిన రాష్ట్రాల పట్ల బీజేపీ వివక్షపూరిత విధానాలకు ఇది మరొక ఉదాహరణ.



ముఖ్యంగా తెలంగాణలో రైల్వేల అభివృద్ధి పట్ల చూపుతున్న నిర్లక్ష్యం ఇప్పటిది కాదు. కాంగ్రెస్ గానీ, ఆ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వాలు గానీ తెలంగాణ రాష్ట్రం మీదుగా రైల్వే లైన్ల ఏర్పాటుకు, మెరుగుదలకు ఎంతో కృషి చేసారు. వాస్తవానికి ఇప్పటివరకు ఈ ప్రాంతీయులెవరూ రైల్వే మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టలేదు. జనతా పార్టీ హయాంలో ఒకసారి మధు దండావతే రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడి రైల్వేల అభివృద్ధి పట్ల ఒకింత ఆసక్తి చూపెట్టిన ప్రభుత్వాలు, తదనంతర కాలంలో రైల్వేల అభివృద్ధి పట్ల శ్రద్ధచూపలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సందర్భం మినహా ఎప్పుడూ కూడా ఇక్కడ రైల్వే లైన్ల విస్తరణ జరగలేదు. పదేళ్ళుగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలో ఉన్న కాలంలో ఇక్కడ రైల్వేల అభివృద్ధి ఎక్కడిదక్కడే నిలిచిపోయింది. నార్త్ సౌత్ ఇండియా గేట్‌వేగా పరిగణించబడుతున్న కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు గురించి గానీ, ఓవర్ హాల్ యూనిట్ ఏర్పాటు అంశంలో కాంగ్రెస్ హయాంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలుపరిచే ప్రక్రియలో గాని, కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంలో చేపట్టాల్సిన చర్యల విషయంలో గానీ ఎలాంటి ముందడుగు పడలేదు. దానికి తోడు నిన్న విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు అసాధ్యం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విశిష్ట విద్యాసంస్థలను ఏర్పాటు చేయడంలో, జాతీయ స్థాయి విద్యాసంస్థలను ఏర్పాటు చేయడంలోనూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలాంటి ఆసక్తి చూపెట్ట లేదు. అంతేగాక, తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యం, మౌలిక అవసరాల మెరుగుదల విషయంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టాలని భావించిన అనేక చర్యలను బీజేపీ తన వికసిత్ భారత్ అంశం నుంచి తొలగించింది. వివక్షాపూరిత విధానాలతో ఈ ప్రాంతాన్ని వెనకపట్టు పట్టేలా చేస్తున్నది. ఇక్కడి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించడంలో కూడా ఆసక్తి చూపడం లేదు. కేవలం అధికారంలో కొనసాగడం కోసం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలుగా ఉన్న, ఆ కూటమికి మద్దతిస్తున్న పార్టీల ప్రాతినిధ్యం ఉన్న రాష్ట్రాలకు పథకాలు ప్రగతి ఫలాలు ఇవ్వటాన్ని ప్రజలు గమనిస్తున్నారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పట్ల ఏ మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపలేదు.

రాష్ట్రాల విభజన చట్టం పరిధిలో ఉన్న అన్ని మౌలిక అవసరాల మెరుగుదల కోసం పరిగణనలోకి తీసుకోవాల్సిన ఒక ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ. ఈ రాష్ట్రాన్ని చిన్న రాష్ట్రంగా కాకుండా కొత్తగా ఏర్పడిన రాష్ట్రంగా మరింత ప్రగతి పథంలోకి తీసుకువెళ్లే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నేతృత్వంలో ఉన్న ఇండియా కూటమి కూడా అదే ప్రయత్నం చేస్తున్నది. ఆ దిశగా చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేసిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ నాడు తీసుకున్న నిర్ణయాన్ని అమలుపరచడంలో అప్పుడున్న కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసింది.

యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన అనంతరం వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం తెలంగాణ ప్రగతి విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు నిరాశాజనకంగా ఉన్నాయి. అదే క్రమంలో వ్యవసాయ చట్టం ప్రవేశపెట్టిన సందర్భంలోనూ, ఇతర ప్రజా వ్యతిరేక చట్టాల అమలు వేళలలోనూ అప్పుడున్న భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతిచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కూడా ఇక్కడి నిరాశాజనకమైన ప్రగతికి ముఖ్యకారణంగా మనం చెప్పుకోవాలి. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలోని జాతీయస్థాయి విద్యాసంస్థల మెరుగుదల కోసం కానీ జాతీయ స్థాయిలో తీసుకోవాల్సిన వివిధ నిర్ణయాల అమలు విషయంలో కానీ ఎలాంటి శ్రద్ధ చూపలేదు.

వికసిత్ భారత్ నినాదంతో 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచ అగ్ర రాజ్యాల్లో ఒక రాజ్యంగా తీసుకువెళ్తానని చెప్తున్న భారతీయ జనతా పార్టీ మరోపక్క సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నది. సమాఖ్య స్ఫూర్తితో వివిధ రాష్ట్రాలను ఒకే రీతిలో ప్రగతి వైపు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉంది. సమాఖ్య స్ఫూర్తితో తీసుకునే నిర్ణయాలు అన్ని రాష్ట్రాల్లో అన్ని వనరులను వినియోగించుకునే రీతిలో ఉండాలి. మౌలిక వనరుల మెరుగుదల, మౌలిక సౌకర్యాల మెరుగుదల అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే రీతిలో మెరుగుపడాలి. కానీ బీజేపీ సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా తన రాజకీయ అవసరాలకు అనుగుణంగా కేవలం బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అతివృష్టి లాంటి అభివృద్ధిని చూపెడుతూ, మిగతా రాష్ట్రాలకు అనావృష్టి తరహా అభివృద్ధిని చూపెడుతున్నది. ఇప్పుడున్న పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ వివక్షపూరిత విధానాల వల్ల వికసిత్ భారత్ నినాదం కార్యరూపం దాలుస్తుందా అన్నది అనుమానమే. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన భారతీయ జనతా పార్టీ ఎంపీలు గాని, అదే విధంగా ఇతర పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తూ బీజేపీ నిర్ణయాల పట్ల కిమ్మనకుండా ఉన్నటువంటి వివిధ రాజకీయ పార్టీల నాయకులు గాని వికసిత్ భారత్ అనే నినాదానికి భిన్నంగా వ్యవహరిస్తున్నట్టే వారు బీజేపీ అమలులో పెడుతున్న ఈ వివక్షాపూరిత విధానాలను ఖండిస్తేనే తెలంగాణ అభివృద్ధి దిశవైపు అడుగులు వేస్తుంది.

> ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పదం గాని, తెలంగాణ అభివృద్ధి గాని కనిపించకపోవడం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమికి ఎలాంటి ఆశ్చర్యాన్ని కలిగించలేదు. వికసిత్ భారత్ నినాదంతో 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచ అగ్ర రాజ్యాల్లో ఒక రాజ్యంగా తీసుకువెళ్తానని చెప్తున్న భారతీయ జనతా పార్టీ మరోపక్క సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నది.

• డాక్టర్ కడియం కావ్య
పార్లమెంట్ సభ్యురాలు, వరంగల్

'చేయూత' ఎవరికి?

ఎన్నికల హామీలలో భాగంగా ప్రకటించిన 'చేయూత' నెలవారీ పింఛనును రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంది. అందులో భాగంగా గత ప్రభుత్వం మంజూరు చేసిన 'ఆసరా' పెన్షన్ పథకంలో లోపాలను సరిదిద్దాలి. గతంలో 65 సంవత్సరాలు నిండిన దుర్బలులైన వ్యక్తులు, నేత, గౌడ, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, అంగవికలురు, బోదకాలు కలిగిన వారికి 'ఆసరా' పథకాన్ని 2014 నవంబర్‌లో ప్రారంభించారు. మార్చి 2018 నాటికి 42 లక్షల మంది లబ్ధిదారులకు 5,500 కోట్ల రూపాయలు ప్రభుత్వం అందజేసింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'ఆసరా' అర్హతను 65 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు కుదించారు. దీంతో 44 లక్షల మంది ఈ పెన్షను పొందుతున్నారు.

సమాజంలో దుర్బలులైన వ్యక్తులు ఎవరు? 65 సంవత్సరాల వారా, 57 సంవత్సరాల వారా? 60 సంవత్సరాలు నిండినవారిని ప్రభుత్వం వయోవృద్ధులుగా గుర్తిస్తున్నది. దుర్బలులు కాబట్టి పెన్షన్ వారికి ఇస్తే బాగుంటుంది. అసలు పెన్షన్ లాభోక్తులలో ఎంతమంది జీవించి ఉన్నారో ముఖ్యంగా పట్టణాల్లో తెలియదు. కారణం ఏటిఎంల ద్వారా పింఛను డ్రా చేస్తారు. అదే గ్రామాల్లో అయితే బ్యాంకుల ద్వారా డ్రా చేస్తారు. అంతేకాక పట్టణాల్లో ఇతర వృత్తులు కూడా చేసుకుంటూ ఉంటారు. గ్రామాల్లో గాని, పట్టణాల్లో గాని లబ్ధిదారులు సంవత్సరానికొకసారి జీవన ప్రమాణ పత్రం అందజేయాలి. 'చేయూత' పింఛన్ లాభోక్తులను గ్రామాల్లో గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తారు. పట్టణాల్లో 57 సంవత్సరాలు నిండిన వారిని కాకుండా 60 సంవత్సరాలు నిండిన వయోవృద్ధులను ఎంపిక చేయాలి.

తెలంగాణలో ప్రస్తుతం 90 లక్షల రేషన్ కార్డులుండగా 44 లక్షల మంది అంటే దాదాపు సగం మంది 'ఆసరా' పెన్షన్లు పొందుతున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పెన్షన్ నాలుగువేల రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చిన నేపథ్యంలో 'చేయూత' నెలవారీ పింఛన్ పథకం ద్వారా ప్రభుత్వంపై ఆర్థిక భారం అధికమవుతుంది. 'ఆసరా'లో ఉన్న లోటుపాట్లను సవరించి పకడ్బందీగా అమలు చేసినప్పుడు మాత్రమే 'చేయూత' పెన్షన్ పథకం విజయవంతం అవుతుంది.

– ఎం. నిజాముద్దీన్, వరంగల్

అందుకే, ఇప్పుడు తెలంగాణలో 8 + 8 = 0!

వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఏ మూల కూర్చున్నా ముక్క దొరుకుతుందన్నది సామెత! 2023–24 కేంద్ర బడ్జెట్ ఈ సామెత అతికినట్టు సరిపోతుంది. బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు ఎందుకిచ్చినరో దేశమంతా అందరికీ అర్థమైన విషయమే. ప్రస్తుతానికి నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడు వీళ్ళిద్దరిలో ఎవరు నొచ్చుకున్నా కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడ గుచ్చుకుంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు, ఆ విషయం బీజేపీ నాయకత్వానికి బాగా తెలుసు. అందుకే ఈ అదనపు వడ్డింపులు. అడిగిందే అన్నీ ఇచ్చి తరించేసారు. నిర్మల సీతారామన్ బడ్జెట్ ప్రసంగం చదివేప్పుడు బిహార్, ఏపీకి ఇవ్వాలనుకున్నవి ఇచ్చి, ఆ రెండు రాష్ట్రాల ఎంపీల మెప్పుకోసమా అన్నట్టు ప్రదర్శించిన హావభావాలు ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వ పరిస్థితి వచ్చే ఐదేళ్ళూ ఎట్లా ఉండబోతుందో చెప్పకనే చెప్పాయి. ఇతర రాష్ట్రాలు, ఆయా పార్టీల ఎంపీల స్పందనతో సంబంధం లేనట్లుగా, ఈ అదనపు సంతర్పణ ఎవర్ని ఆదేశించి చేసారో వారు ఖుషీ అయితే చాలన్నట్లుగా ప్రవర్తించిన తీరు బీజేపీ గత వైఖరికీ నేటి పరిస్థితికీ ఉన్న తేడాను స్పష్టం చేసింది. గతంలో అత్యంత శక్తిమంతుడిగా, మేరునగధీరుడని ప్రశంసింపబడిన మోదీ బేలతనం సంకీర్ణ ప్రభుత్వ పరిస్థితుల్లో నేడు దేశం ముందు ఆవిష్కృతమైంది.

మొత్తంగా ఈ బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక కేటాయింపుల విషయంలో పూర్తిగా నిరాశ కల్పించిందనడంలో సందేహం లేదు. ఏపీకి అదనంగా నిధులొచ్చినందుకు అభ్యంతరమూ లేదు. బడ్జెట్ అనేది అంకెల కూర్పు లేదా కేంద్ర ప్రభుత్వ శాఖల వారీ కేటాయింపుల వ్యవహారమే కాదు, అది కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలికి, భవిష్యత్ ప్రయాణ తీరుకు సంకేతం. ఆ రకంగా రాబోయే ఐదేళ్లు తెలంగాణ పట్ల మోదీ ప్రభుత్వ తీరు ఎట్లుంటదనేదానికి ఈ బడ్జెట్‌లో తెలంగాణకు వచ్చిన గుండు సున్నా ఒక స్పష్టమైన సంకేతం. బడ్జెట్ అనంతరం జరిగిన చర్చల్లో బీజేపీ నాయకుల వాదన అత్యంత పేలవంగా ఉంది. ఈ బడ్జెట్ రాష్ట్రాల వారీ కేటాయింపులు కాదు, శాఖల వారి కేటాయింపులు అని సమర్థిస్తారు. ఒక వేపు కండ్ల ముందు బిహార్, ఏపీ, హిమాచల్, అస్సాం లాంటి రాష్ట్రాల ప్రస్తావన చేస్తే ఈ లాజిక్ లేని మాట లేందో వారికే తెలియాలి. మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్ గురించి చెప్పలే, యూపీ గురించి చెప్పలే అంటరు, అంటే అవేమైనా ప్రామాణికమా? అడిగేది తెలంగాణ గురించైతే సమాధానం ఇలా డొంక తిరుగుడైతే ఎట్లా? విభజన చట్టం గురించి ప్రస్తావిస్తూ ఏపీ గురించి మాట్లాడిన కేంద్ర ఆర్థికమంత్రి తెలంగాణ వెనుకబడిన ప్రాంతాల గురించి ఎందుకు మాట్లాడలేదంటే నో ఆన్సర్!

బడ్జెట్ సందర్భంగా ఏపీకి చెందిన రామ్మోహన్ నాయుడు, ఇతర ఎంపీలు వాళ్ళ రాష్ట్రానికి వచ్చిన కేటాయింపులు చంద్రబాబునాయుడు తెచ్చారని చెప్పుకుంటున్నారు. తెలంగాణ ప్రజలు కూడా ఈ రాష్ట్రానికి సంబంధించి కేంద్రమంత్రులు, అధికార పార్టీ ఎంపీలు మాట్లాడాలని కోరుకోవడం సహజమే కదా. కానీ ఈ వ్యాసం రాస్తున్న సమయం వరకూ తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కానీ, ఎంపీలు కానీ స్పందించలేదు. బండి సంజయ్ ఉల్టా కేటాయింపుల్లో అన్యాయం గురించి ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ పార్టీదే మూర్ఖత్వమంటున్నారు! ఆర్థికమంత్రి ప్రసంగంలో హైదరాబాద్–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ గురించి మాట్లాడలేదా, ఆ మొత్తం మార్గంలో 200కి.మీ పైగా తెలంగాణలోనే ఉన్నది కదా అన్నట్టు మాట్లాడుతున్నారు. అయ్యా మంత్రి గారూ, నిర్మల సీతారామన్ చెప్పింది ఆ కారిడార్‌లోని ఓర్వకల్లు నోడ్‌కు కేటాయింపులు మాత్రమే. తమరు మరింత సమాచారం తీసుకొని, అప్పుడు అవసరమనుకుంటే మమ్మల్ని మరింత విమర్శించండి! ఒక కేంద్ర మంత్రి ఇంత అవగాహనా రాహిత్యంతో మాట్లాడడం దురదృష్టకరం. రానియి రాకనే పాయె, మీ ఈ పుండు మీద కారం చల్లే మాటలు తెలంగాణ ప్రజలను మరింత బాధిస్తున్నాయి!

తెలంగాణ వాళ్ళుగా మనకేమీ రాకపోతే ప్రశ్నించొద్దా? ఆంధ్రకు, బిహార్‌కు నిధులిస్తే ఎవ్వరం బాధపడాల్సిన అవసరం లేదు. కానీ మనకు కూడా సాధించుకోవాల్సిన అంశాలు ఉన్నాయి. అవి రానప్పుడు మేం పెదవి విప్పం, ఇతరులు కూడా విప్పొద్దు అనుకోవడం పిరికితనం, భావదారిద్ర్యం. రాష్ట్ర ప్రయోజనాలను, ప్రత్యేకించి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా, అదే ప్రభుత్వం మూడోసారి వచ్చినా, కేంద్రమంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉండి కూడా, ఈసారి తెలంగాణ నుంచి బీజేపీకి ఎన్నడూ లేనంత ఆదరణ దొరికినా కూడా ఇలాగే కుక్కిన పేనుల్లాగా పడి ఉంటాం, ఇచ్చిందే మహద్భాగ్యం అంటాం అంటే దానికి తెలంగాణ ప్రజలు వత్తాసు పలకరు! ఎనిమిదిమంది ఎంపీలను గెలిపించిన ప్రజలు ఆ ఎంపీలు ప్రత్యేకంగా తమ రాష్ట్రానికి ఏమైనా సాధిస్తారని ఆశపడడం తప్పు కాదు కదా. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన పన్నుల్లో వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాలు ఎవరున్నా లేకున్నా వస్తాయి. మరి ఇంతమంది ఉండి ఏం లాభం, ఇద్దరు మంత్రులు ఉండీ ఏం ప్రయోజనం?

ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే 'తన దాకా వస్తే కానీ తత్త్వం బోధపడదన్నట్లు' కేంద్ర వ్యవహారశైలి, తెలంగాణ పట్ల వారి వైఖరి ఈ ఒక్క బడ్జెట్‌తో తెలిసొచ్చినట్టుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యత నెరపలేదు, గౌరవించలేదు, అందుకే రాష్ట్రానికి నష్టం జరిగిందన్నారు. మరిప్పుడేమైంది? ముఖ్యమంత్రి విన్నపాలిచ్చారు, బహిరంగ సభలో మోదీ గారిని బడే భాయ్ అన్నారు. ఫలితం గుండు సున్నా! ఇప్పుడు కేంద్రంపై పోరాటంలో బీఆర్ఎస్ కలిసి రావాలంటున్నారు. గతంలో మీరెప్పుడన్నా కలిసి వచ్చారా? గతంలో బీఆర్ఎస్ వైఫల్యం అన్న కాంగ్రెస్ పెద్దలు, ఇప్పుడు మరి దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా అంగీకరిస్తారా? రేవంత్‌రెడ్డి ఇప్పుడు దక్షిణాది ప్రస్తావన తెచ్చారు. గతంలో అదే విషయంపై బీఆర్ఎస్ మాట్లాడితే ప్రాంత భేదాలన్నారు. అందుకే తాత పళ్లెందడిలోనే ఉంటుంది అంటారు. ప్రజలేం మర్చిపోరు.

ఇకపోతే బడ్జెట్‌లోని కొన్ని ఇతర అంశాలకు వస్తే శాఖలవారీ కేటాయింపుల్లో హెచ్చు తగ్గులు, ప్రాధాన్యాల్లో మార్పులు, ఇతరత్రా సాంకేతిక అంశాలు షరా మామూలే. కానీ సాధారణ జనానికి అర్థం కానిదేంటంటే వికసిత భారత్‌లో ప్రతి రోజూ నూతన గిరిశిఖరాలను అందుకుంటున్న నిత్యావసర వస్తువుల ధరలు ఎందుకు తగ్గట్లేదనేది. ద్రవ్యోల్బణం అదుపులో ఉందని సెలవిచ్చే మంత్రిగారు ఈ అంశంపై సమాధానమివ్వరు. అదసలు మాట్లాడాల్సిన విషయం కాదనుకుంటారేమో! ఆక్ట్ అఫ్ గాడ్ ఒకటుంది కదా, అదే కారణమయ్యుంటుంది! ఇక పదిహేనేళ్ళ క్రితం కొనుకున్న ఆస్తులు విక్రయిస్తే వచ్చే లాభాలకు కూడా పన్ను 12.5శాతం అంటున్నారు. ఇది మధ్యతరగతికి పెద్ద దెబ్బే! సాంప్రదాయిక పెట్టుబడుల అలవాటును తప్పించి, ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులను ప్రోత్సహించి, వాటి లాభాలపై అధిక పన్నులు కూడా సాధారణ ప్రజలకు నిరుత్సాహాన్ని కలిగించేదే. మొత్తానికి బడ్జెట్ ప్రసంగం 'నా వార్తలు నా ఇష్టం, ఓపిక ఉంటే భరించండి లేకుంటే మీ ఇష్టం' అన్నట్టుంది.

కాబట్టి ఇప్పటికైనా తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలి. రాజకీయాలకతీతంగా, జీ హుజూర్ పద్ధతులు పక్కన పెట్టి, రాష్ట్ర అవసరాల కోసం స్వార్థంతో కృషి చేయాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది. లేదంటే ప్రజలు మిమ్మల్ని తప్పించటానికి ఎంతో సమయం పట్టదు!

> తెలంగాణ వాళ్ళుగా మనకేమీ రాకపోతే ప్రశ్నించొద్దా? ఆంధ్రకు, బిహార్‌కు నిధులిస్తే ఎవ్వరం బాధపడాల్సిన అవసరం లేదు. కానీ మనకు కూడా సాధించుకోవాల్సిన అంశాలు ఉన్నాయి. అవి రానప్పుడు మేం పెదవి విప్పం, ఇతరులు కూడా విప్పొద్దు అనుకోవడం పిరికితనం, భావదారిద్ర్యం. ఎనిమిదిమంది బీజేపీ ఎంపీలను గెలిపించిన ప్రజలు ఆ ఎంపీలు ప్రత్యేకంగా తమ రాష్ట్రానికి ఏమైనా సాధిస్తారని ఆశపడడం తప్పు కాదు కదా. ఇంతమంది ఉండి ఏం లాభం, ఇద్దరు మంత్రులు ఉండీ ఏం ప్రయోజనం?




■ రావుల శ్రీధర్ రెడ్డి
బీఆర్ఎస్ నేత

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.6 కనిష్ఠం 23.6

- సెల్లార్లు, తాళం వేసిన ఇళ్లు, రోడ్లపై నిలిచిన నీళ్లు, నిర్మాణంలో ఉన్న భవనాల్లో విజృంభణ
- ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న దోమలు
- డెంగీ, చికున్‌గున్యా, ఇతర జ్వరాల వ్యాప్తికి కారణమిదే
- ఎంటమాలజీ పరిశీలనలో గుర్తింపు
- నిర్మూలనపై దృష్టిసారించిన జీహెచ్‌ఎంసీ

దోమలు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయి. నగరంలోని మూడు శాతం ఇళ్లలో లార్వాను అధికారులు గుర్తించారు. నిర్మూలన చర్యలు ప్రారంభించారు.





వామ్మో.. లార్వా

సర్వాంతర్యామిగా విస్తరణ

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహా నగరం దోమల ఆవాసంగా మారుతోంది. చెరువులు, నాలాల పక్కనే కాదు.. భవన నిర్మాణ ప్రదేశాలు.. ఖాళీ స్థలాలు.. సెల్లార్లు.. ఫంక్షన్ హాళ్లు.. తాళం వేసి ఉన్న ఇళ్లు దోమల వృద్ధికి ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి. పలు ప్రాంతాల్లో నిలిచి ఉన్న నీటిలో లార్వా దర్శనమిస్తోంది. ప్రస్తుతం కుటుంబాలు నివసిస్తోన్న పలు ఇళ్లలోనూ అదే పరిస్థితి. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ విషయాన్ని గుర్తించారు. భవన నిర్మాణాలు జరిగే చాలా ప్రాంతాల్లో కనీస జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదని నిర్ధారణకు వచ్చారు. నిర్మాణంలో భాగంగా వినియోగించే నీటితోపాటు.. వర్షపు నీరూ సైట్‌లో నిలుస్తోంది. ఆ నీటిలో లార్వా వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తికి దారి తీస్తుందని అధికారులు చెబుతున్నారు. ఫంక్షన్ హాళ్లలోనూ అపరిశుభ్ర పరిసరాలు.. చెత్తను రోడ్లపై వేయడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లలో నిలిచిన వర్షపు నీటిలో లార్వాను గుర్తించారు.

నెలల తరబడి తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. డ్రమ్ములు, బకెట్లలో నీరు నిల్వ ఉంటే లార్వా వృద్ధి చెందుతోంది.

మూడు శాతం ఇళ్లలో..

నగరంలో 20 లక్షలకుపైగా ఇళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో రెండు నుంచి మూడు శాతం ఇంటి పరిసరాల్లో లార్వా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఎక్కువ ఇళ్లలో లార్వా ఉన్నట్టు గుర్తించిన కాలనీలు, బస్తీల్లో స్థానికులకు అవగాహన కల్పించడంతోపాటు.. యాంటీ లార్వల్ ఆపరేషన్(ఏఎల్‌ఓ), ఫాగింగ్ విస్తృతం చేయనున్నారు.

డెంగీ డేంజర్ బెల్స్..

గ్రేటర్‌లో డెంగీ కేసుల నమోదు పెరుగుతోంది. దీంతో అవగాహన కల్పిస్తూ ప్రజలను దోమల నిర్మూలన చర్యల్లో భాగస్వాములను చేసే దిశగా అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నారు. కాలనీలు, బస్తీలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. ఇళ్లలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని

మిగతా 8వ పేజీలో..



లార్వా అధికంగా ఉన్న ప్రాంతాలు

జోన్	నిర్మాణ ప్రదేశాలు	ఫంక్షన్ హాళ్లు	సెల్లార్లు	ఖాళీ స్థలాలు	తాళం వేసిన ఇళ్లు
ఎల్‌బీనగర్	578	111	213	873	1,264
చార్మినార్	732	286	464	520	1,856
ఖైరతాబాద్	977	109	1,103	626	1,336
సికింద్రాబాద్	993	127	1,049	1,307	1,772
శేరిలింగంపల్లి	1,141	51	1,044	1,303	1,235
కూకట్‌పల్లి	1,957	82	708	1,577	2,312



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ చంద్రకాంత్

మహిళా శక్తిపై అవగాహన

- పొదుపు సంఘాలకు ఆర్థిక ప్రోత్సాహం ● జీహెచ్‌ఎంసీ నిర్ణయం

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మహిళా శక్తి పథకంపై పొదుపు సంఘాలకు అవగాహన కల్పించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. కేంద్ర బడ్జెట్‌లో మహిళలు స్వయంశక్తితో ఎదిగేలా పలు ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రకటించారు. మహిళాశక్తి పథకం కింద క్యాంటీన్లు, కేటరింగ్ యూనిట్లు, తెలంగాణ పిండివంటలు, బొటిక్స్, పిండిగిర్ని, డీటీపీ జిరాక్స్ సెంటర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ యూనిట్లు తదితరాలు ఏర్పాటు చేసుకునే అవకాశముంది. ఆయా పథకాల ఏర్పాటు వల్ల ప్రయోజనం, ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహకం పొందడం ఎలా..? అన్న దానిపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం బల్దియా కేంద్ర కార్యాలయంలో అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్(యసీడీ) అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి టౌన్ లెవల్ ఫెడరేషన్ లీడర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మేజర్‌గ్రూప్ ఎంటర్‌ప్రైజెస్‌గా ఫుడ్‌ట్రాక్స్, కోల్డ్ స్టోరేజీ, మీ-సేవా కేంద్రాలు, నిర్మాణరంగ పరికరాల తయారీ, మేజర్ వ్యక్తిగత కేటగిరీలో పిండివంటలు, పచ్చళ్లు-పొడులు, పాలఉత్పత్తులు, హ్యాండ్‌మేడ్ క్రాఫ్టులు, కిరాణ దుకాణాలు, నర్సరీలు ఏర్పాటు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

బోనాల్లో అసభ్య ప్రవర్తన

- 117 మంది పోకిరీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న షీటీమ్స్

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయిని మహాకాళి బోనాల సందర్భంగా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోకిరీలను షీటీమ్స్ అదుపులోకి తీసుకుంది. బోనాల వేడుకల్లో భాగంగా భక్తులు, మహిళలు, యువతులపై కొంతమంది పోకిరీలు కామెంట్లు చేయడం, తాకడం, వెకిలి చేష్టలు చేశారు. వీటిని సీపీ ఆదేశాల మేరకు మఫ్టీలో ఉన్న షీటీమ్స్ సిబ్బంది రికార్డు చేసి 117 మందిని అదుపులోకి తీసుకున్నారు. కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ప్రత్యేక నంబర్ల వేలం..
ఆర్టీఏకు రూ.51.17 లక్షల ఆదాయం
రవాణా శాఖలో స్క్రాప్ దందా
8

లాంగ్ రూట్లపై ఆర్టీసీ దృష్టి

- ఐటీ కారిడార్‌కు సర్వీసులు
- నేటి నుంచి కొత్తగా రెండు రూట్లలో బస్సులు
- 282కే రూట్‌లో ఘట్‌కేసర్ నుంచి కొండాపూర్‌కు రెండు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు
- 215 రూట్‌లో రాజేంద్రనగర్ నుంచి కొండాపూర్‌కు రెండు ఆర్డినరీ సర్వీసులు

ఐటీకారిడార్‌కు గ్రేటర్ శివారు ప్రాంతాల నుంచి రోజూ లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో ఎక్కువ మంది సొంత వాహనాలపై వెళ్తున్నారు. వీరిపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టిసారించింది. నేటి నుంచి ఘట్‌కేసర్, రాజేంద్రనగర్ ప్రాంతాల నుంచి కొండాపూర్‌కు నూతన సర్వీసులను ప్రారంభించనుంది.



హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొత్తగా 282కే, 215 రూట్లలో ఘట్‌కేసర్, రాజేంద్రనగర్ ప్రాంతాల నుంచి కొండాపూర్‌కు గురువారం నుంచి బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తోంది. కాచిగూడ డిపోకు చెందిన రెండు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఘట్‌కేసర్ నుంచి కొండాపూర్‌కు, రాజేంద్రనగర్ డిపో నుంచి రెండు ఆర్డినరీ బస్సులను 215 రూట్‌లో రాజేంద్రనగర్ నుంచి అరాంఘర్ మీదుగా కొండాపూర్‌కు రెండు సర్వీసులు నడపనున్నారు. లాంగ్ రూట్లను గుర్తించి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్టీసీ గ్రేటర్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించే దిశగా డిపోల వారీగా కొత్త రూట్లను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

రెండు రూట్లలో..

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొండాపూర్‌కు రెండు రూట్లలో బస్సులను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొస్తోంది. 282కే రూట్‌లో ఘట్‌కేసర్ నుంచి వయా యామనపేట, రాంపల్లి, రాంపల్లి ఎక్స్‌రోడ్, నాగారం, కుషాయిగూడ, ఎస్‌ఎఫ్‌సీనగర్,

మిగతా 8వ పేజీలో..



హాట్ సీటుగా హెచ్‌ఎండీఏ

- ప్లానింగ్, ఇంజనీరింగ్, అర్బన్ ఫారెస్టు, ఇతర విభాగాల్లో ఖాళీలు
- డిప్యుటేషన్‌పై వచ్చేందుకు పలువురి ప్రయత్నాలు

హెచ్‌ఎండీఏలో కమిషనర్ పోస్టే కాదు.. పలు విభాగాల్లో ఏ పోస్టు అయినా హాట్ సీటుగా మారింది. హైదరాబాద్ నడిబొడ్డున ఉద్యోగం కావడం.. రాజకీయ ఒత్తిడులు లేకపోవడంతో ఇక్కడ పనిచేసేందుకు పలువురు ఆరాటపడుతున్నారు.



హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏలో ప్లానింగ్, ఇంజనీరింగ్, అర్బన్ ఫారెస్టు ఇతర విభాగాల్లో భారీగా ఖాళీలున్నాయి. ప్లానింగ్ విభాగం సీటులో కూర్చుంటే ఆదాయానికి మించి ఆస్తులను కూడగట్టుకోవచ్చనే ప్రచారం ఉన్నది. గతంలో డిప్యుటేషన్‌పై వచ్చి ఆదాయానికి మించి ఆస్తుల కేసులో చిక్కినవారే ఇందుకు ఉదాహరణ. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా డిప్యుటేషన్‌పై హెచ్‌ఎండీఏకు వచ్చేందుకు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు.

రాష్ట్ర ఏర్పాటు తర్వాత..

రాష్ట్ర ఏర్పాటు తర్వాత పలు శాఖల్లో ఉద్యోగాల భర్తీ జరిగినా.. హెచ్‌ఎండీఏలో ఒక్క పోస్టునూ భర్తీ చేయలేదు. హెచ్‌ఎండీఏలో 2012లో కొన్ని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ తర్వాత ఇప్పటి వరకు ఏ పోస్టులనూ భర్తీ చేయలేదు. 600 పోస్టులు ఉన్న హెచ్‌ఎండీఏలో 70 శాతానికి పైగా ఖాళీలున్నాయి. హుడా నుంచి హెచ్‌ఎండీఏగా ఏర్పడినప్పటి నుంచి ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉన్న ఉద్యోగులు రెండింతల పని భారాన్ని మోస్తున్నారు. డిప్యుటేషన్ ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు ప్రాజెక్టుల అమలుకు ఉద్యోగుల కొరత తీవ్ర అడ్డంకిగా మారుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు హద్దుగా చేసుకొని హైదరాబాద్ విస్తరణతో భారీగా భవన నిర్మాణాలు, పెద్దఎత్తున లేఅవుట్లు వస్తున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలోబహుళ అంతస్తుల భవనం కోసమైనా, లే అవుట్, గేటెడ్ కమ్యూనిటీ కాలనీ అనుమతి కోసమైనా దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువు లోపు

మిగతా 8వ పేజీలో..

ఏడుగురు ఆర్డీవోలు.. పని మాత్రం ముగ్గురికే

హెచ్‌ఎండీఏలో ప్రస్తుతం ఏడుగురు రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీఓ) ఉన్నారు. సీనియర్ ఆర్డీవో స్థాయి అధికారులు కావడం.. వారంతా జిల్లాల్లో అదనపు కలెక్టర్‌గా పనిచేసే హోదాలో ఉన్నవారే కావడం గమనార్హం. ఏడుగురిలో ముగ్గురు మినహా మిగతా వారికి పని లేదు. మిగతా నలుగురు కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారు. ఆర్డీవో స్థాయి అధికారి కావడంతో జీతభత్యాలు, కారు, ఇతరత్రా నిర్వహణ మొత్తం హెచ్‌ఎండీఏకు భారంగా మారుతోందని ఉద్యోగులు వాపోతున్నారు.

పోస్టు కోసం పైరవీలు

డిప్యుటేషన్‌పై హెచ్‌ఎండీఏకు వచ్చేందుకు వివిధ జిల్లాల్లో ఉన్న ఉద్యోగులు ప్రయత్నం చేస్తున్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, డీటీసీపీలోని ప్లానింగ్ అధికారులు, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఎలక్ట్రిసిటీ ఇంజనీర్లు, ఫారెస్టు విభాగంలో రేంజ్ ఆఫీసర్లు ప్రయత్నిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ ఏదో విధంగా పోస్టును దక్కించుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. పదేళ్లలో డిప్యుటేషన్ కోసం ప్రయత్నించి విఫలమైన వారంతా ప్రస్తుతం తెరపైకి వచ్చారు. గత ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని, ఈ సారి పోస్టు ఇప్పించాలని ఎమ్మెల్యేలతో పైరవీ చేస్తున్నట్టు తెలిసింది.

వేగంగా హెచ్‌ఎండీఏ చెరువుల హద్దుల గుర్తింపు 6

అతి వ్యాయామం అనర్థమే!

- వారానికి 150-300 నిమిషాలు చాలంటున్న నిపుణులు



హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి వ్యాయామం అవసరం. ఇది అందరూ ఒప్పుకునే నిజం. వ్యాయామాలు ఎక్కువైతేనే దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధిక వ్యాయామాల వల్ల ఎనీమియా, ఆర్థ్రైటీస్, గుండె సమస్యలు, జ్ఞాపకం తగ్గడం, శరీరం సరిగా అభివృద్ధి చెందకపోవడం, వంధ్యత్వం వంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు డాక్టర్లు. ఇదే విషయమై స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్ ర్యాన్ మాట్లాడుతూ 'శరీర తత్వాన్ని బట్టి ఎంత వ్యాయామం అవసరమో అంతే చేయాలి. బాడీ స్ట్రక్చర్ లేదంటే ఇతరత్రా కారణాలు చెప్పి అధికంగా వ్యాయామం చేస్తే అర్థరైటిస్ సహా అనేక సమస్యలు రావచ్చు' అని అన్నారు. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ సూచనల ప్రకారం వారానికి 150 నుంచి 300 నిమిషాల సాధారణ వ్యాయామం, 75 నుంచి 150 నిమిషాల కఠినమైన వ్యాయామాలు చాలు. వీటితో పాటుగా

మిగతా 8వ పేజీలో..

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

PLOT FOR SALE

★ వరంగల్ హైవే భువనగిరి బైపాస్ అనుకుని వివేరా హోటల్‌కి అతి సమీపంలో HMDA అప్రూవ్డ్ విల్లా ఓపెన్ ప్లాట్స్ కలవు. ఆల్ డెవలప్‌మెంట్స్ Spot రిజిస్ట్రేషన్ bank loan available. Ph: 9989032598 AJH-3960

★VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ. 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్. ఫామ్ హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: 9390665999 AJB-36

ANJANI WATER PROOFING

★ స్లాబ్, టెర్రస్, సైడ్ గోడ, బాత్రూమ్, వాటర్ ట్యాంక్ లీకేజీలను అత్యాధునిక కెమికల్స్ టెక్నాలజీ ద్వారా అనుభవం గల టెక్నీషియన్స్‌తో అరికట్టబడును. Ph: 7013901584 AJH-414

TO-LET

★ HIMAYATNAGAR MAIN Rd.Nr.TTD Kalyana mandapam, 2nd flr 700sft & 3rd flr 1500sft for any commercial purpose & Abids, Chiragali,Fateh Sultan lane 2BHK, 1BHK for rent Ph.8712366000/7799222334/ 6304765987 AJH-001989

ఉచిత అప్రెంటిషిప్ అడ్మిషన్లు కలవు

★ M.P.H.W (F), M.L.T. పాస్ విద్యార్థులకు అప్రెంటిషిప్ సౌకర్యము కలదు. D.O.A, DOM, DRGA, Nursing (M) ఉచిత అడ్మిషన్లు కలవు. సం.ప్ర॥ 9177631014 AJ W-188442

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

నగరంలోని పబ్‌లు డ్రగ్స్ డెన్‌లుగా మారుతున్నాయా..? అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. ఒకప్పుడు అరుదుగా లభించే డ్రగ్స్ ఇప్పుడు సామాన్య యువతకు కూడా విరివిగా లభిస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. గతంలో నగరానికి గ్రాముల్లో వచ్చే డ్రగ్స్ ప్రస్తుతం కిలోల చొప్పున చేరుతోంది. ఇందుకు ఇటీవల పోలీసులకు పట్టుబడిన ముఠాలే సాక్ష్యం. కేవలం నెల వ్యవధిలో రూ.10కోట్ల విలువ గల సరుకు పట్టుబడడం సంచలనంగా మారింది.

- కిలోల లెక్కన డ్రగ్స్ దిగుమతి
- ఈవెంట్ మేనేజర్లు, డీజేలే కీలకం
- కోడ్ భాషలో పార్టీలకు పిలుపు
- వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం
- గంటలోనే గ్రూప్ మాయం
- పార్టీకి ఎవరొచ్చినా 20 శాతం మందికే మత్తు సరఫరా



గమ్మత్తు పబ్‌లు

బంజారాహిల్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో డ్రగ్స్ కల్చర్ పెరుగుతున్నది. ఇటీవల నార్కోటిక్ పోలీసులు జరిపిన దాడుల్లో నమ్మలేని నిజాలు వెలుగుచూశాయి. చిన్నమొత్తంలో లభించే మాదకద్రవ్యం ప్రస్తుతం కిలోల చొప్పున పట్టుబడుతోంది. 10 పబ్‌ల యజమానులకు ఇంటర్నేషనల్ మాఫియాతో లింక్‌లు ఉన్నట్టు తేలడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు.

మూడు కమిషనరేట్‌ల పరిధిలో వందకు పైగా పబ్‌లు ఉన్నాయి. వీకెండ్ వచ్చిందంటే నగరవాసులు ఆయా పబ్‌లలో పార్టీల్లో మునిగి తేలుతారు. మద్యం తాగి ఊగుతారు. ఈ మధ్య కాలంలో పబ్‌లలో జరిగే పార్టీలకు డ్రగ్స్ కల్చర్ తోడైంది. మత్తులో యువత చేసే హంగామా బయటకు రాకుండా పబ్ నిర్వాహకులు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే, అన్ని పబ్‌లలో ఈ డ్రగ్స్ సంస్కృతి ఉందా? అనేది తేలాల్సి ఉంది.

పబ్‌లకు ఎలా వస్తోంది..

నార్కోటిక్ అధికారులు పార్టీలు జరుగుతున్న పబ్‌లపై దాడులు నిర్వహించి పరీక్షలు చేయగా చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. పబ్‌లకు మత్తు ఎలా సరఫరా అవుతుంది? పార్టీని ఎవరు నిర్వహిస్తున్నారు? డ్రగ్స్ కావాల్సిన వారికి పబ్ వెలుపల అందిస్తున్నారా? లేదా లోపలికి వచ్చాకే దొరుకుతున్నాయా? అనేది మాత్రం ఇంకా తేలాల్సి ఉంది. ఈవెంట్ మేనేజర్ల పాత్ర ఏమిటి? నిర్వాహకులు ఎలా అనుమతులు ఇస్తున్నారనే దానిపై ఆరా తీయగా కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిసినట్టు సమాచారం. అయితే, తాజాగా రాజస్థాన్ నుంచి ఓ ముఠా ఏడు కిలోల హెరాయిన్ తరలిస్తూ శంషాబాద్ ఎస్‌ఓటీకి పట్టుబడింది. వీరిని విచారించగా మాదాపూర్‌కు చెందిన పబ్ మేనేజర్ కిలో ఆర్డర్ ఇచ్చినట్టు తెలిసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు.


ప్రొఫైలింగ్ పై దృష్టి...

విద్యాసంస్థల దగ్గరి నుంచి పబ్‌ల వరకు మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోవడంతో నార్కోటిక్ విభాగం ప్రొఫైలింగ్ (వ్యక్తిగత వివరాల సేకరణ)పై దృష్టి సారించింది. డ్రగ్స్, గంజాయి తీసుకొని పట్టుబడిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతూనే అసలు వారికి మాదకద్రవ్యాలు ఎలా వచ్చాయి అనే అంశంపై ఆరా తీస్తూ అందరి పేర్లతో కలిసి ప్రొఫైలింగ్ చేస్తున్నట్టు అధికారులు ఇటీవల ప్రకటించారు. ఈ విధానం మూడేళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చి ఉంటే ఈ పాటికి నగరంలో డ్రగ్స్ వినియోగం కట్టడి జరిగేదని కొందరు సీనియర్ అధికారులు అంటున్నారు. ఈ డ్రగ్స్ వ్యవహారంలో అసలు నిందితులను పట్టుకోవడంతో పాటు ప్రొఫైలింగ్ చేసి ఉంటే కేవలం ప్రముఖులతో సరఫరా ఆగిపోయేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సోషల్ మీడియా ద్వారా పిలుపులు

సాధారణంగా పబ్‌లో కొంతమంది కొన్నిరకాల పేర్లతో పార్టీలు ఏర్పాటు చేస్తుంటారు. దీనికి డ్రెస్‌కోడ్ అని, కేవలం కపుల్స్ మాత్రమే అని, బ్యాచిలర్స్, రెట్రోనైట్ పేరిట ఈవెంట్ మేనేజర్లు పార్టీలు పెట్టడం సాధారణమే. ఇటీవల కాలంలో వీరే ప్రత్యేకంగా కొన్ని పబ్‌లను ఎంచుకొని డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు నిర్ధారణ అయింది. ఈవెంట్ మేనేజర్లకు డీజేలు తోడవడంతో పార్టీకి వచ్చే వారికి డ్రగ్స్ దొరకడం తేలికైంది. ఈవెంట్ మేనేజర్లు, డీజేలతో పాటు అతికొద్ది మంది పార్టీ ప్రియులతో కలిసి సోషల్ మీడియాలో ఓ గ్రూప్ ఏర్పాటు చేసి అందులో మెసేజ్ పెడుతున్నట్లు తెలుస్తోంది. కేవలం ఓ గంటలో ఎవరెవరు సమ్మతిస్తారో తెలుసుకొని ఆ తరువాత గ్రూప్‌ను డిలిట్ చేసి అవసరమైన వారికి డ్రగ్స్ అందిస్తున్నారు. ఇందుకోసం ఈవెంట్ మేనేజర్లు, డీజేలకు పెద్ద మొత్తంలో డబ్బు లభిస్తుంది. అయితే, పార్టీకి 60 నుంచి 70 మందిని నిర్వాహకులు పిలుస్తున్నప్పటికీ అందులో 20 శాతం మందికి మాత్రమే డ్రగ్స్ ఇచ్చేలా సరఫరాదారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తద్వారా ఎవరికీ అనుమానం రాకుండా ఉంటుంది.

రేపే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.15

తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,6.00

అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30 | మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00 | సాయిరంగ - మియాపూర్ 11.00,2.15,6.00,9.15
అలంకార్ 70 - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00 | రంగ 70ఎంఎం - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00 | వైజయంతి 70 - నాచారం 11.00,2.00,6.00,9.00
రాజ్యలక్ష్మి 70ఎంఎం - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00 | జ్యోతి 70 - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00 | ముకుంద్ 70 - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.45,5.15,10.45 తమిళ్ : 2.30,8.00 | జీవీకే/జీఎస్ఎం - మదీనగూడ 10.20,1.25,4.30,7.30, 10.40 తమిళ్ : 4.00,9.50 | శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,5.00,8.00,11.00
ఎ.ఎం.బి - గచ్చిబౌలి 10.05,1.15,4.10,7.10 7.30,10.10,10.35 తమిళ్ : 10.20,4.20 | నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.30,1.35,4.40,7.45,10.50 | సినిమాస్ - బాలానగర్ 11.00,2.00,5.00,8.00,11.00
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.30,1.15,4.20,7.25,10.30 | సినిమాస్ - చందానగర్ 11.00,2.00,5.00,8.00,11.00 | సినీటౌన్ - మియాపూర్ 11.00,2.00,5.00,8.00,11.00
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | మంజీరామాల్ - కూకట్‌పల్లి

GLOBAL CINEMAS RELEASE

ఆగస్టు 18న పద్మశాలి సంఘం ఎన్నికలు

వనస్థలిపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం ఎన్నికలు ఆగస్టు 18న నిర్వహిస్తున్నామని ఎన్నికల అధికారులు రావిరాల నర్సయ్య, భువనగిరి ఉదయ్‌కుమార్, మాచర్ల రంగయ్య తెలిపారు. బుధవారం చింతల కుంటలో ఎల్‌పీటీ మార్కెట్ సముదాయంలో రాష్ట్ర అధ్యక్షుడు వి. బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 29 నుంచి 31 వరకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందని, ఆగస్టు 18న ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

వేగంగా హెచ్ఎండీఏ చెరువుల హద్దుల గుర్తింపు

- గజం కూడా కబ్జా కాకుండా చర్యలు
- ఇప్పటికే 230 చెరువులకు నిర్ధారణ
- మరో 2,525 చెరువుల బఫర్‌జోన్ గుర్తిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్
- హైకోర్టుకు కమిషనర్ వివరణ

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోని అన్ని జల వనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సరిహద్దులు గుర్తించే పనిని వేగవంతం చేసినట్లు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ హైకోర్టుకు నివేదించారు. రామమ్మకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటీహెచ్ఎం) సంస్థ భవన నిర్మాణాలు చేపడుతుండటంపై హైకోర్టులో గత ఏడాది ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని జలవనరుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని కమిషనర్‌ను ఈ నెల 22న ఆదేశించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై వివరణ ఇచ్చారు. పూర్తిస్థాయిలో ఆక్రమణలను తొలగించడంతో పాటు భవిష్యత్తులో గజం భూమి కూడా కబ్జా కాకుండా సరిహద్దులు గుర్తించే పనిని వేగవంతం చేశామన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 3,532 జలవనరులు, చెరువులు, కుంటలు ఉన్నాయని, 230 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ ఇచ్చామని కమిషనర్ తరఫున అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి తెలిపారు. మరో 2,525 చెరువులకు ఇప్పటికే ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ అయ్యాయని చెప్పారు. వాటిపై వచ్చే అభ్యంతరాలను పరిష్కరించి మూడు నెలల్లో తుది నోటిఫికేషన్లు ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటికీ ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వని జలవనరులపై తీసుకున్న చర్యల పురోగతి నివేదికను వచ్చే వాయిదా నాటికి సమర్పిస్తామని తెలిపారు.

ఆక్రమణలు నిజమేనన్న ఏజీ

రామమ్మకుంట భూమిలో ఎన్ఐటీహెచ్ఎం సంస్థ కొంత భాగాన్ని ఆక్రమించినట్లు తేలిందని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి అంగీకరించారు. ఈ విషయాన్ని ఏజీ ఉన్నది ఉన్నట్లు చెప్పారని ప్రశంసించిన ధర్మాసనం.. అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్పష్టం చేసింది. వచ్చే వాయిదా నాటికి ఆక్రమణల తొలగింపుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది. విచారణను నవంబరు 4వ తేదీకి వాయిదా వేసింది.

ఆపరేషన్ ధూల్‌పేట్

- అనుమానితుల ఇళ్లలో తనిఖీలు
- గంజాయి నిర్మూలనే లక్ష్యం


హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 31లోగా ధూల్‌పేటలో గంజాయి లేకుండా చేయడం లక్ష్యంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు 8 ప్రత్యేక బృందాలతో బుధవారం తనిఖీలు చేపట్టారు. అనుమానితుల ఇళ్లతో పాటు జుమ్మేరాత్‌బజార్, దేవీనగర్ చక్కరవాడి, జుంగూర్‌బస్తీ, సేవాదళ్ ఇమ్లీబాగ్, బలరాం గల్లీ మార్గ్, గంగాబౌలి మతిం ఖానా, చున్నీకిబట్టీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ శాస్త్రి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో జల్లులు

- పెరిగిన చలిగాలుల తీవ్రత
- 27.8 డిగ్రీలకు పడిపోయిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మళ్లీ ముసురు పట్టింది. బుధవారం పలు ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. ఐదురోజులుగా కురుస్తున్న జల్లులతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. జల్లులతో చలిగాలుల తీవ్రత పెరిగింది. బోరబండలో 4.3, గాజులరామారంలో 3.0, మహదేవపురంలో 3.0, జీడిమెట్లలో 2.8, బాలాజీనగర్‌లో 2.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, లకిడీకాపూల్, పంజాగుట్ట, షాపూర్‌నగర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మియాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో కురిసిన చిరుజల్లులతో రహదారులు బురదమయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఖైరతాబాద్, ఎర్రగడ్డ, సికింద్రాబాద్, మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో ట్రాఫిక్‌జాంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. వర్షాలతో పగటి ఉష్ణోగ్రతలు 27.8 డిగ్రీలకు పడిపోయాయి. నగరంలో మరో రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంటుందన్నారు. ఉపరితల గాలులు గంటకు 10-12 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా వీచే అవకాశాలుంటాయన్నారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00

PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.45pm | మంత్రామాల్ - అత్తాపూర్ 11.00am
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 7.10pm | డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 1.30pm
PVR గలేరియా - పంజాగుట్ట 4.50pm | ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.30pm
PVR బికాప్ - హైటెక్‌సిటీ 7.15pm | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.50am
PVR పీవీఆర్ - ఎర్రమంజిల్ 10.30pm | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 4.20pm
PVR పీవీఆర్ - ముసారాంబాగ్ 10.20pm | శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.40pm
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 4.20pm | సినిమాస్ - బాలానగర్ 4.20pm
PVR ఎస్2 నోము - మల్లాపూర్ 10.10pm | సినిమాస్ - చందానగర్ 10.40pm
జీఎస్ఎమ్ - మదీనగూడ 1.15pm | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 6.30pm
నెక్లెస్ సత్య - కవాడిగూడ 1.45pm | జె.పి.సినిమాస్ - చందానగర్ 10.20pm
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 5.00pm | అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 2.35pm

PVR ఎస్2 - వరంగల్ | శ్రీదేవి - హన్మకొండ | శ్రీనివాస - కరీంనగర్ | గీతా - నిజామాబాద్ | PVR వేణుమాల్ - నిజామాబాద్ | GHR కాంప్లెక్స్ - కోదాడ
PVR సినిమాస్ - ఆర్మూర్ | తిరుమల - మహబూబ్‌నగర్ | వెంకటేశ్వర - మహబూబ్‌నగర్ | CN గెలాక్సీ 70 - ఖమ్మం | తిరుమల 70 - కరీంనగర్ | అలంకార్ 70 - సూర్యాపేట
శ్రీనివాస 70 - నర్సాపూర్ | వెంకటేశ్వర 70 - పెట్లం | వెంకటేశ్వర 70 - దర్పల్లి | బృందావన్ 70 - ఆర్మూర్ | పిక్చర్‌ప్యాలెస్ - ఆసిఫాబాద్ | సీతారామ 70 - ఇల్లందు
తార్ 70ఎంఎం - పాల్వంచ | బిబికె 70ఎంఎం - చేర్యాల | పరమేశ్వరి - జనగామ | దేవి 70ఎంఎం - జడ్చర్ల | హరిహర - జమ్మికుంట | మనోహర్ - నారాయణపేట

SRI VIJAYA FILMS

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 5వ వారం



శ్రీకృష్ణ 70ఎంఎం - ఆలియాబాద్ 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల | దుర్గా కమల ఎసి - నెక్కొండ | దుర్గ థియేటర్ ఎసి - బోనకల్లు | బృందావన్ థియేటర్ - ఆర్మూర్
PARAM JYOTHI FILMS 9848028739

UNANIMOUS EPIC BLOCKBUSTER
విజయవంతమైన 4వ వారం
తగ్గించబడిన టికెట్ రేట్స్
మల్టీప్లెక్స్: 295/-, 350/-, సింగిల్ స్క్రీన్: 175/-,110/-, 50/-



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ (3D) 11.00,2.30,6.00,9.30 | జ్యోతి 70ఎంఎం - ఆర్.సి.పురం 11.00,2.15,6.00,9.15 | రామకృష్ణ 70ఎంఎం - అబిడ్స్ 11.15,2.30,6.00,9.30
భ్రమరాంబ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45 | తారకరామ ఎ/సి - కాచిగూడ 11.00,2.00,6.00,9.00 | భుజంగ 70ఎంఎం - జీడిమెట్ల 11.00,2.15,6.15,9.30

తెలుగు 2D

GLOBAL CINEMAS RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల



ఏషియన్ సినీప్లానెట్ - కొంపల్లి 10.30am
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.20pm
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30am
జె.పి.సినిమాస్ - చందానగర్ 7.30pm

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | PVR గలేరియా - పంజాగుట్ట | PVR ప్రెస్టీజ్ మాల్ - గచ్చిబౌలి
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి | PVR బికాప్ - హైటెక్‌సిటీ | PVR అట్రియమ్ - గచ్చిబౌలి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ | PVR పీవీఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | PVR ఎస్2 నోము - మల్లాపూర్
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ | PVR పీవీఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
పరమేశ్వరి - కొత్తకోట | రంగ 70 ఎంఎం - వనపర్తి | శ్రీనివాస 70 - నర్సాపూర్ | శ్రీనివాస ఎ/సి - చెవ్వెళ్ల
వెంకటరమణ - జడ్చర్ల | నేషనల్ 70 - కల్వకుర్తి | తిరుమల ఎ/సి - గజ్వేల్ | రుక్మిణి ఎ/సి - సంగారెడ్డి
ABD PRODUCTIONS THROUGH PARAMJYOHTI FILMS 9848028739

విజయవంతమైన 2వ వారం



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.45
టికెట్ ధర: 175/-, 110/-, 55/-

అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.00,2.30,6.00,9.30 | రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30

ఎ.ఎం.బి. సినిమాస్ - గచ్చిబౌలి 12.50,3.50,7.15,10.40 | ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 1.50,7.40 | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 10.00,4.00,10.30
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 4.25,7.15,10.10 | జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 11.00,10.30 | ప్లాజా - 10.00,4.00,10.00
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.30,4.15,7.40,10.50 | ఎం.పి.మాల్ - కాచిగూడ 4.00,10.30 | మూవీమ్యాక్స్ - మౌలాలి 10.15,1.30,4.00,10.00
జీఎస్ఎమ్ - మదీనగూడ 10.40,7.00,10.30 | మంజీరామాల్ - కూకట్‌పల్లి 1.00,11.15
నెక్లెస్ సత్య - కవాడిగూడ 1.15,10.20 | సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 4.00,11.15
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.40,6.45

GLOBAL CINEMAS RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30am

PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.10am | జీఎస్ఎమ్ - మదీనగూడ 1.45pm
PVR పీవీఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 4.30pm | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.30am
PVR ఎస్2 నోము - మల్లాపూర్ 4.10pm | జె.పి.సినిమాస్ - చందానగర్ 4.30pm

PVR ఎస్2 - వరంగల్ | GHR కాంప్లెక్స్ - కోదాడ | హరిహర 70 - జమ్మికుంట
శ్రీదేవి - హన్మకొండ | PVR సినిమాస్ - ఆర్మూర్ | ఆనంద్ 70 - భూపాలపల్లి
శ్రీనివాస - కరీంనగర్ | తిరుమల - మహబూబ్‌నగర్ | వెంకటరమణ 70 - తల్లాడ
గీతా - నిజామాబాద్ | శ్రీరమణ 70 - నాగర్‌కర్నూల్ | విజయలక్ష్మి 70 - నాంపల్లి
PVR వేణుమాల్ - నిజామాబాద్ | నేషనల్ 70 - కల్వకుర్తి | వాసవి 70 ఎ/సి - వైరా
SMK FILMS THRO PRK FILMS 9154578901/8919077130

రేపే బ్రహ్మాండమైన విడుదల
ADVANCE BOOKING OPEN మల్టీప్లెక్స్: 150/-, సింగల్ స్క్రీన్: 110/- 80/- 50/-



సప్తగిరి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ | అంజలి 70 ఎ/సి - సికింద్రాబాద్ | తాళ్కూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | PVR ప్రెస్టీజ్ మాల్ - గచ్చిబౌలి | జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం | సినిమాస్ - చందానగర్ | టివోలి - సికింద్రాబాద్
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి | PVR అట్రియమ్ - గచ్చిబౌలి | ఎం.పి మాల్ - కాచిగూడ | సినీ ప్లానెట్ - కొంపల్లి | సినీటౌన్ - మియాపూర్ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ | PVR ఎస్2 నోము - మల్లాపూర్ | జీఎస్ఎమ్ - మదీనగూడ | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ | మంజీరామాల్ - కూకట్‌పల్లి | నెక్లెస్ సత్య - కవాడిగూడ | ఏషియన్ రాధిక - కాప్రా | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి | ప్లా షోపాష్ - చింతల్
PVR గలేరియా - పంజాగుట్ట | సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ | మూవీటైమ్ - అమీర్‌పేట | మూవీమ్యాక్స్ - మౌలాలి
PVR బికాప్ - హైటెక్‌సిటీ | మంత్రామాల్ - అత్తాపూర్ | ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి | జె.పి.సినిమాస్ - చందానగర్

MYTHRI MOVIE DISTRIBUTORS LLP



కేక్‌కట్ చేస్తున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులు

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

నార్సింగ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ యువనాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి హాజరై కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి అనుభవమైన నాయకులు మణికొండలో ఉన్నారని, రాబోయే రోజుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ్ల, శ్రీనివాస్, కుంభగళ్ల ధనరాజ్, వసంత్‌రావ్ చౌహాన్, నవీన్‌కుమార్, అండె లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, విజయలక్ష్మీ, కిరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని టోకరా

- **వృద్ధుడి నుంచి రూ. 1.22లక్షలు కొల్లగొట్టిన నేరగాళ్లు**

హైదరాబాద్ సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లిమిట్స్ పెంచుతామని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు ఓ వృద్ధుడికి రూ.1.22లక్షలు టోకరా వేశారు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. 62 ఏళ్ల వృద్ధుడికి ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ఫెడరల్ బ్యాంకు కస్టమర్ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకున్నాడు. మీకు ఎన్ని క్రెడిట్ కార్డులు ఉన్నాయని అడిగి, వివరాలు తెలుసుకున్నాడు. మీ క్రెడిట్ లిమిట్స్‌ను పెంచడంతోపాటు.. పెంచిన లిమిట్స్‌కు సమానంగా ఫెడరల్ బ్యాంకు క్రెడిట్‌కార్డు అందిస్తామని నమ్మబలికాడు. అందుకు బాధితుడు సరే అనడంతో ప్రాసెస్ చేస్తున్నామని నమ్మించిన కేటుగాళ్లు కేవైసీ అప్‌డేట్ పేరుతో కాల్ చేస్తారని, ప్రస్తుతం ఉన్న క్రెడిట్ కార్డు డిటేయిల్స్ సీవీవీ, ఓటీపీ సహా అన్నీ చెప్పాలనడంతో అతను అలాగే చేశాడు. తర్వాత మెసేజ్‌లు చెక్ చేయగా.. కార్డు లిమిట్ పెరగకపోగా.. అందులో ఉన్న డబ్బులు రూ. 1,22,350లు డెబిట్ అయినట్లు గుర్తించాడు. మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించిన వృద్ధుడు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించి గోడు వెల్లబోసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ఫేక్ ఐడీతో గాలం

- **సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు 22 లక్షలు టోకరా**
- **హైదరాబాద్‌కు చెందిన యువతి మాయ**
- **అరెస్టు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు**

ఎండాడ (విశాఖపట్నం), జూలై 24: ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీని క్రియేట్ చేసి.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి ఓ కిలాడీ లేడీ ఏకంగా రూ.22 లక్షలు దోచేసింది. సాంకేతికతను వినియోగించిన సైబర్‌క్రైమ్ పోలీసులు ఆమెను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. హైదరాబాద్‌కు చెందిన బత్తిన సాయిప్రియ అందమైన అమ్మాయిల ఫొటోలతో ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసింది. మ్యాట్రిమోనీ సైట్లలో రిజిస్టర్ చేసుకున్న యువకుల వివరాలు సేకరించి, ఆన్‌లైన్‌లో వారితో పరిచయం పెంచుకునేది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు గుంజేది. ఈ క్రమంలో విశాఖ నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకుంది. అతని వాట్సాప్ నంబరును సేకరించి, అందమైన అమ్మాయిల ఫొటో పంపి చాటింగ్ చేసింది. ఈ క్రమంలో అతని వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, ఎమోషనల్‌గా దగ్గరైనట్లు నటించింది. ఆ తర్వాత డబ్బులు అత్యవసరమంటూ అతని నుంచి రూ.22 లక్షలు తన బ్యాంకు ఖాతాలో జమ చేయించుకుంది. ఆ తర్వాత ఆమె ఆన్‌లైన్‌లో కనిపించకుండా పోవడంతో బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతికత ఆధారంగా ఆ యువతిని హైదరాబాద్‌కు చెందిన బత్తిన సాయిప్రియగా సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. ఆమెను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

షోరూం మేనేజర్ ఘరానా మోసం

- **అడ్వాన్స్ బుకింగ్స్ డబ్బులు రూ.15 లక్షలతో పరారీ**

శంషాబాద్ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఓలా ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో పనిచేస్తున్న మేనేజర్ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. బైకుల అడ్వాన్స్ బుకింగ్ కోసం ఇచ్చిన రూ.15 లక్షల నగదుతో పరారయ్యాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఉన్న ఓలా ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో నగరంలోని కర్మాన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన వర్మ రెండు నెలల క్రితం మేనేజర్‌గా చేరాడు. ఎలక్ట్రికల్ బైక్‌ల కోసం ఆరుగురు కస్టమర్లు.. ఒక్కొక్కరు అడ్వాన్స్ బుకింగ్ కోసం 1.48 లక్షలు, మరికొందరు రూ.40వేలు, రూ.60వేలు, రూ.70వేలు ఇలా దాదాపు 20 మంది బాధితులు మొత్తం రూ.15 లక్షల వరకు డబ్బులు కట్టారు. అందుకు సంబంధించి నిర్వాహకులు రశీదులు కూడా ఇచ్చారు. కొందరు మేనేజర్ పర్సనల్ అకౌంట్లలో డబ్బులు వేయగా.. మరికొందరు నగదు రూపంలో ఇచ్చినట్లు బాధితులు చెప్పారు. బుధవారం బాధితులు షోరూంకు వెళ్లి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న షోరూం నిర్వాహకులు బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నాలు విఫలం కావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వాస్తవంగా కంపెనీకి సంబంధించిన డబ్బులు.. ఉద్యోగుల ఖాతాల్లో వేయరాదు. అయినా మేనేజర్ అడ్వాన్స్ బుకింగ్ కావాలంటే నా అకౌంట్లోనే వేయాలని బాధితులకు చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చినట్లు ఓలా షోరూం ప్రతినిధి ఒకరు తెలిపారు. త్వరలోనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

2.66 కిలోల గంజాయి స్వాధీనం

- **ఐదుగురు నిందితుల అరెస్ట్**

మంగళ్‌హట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ఐదుగురిని దూల్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.66 కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం దూల్‌పేటలో ఓ ఇంటిపై దాడిచేసి, 2.66 కేజీల గంజాయి, మచ్చిపురాకు చెందిన నిలేష్‌సింగ్, గుండూ సింగ్, సీతూబాయితోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు.

మద్యం మత్తులో తోటివ్యాపారిపై బ్లేడ్ కట్టర్‌తో దాడి

- **సుల్తాన్‌బజార్ పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి**

అఫ్జల్‌గంజ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో బ్లేడ్ కట్టర్‌తో తోటి వ్యాపారిపై దాడి చేసిన ఘటన సుల్తాన్‌బజార్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి ఆగాపురాకు చెందిన సత్తార్(40), ఫిర్దాదిగూడకు చెందిన రాజగోపాల్ (45) కొంతకాలంగా కోఠి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. రాజగోపాల్ దుస్తుల వ్యాపారం చేస్తుండగా.. సత్తార్ కాస్మోటిక్ వ్యాపారం చేసుకుంటున్నాడు ఇద్దరూ రెండు రోజుల క్రితం కోఠిలోని ఎస్.వి.వైన్స్ షాపులో మద్యం తీసుకొని అక్కడే ఉన్న పర్మిట్ రూమ్‌లో మద్యం తాగారు. కొద్ది సేపటి తరువాత సత్తార్.. రాజగోపాల్‌ను తనతో కలిసి ఫోన్ కవర్ల వ్యాపారం చేయాలని అడగగా.. తనకు ఇష్టం లేదని చెప్పాడు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన సత్తార్ 'నీవు నాతో వ్యాపారం చేయవా.... నీ సంగతి చెబుతా అంటూ' తన వద్ద ఉన్న బ్లేడ్ కట్టర్‌తో రాజగోపాల్ గుండెపై పొడవగా తీవ్రంగా గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు ఉస్మానియాకు తరలించగా, అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. విషయం తెలుసుకున్న గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రాజగోపాల్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నగరంలో కొనసాగుతున్న వైన్స్‌ను వెంటనే మూసివేయాలని.. ఈ విషయాన్ని నగర పోలీసు కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, మంత్రి దృష్టికి తీసుకెళతానని... ఎమ్మెల్యే ఈ సంఘటనపై స్పందించాలని ఆనంద్ కుమార్ గౌడ్ తెలిపారు.


శాకంబరి అలంకరణలో దర్శనమిస్తున్న లాల్‌దర్వాజ మహాకాళి అమ్మవారు


శాకంబరి అలంకరణలో ఉప్పుగూడ మహాకాళి అమ్మవారు


శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న గౌలిపురా అమ్మవారు


భక్తులకు దర్శనమిస్తున్న బేలా ముత్యాలమ్మ అమ్మవారు


అక్కన్న మాదన్న మహాకాళి అమ్మవారు

అంగరంగ వైభవంగా బోనాల జాతర

- **అమ్మవారికి నైవేద్యాలను సమర్పించిన మహిళలు**
- **ఆలయాల వద్ద ఫలహారపు బండ్లు, పోతరాజుల విన్యాసాలు, తొట్టెల ఊరేగింపు**
- **శాకంబరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు**


శాకంబరిదేవిగా అమ్మవారు


మహాకాళి బోనాల ఉత్సవాల్లో ఆలయ అధ్యక్షులు జె.రాంచందర్, జె.శివ కుమార్, జె.రమేష్, భక్తులు


దుర్గామాత ఆలయంలో బోనాల ఉత్సవాల్లో ఆలయ అధ్యక్షులు వి.పాండుముదిరాజ్ తదితరులు


ఏడుగుళ్ల అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ అధ్యక్షుడు సత్యనారాయణ

ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం గోషామహల్‌లో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. గోషామహల్‌లోని చాక్నావాడి, చందన్‌వాడీ, గోషామహల్, ఏసీపీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉన్న చారిత్రాత్మక ఆలయాల్లో మహిళలు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి బోనాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ఆలయాల్లో అమ్మవారికి తొట్టెలలను భక్తులు సమర్పించారు. గోషామహల్‌లో బోనాల ఉత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా కొనసాగాయి.

ఏసీపీ కార్యాలయం వద్ద ఉజ్జి మహాకాళి ఆలయంలో అధ్యక్షుడు గోపాల్‌జీ, రఘు, సాయి కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాక్నావాడిలోని దుర్గామాత ఆలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పాండుముదిరాజ్, సాంబశివ, పరుశురాం, నీలకంఠం, సోమశేఖర్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడుగుళ్ల దేవాలయంలో ఆలయ అధ్యక్షులు ఇ.సత్యనారాయణ, నగేశ్ రాజ్, ధన్‌రాజ్, ఇందిరా రాజ్, నటరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. సెవెన్ ఎవెన్ హోటల్ వద్ద ఉన్న మహాకాళి ఆలయంలో ఆలయ అధ్యక్షుడు జె.రాంచందర్, జె.శివకుమార్, జె.రమేష్, నర్సింగ్‌రాజ్, కిరణ్‌కుమార్, సాయినాథ్ తదితరులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గండి మైసమ్మ ఆలయంలో ఆలయ అధ్యక్షుడు చీలంపల్లి రమేశ్ కుమార్, పవన్‌కుమార్, గణేష్, చీలంపల్లి రాజశేఖర్, నాగరాజు, ఘన్‌శ్యామ్ పూజలు నిర్వహించారు. మీరాలంమండి మహాకాళేశ్వర ఆలయంలోని అమ్మవారిని బుధవారం వివిధ రకాలతో వంద క్వింటాళ్ల కూరగాయాలు, ఆకు కూరలతో అలంకరించామని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. పాతనగరంలో బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం లాల్‌దర్వాజ సింహవాహిని మహాకాళి ఆలయం, గౌలిపురా మహాకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, ఉప్పుగూడ మహాకాళి దేవాలయం, శ్రీమాతేశ్వరి బేలా ముత్యాలమ్మ దేవాలయం, హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహాకాళి ఆలయాలలో అమ్మవారు శాకంబరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు.

- అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ బృందం, జూలై 24 (ఆంధ్రజ్యోతి)

పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో ఉపాధ్యాయులు పోటీపడాలి

- **హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**


పాఠశాలలోని వాష్ రూం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు పాఠశాలల అభివృద్ధికి పోటీపడి బాధ్యతగా పనిచేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బహదూర్‌పురలోని ఉమ్దా ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టిన టాయిలెట్ ఫ్లోరింగ్, కలర్ పెయింటింగ్, నల్లాల ఫిట్టింగ్, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలకు హెచ్ఎండబ్ల్యూఏ ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల వెనక వైపు చెత్తచెదారం ఉండటాన్ని గమనించిన కలెక్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పాఠశాలలో హాజరు రిజిస్టర్, పరిశీలించి రికార్డులు అప్‌డేట్ చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు డేటా అప్డేట్ చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని ల్యాబ్, స్టోర్‌రూం పరిశీలించి పాఠశాలలో ఉన్న స్క్రాప్‌ను తొలగించాలన్నారు. పాఠశాల ఆవరణలోని భవిత సెంటర్‌లోని పిల్లలతో మాట్లాడి వారి పేర్లు అడిగి తెలుసుకున్నారు. ఫిజియోథెరపీ డా.ఉపాధ్యాయురాలి సేవలు బాగున్నాయని ప్రశంసించారు. భవిత్ సెంటర్‌లో బాగా వెలుతురు ఉండేలా అదనంగా 4 ట్యూబ్ లైట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వారంలో రెండు రోజులు స్పీచ్ థెరపీ డా.సేవలు అందేలా ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి పోటీపడి పనిచేసి పాఠశాలను అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో కే.రోహిణి, జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఆశన్న, డిప్యూటీ డీఈఓ ఏ.సత్యవతి, డిప్యూటీ ఐఓఎస్ ఖలీల్, డీఈ రాజన్న, ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్‌రఫీ, తహసీల్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/2iW0fOC లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

'లాల్‌దర్వాజ బోనాలకు ప్రత్యేక బస్సులు నడపాలి'

చాంద్రాయణగుట్ట, జూలై 24(ఆంధ్రజ్యోతి): లాల్‌దర్వాజ బోనాలకు ప్రత్యేక బస్సులు నడపాలని లాల్‌దర్వాజ సింహవాహిని మహాకాళి ఆలయ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్ కోరారు. బుధవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. బోనాల ఉత్సవాలకు నగరం నలు మూలల నుండే కాకుండా చుట్టుపక్కల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుంటారని, లాల్‌దర్వాజ బోనాల జాతర పేరుతో గురువారం నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండీ సజ్జనార్ అధికారులను ఆదేశించారని, అమ్మవారి దర్శనానికి కూడా వస్తానని హామీ ఇచ్చినట్లు కె.వెంకటేశ్ తెలిపారు.

108 సిబ్బందికి అవార్డులు

నార్సింగ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ద్వారా నడుపుతున్న 108 వాహన సిబ్బందిని బుధవారం అవార్డులతో ఘనంగా సత్కరించారు. 108 సంస్థ ప్రధాన కార్యనిర్వహణ అధికారి (తెలంగాణ స్టేట్ హెడ్) ఎంఏ ఖాలీద్.. మెడికల్ టెక్నీషియన్ సయ్యద్ ముక్తార్, అహ్మద్, పైలట్ అశోక్‌కు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జాన షాహిద్, జిల్లా మేనేజర్ రహీం తదితరులు పాల్గొన్నారు.

'డ్రైవర్లు ఒత్తిడికి గురి కావొద్దు'

రాజేంద్రనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉద్యోగులు ఒత్తిడికి గురి కావద్దని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు లోనుకావద్దన్నారు. వాహనాన్ని నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, పూర్తి ఏకాగ్రతతో వాహనాలను నడిపించాలన్నారు.

బోనాల పండగపై విద్యార్థులకు అవగాహన


బోనాలు తీసుకుని వెళ్తున్న విద్యార్థినులు

పహాడిషరీఫ్ జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అన్నిమతాల పండుగలు వాటి ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు బోధించడం అభినందియమని మల్లాపూర్ కార్పొరేటర్ భరతమ్మ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం మల్లాపూర్‌లోని గ్లోబల్ ట్రీ ర స్కూల్‌లో 'బోనాల పండుగ, ప్రముఖ్యత'పై అవగాహన కల్పించారు. విద్యార్థులు పోతరాజు వేషధారణలతో ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం


రాస్తారోకోలో సీపీఎం పార్టీ నాయకులు

నార్సింగ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్రంగా అన్యాయం చేశారని సీపీఎం నాయకులు ఆరోపించారు. గండిపేట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అప్పాచౌరస్తా వద్ద బీజేపీకి వ్యతిరేకంగా బుధవారంనాడు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు జగదీశ్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణాలో సగభాగం సీట్లు గెలిచిన బీజేపీ ఎంపీలు నోరు మెదపకుండా మౌనంగా ఉండడం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. రానున్న రాజుల్లో బీజేపీకి పతనం తప్పదని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు ప్రకాష్ కారత్, గండిపేట మండల కన్వీనర్ రుద్రకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు


డాక్టర్. టి.శ్రీనివాస్‌రెడ్డి

మదీన, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, వీధికుక్కల నివారణకు పలు ప్రాంతాల్లో కుక్కలను పట్టుకుని వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశామన్నారు. సుమారు 6వేల వీధికుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చామని తెలిపారు. మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్లలో మొత్తం 10 వాహనాలు, సిబ్బందితో కుక్కలను పట్టుకోవడానికి రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారన్నారు. కుక్కల బెడదపై మలక్‌పేట, రాజేంద్రనగర్ సర్కిల్‌కు సంబంధించిన వెటర్నరీ అధికారి డాక్టర్ శ్రీకాంత్ (9154369429), సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా సర్కిళ్లకు చెందిన ప్రజలు వెటర్నరీ అధికారి వసీం (8919690076)లను సంప్రదించాలని సూచించారు.

బుల్కాపూర్ నాలాను పరిశీలించిన అధికారుల బృందం

నార్సింగ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీలో బుల్కాపూర్ నాలాను గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. బుల్కాపూర్ నాలా ఆక్రమణకు గురవుతుందని, బఫర్ జోన్‌ల నిర్మాణాలపై స్థానికులు జిల్లా కలెక్టర్‌కు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే నిర్వహించారు. మణికొండ ప్రాంతంలో బుల్కాపూర్ నాలా, బఫర్‌జోన్‌ను అధికారుల బృందం పరిశీలించింది. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో తల్లీకొడుకు ఆత్మహత్య

- **కొద్ది రోజుల క్రితమే ఇంటి పెద్ద అనారోగ్యంతో మృతి**


తల్లి, కుమారుడి మృతదేహాలు

దిల్‌సుఖ్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంటి పెద్ద కొద్ది రోజుల క్రితమే అనారోగ్యంతో మృతిచెందాడు.. తానే పెద్ద దిక్కై తమ ఇద్దరు కుమారుల బాగోగులు చూసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఆ తల్లి.. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక చివరకు తానూ ఆత్మహత్య చేసుకుంది.. తల్లి మృతదేహాన్ని చూసి షాక్‌కు గురైన కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. చైతన్యపురి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలుకు చెందిన గుంజి శివ, పద్మ దంపతులు తమ ఇద్దరు కుమారులతో కలిసి బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వసలవచ్చి కొత్తపేట ఎస్ఎల్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో శివ మృతి చెందాడు. దీంతో పద్మ తానే పెద్ద దిక్కై ఇద్దరు కుమారులను పోషిస్తుంది.



కోనేరు పునరుద్ధరణ

గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో శ్రీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో మూసుకుపోయిన కోనేరును బుధవారం పునరుద్ధరించారు.

- నార్సింగ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి)


ప్లేయర్లతో కరచాలనం చేస్తున్న జగన్‌మోహన్‌రావు

జర్నలిస్టులను ప్రేరణగా తీసుకోవాలి

హైదరాబాద్: కేఎస్‌జీ జర్నలిస్టు టీ20 ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) నాకౌట్ మ్యాచ్‌లు ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన తొలి నాకౌట్ మ్యాచ్ ప్రారంభానికి ముఖ్య అతిథిలుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, హెచ్‌సీఏ సీనియర్ క్లబ్ సెక్రటరీ పురుషోత్తం అగర్వాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, సామాజిక బాధ్యత వంటి విషయాల్లో జర్నలిస్టులను ప్రతీ ఒక్కరు ప్రేరణగా తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య శిబిరం

కార్వాన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏపీఎంఏసీ, పట్టణ పోషణ పథకం బృందం, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుల్సుంపురా జీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల్లో ఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎం ఏఎస్ సీఈవో సీ.ఎస్.రెడ్డి పాల్గొని ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీ.ఎస్. రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహార సలహాలు అందించడం వలన వారి ఆహారపు అలవాట్లు మెరుగుపడతాయని పేర్కొన్నారు. జిల్లా విద్యా అధికారి రోహిణి ఆమోదంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఎనభై మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశామన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628



గవర్నర్‌తో రాజ్‌భవన్ మహిళా సిబ్బంది, వైద్యులు తదితరులు

నిరంతరం పరీక్షలతోనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట : గవర్నర్

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నిరంతరం వైద్య పరీక్షలతోనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. రాజ్‌భవన్ మహిళా సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేకంగా గర్భాశయ క్యాన్సర్ పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... అవగాహన కల్పించడం, నిరంతరం పరీక్షలు, మందులతో క్యాన్సర్‌ను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో గవర్నర్ రాధాకృష్ణన్

తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బుధవారం తెల్లవారుజామున తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తోమాల అర్చన సేవలో పాల్గొని గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. గవర్నర్‌ను రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం వద్ద ఆయనకు అర్చక బృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ప్రముఖ క్రికెటర్ ప్రసిద్ కృష్ణ వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

● మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



ది స్పిరిచ్యువల్ అనాటమీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, గురూజీ కమలేష్ పటేల్

నందిగామ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు శక్తి లభిస్తుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ మార్గదర్శక గురువుల్లో ఒకరైన చారీజీ మహరాజ్ 97వ జయంతి వారోత్సవాల్లో రామ్‌నాథ్ కోవింద్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ది స్పిరిచ్యువల్ అనాటమీ పుస్తకాన్ని ఆశ్రమ గురూజీ కమలేష్ పటేల్‌తో కలిసి రామ్‌నాథ్ కోవింద్ ఆవిష్కరించారు. వివిధ దేశాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యాసకులతో ఆశ్రమంలో సందడి వాతావరణం నెలకొంది. రోజూ నాలుగు సిట్టింగులుగా 30 నిమిషాల పాటు ధ్యానం చేస్తున్నారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు, అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

శక్తి, శాంతి భావనలను జర్నలిస్టులు అనుసరించాలి

● ఇగ్నో మాజీ ప్రొడక్షన్ హెడ్ డాక్టర్ అబ్దుల్ సమద్ ఇబ్రహీం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అబ్దుల్ సమద్ ఇబ్రహీం

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శక్తి, శాంతి అనే గాంధేయ భావనలను జర్నలిస్టులు అనుసరించాలని ఇగ్నో మాజీ ప్రొడక్షన్ హెడ్ డాక్టర్ అబ్దుల్ సమద్ ఇబ్రహీం సూచించారు. శక్తి అంటే ప్రతీకారాన్ని ఆపే శక్తి, శాంతి అంటే ఎప్పటికీ కోపంతో లేదా ద్వేషంతో రాయకూడదనే సంకల్పమని వివరించారు. గాంధేయ భావనల ద్వారా 'ఆధ్యాత్మిక రీచార్జ్' చేసుకోవాలన్నారు. ఉస్మానియా వర్సిటీ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో 'పాత్రికేయ రంగంలో మహాత్ముని స్ఫూర్తి - వర్తమాన సవాళ్లు' అనే అంశంపై డాక్టర్ అబ్దుల్ సమద్ ఇబ్రహీం ప్రసంగించారు. ప్రజలను కనెక్ట్ చేసేది సాంకేతికత కాదని, సాధారణ మానవత్వ స్ఫూర్తేనని తెలిపారు.



కాచిగూడ చేరుకున్న వాటర్ పిన్ స్విమ్మింగ్ క్రీడాకారులు

వాటర్ పిన్ స్విమ్మింగ్ క్రీడాకారులకు ఘన స్వాగతం

బర్కత్‌పుర, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి రైలులో బయలుదేరి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు మంగళవారం రాత్రి చేరుకున్న వాటర్ పిన్ స్విమ్మింగ్ క్రీడాకారులకు తెలంగాణ అండర్ వాటర్‌పిన్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధి దినేష్ రాజోరియా, అంతర్జాతీయ స్విమ్మర్ క్వీనీ విక్టోరియా ఘన స్వాగతం పలికి అభినందించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో మూడు రోజుల పాటు జరిగిన 7వ అండర్ వాటర్ పిన్ స్విమ్మింగ్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్రానికి చెందిన 29 మంది క్రీడాకారులు 69 పతకాలు సాధించారు. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు 9 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఈ పోటీలలో పాల్గొనగా రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు మెజారిటీ పతకాలు సాధించారు. బర్కత్‌పురకు చెందిన స్టీఫెన్‌కుమార్ 4 పతకాలు సాధించారు.

పాలిటెక్నిక్ కళాశాలలు నిర్ణీత ఫీజు తీసుకోవాలి

● జేడీ శ్రీనాథ్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

హైదరాబాద్ సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యార్థుల నుంచి కళాశాలలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులే తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు టెక్నికల్ విద్యా జేడీ శ్రీనాథ్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు అధిక ఫీజులు చెల్లించాలంటూ పేద విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఫీజులు చెల్లించకపోతే తరగతులకు హాజరు కానివ్వకుండా, పరీక్షలు రాయనివ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, కాలేజ్ విద్యార్థులు గురుప్రీత్, అబ్దులా, జ్ఞానేశ్వర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

● స్క్రాప్ చేయకుండానే చేసినట్లు సర్టిఫికెట్
● డబ్బులకు ఆశపడి అడ్డగోలుగా అనుమతులు
● దర్జాగా గ్రేటర్ రోడ్లపై కాలం చెల్లిన వాహనాలు
● ఫిర్యాదు చేసినా పట్టింపులేమిపై అనుమానాలు

రవాణా శాఖలో స్క్రాప్ దందా



ఆటోవాలాలతో అధికారుల మిలాఖత్

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ రవాణా విభాగం (ఆర్టీఏ)లో కొత్తరకం దందా సాగుతోంది. మామూళ్లకు అలవాటుపడిన కొందరు అధికారులు నిబంధనలకు నీళ్లొదులుతూ ఆటోలను స్క్రాప్ చేయకుండానే చేసినట్లు సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా ఒక్కో ఆటోకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు దండుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఒక ఆటోకు రిజిస్ట్రేషన్ చేయాలంటే స్క్రాప్ చేసిన ఆటో స్థానంలోనే రిజిస్టర్ చేయాలనే నిబంధన ఉంది. కానీ, కొత్త ఆటో కొనేందుకు ఆసక్తి లేని డ్రైవర్లు స్క్రాప్ చేయకుండానే చేసినట్లు రవాణా శాఖాధికారులతో కుమ్మక్కై సర్టిఫికెట్లు పొందుతున్నారని ఆటో యూనియన్ నేతలు అంటున్నారు. ఈ విషయంపై గత ప్రభుత్వంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని చెబుతున్నారు.

లెక్కకు మించి రోడ్లపైకి..

జీహెచ్ఎంసీ పరిధిలో అధికారికంగా తిరగాల్సిన ఆటోల సంఖ్య 2.25 లక్షలు. ప్రస్తుతం ఇంతకుమించి తిరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి వాస్తవ లెక్కలు వెలికి తీయాల్సిన రవాణా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆమ్యామ్యాలే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలం చెల్లిన ఆటోల వల్ల ట్రాఫిక్ పెరగడంతోపాటు కాలుష్యం అధికమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి కాలం చెల్లిన ఆటోలను స్క్రాప్ చేయకుండా అనుమతులిచ్చిన అధికారులు, వారికి సహాయ సహకారాలు అందిస్తున్న ఉన్నతాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. స్క్రాప్ ఆటోలు ఈస్ట్, సౌత్, వెస్ట్ జోన్‌లనే ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు.

తెలుగు, ఉర్దూ మధ్య వారధిని నిర్మించిన దాశరథి

దాశరథి సాహిత్య సమాలోచన కార్యక్రమంలో కవి వాహెద్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ గజళ్లను, రుబాయిలను తెలుగులోకి అనువదించి రెండు భాషల మధ్య వారధి నిర్మించిన సాహితీమూర్తి దాశరథి అని కవి అబ్దుల్ వాహెద్ కొనియాడారు. తెలుగు, ఉర్దూ తనకు రెండు కళ్ళు అంటూ ఆరు దశాబ్దాల కిందట దాశరథి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నయాపూల్‌లోని ప్రభుత్వ నగర కళాశాల వేదికగా 'దాశరథి కృష్ణమాచార్య సాహిత్య సమాలోచన' అంశంపై సమావేశం జరిగింది. వాహెద్ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ఉర్దూ రచనల్లోని స్ఫూర్తిని తెలుగు పాఠకలోకానికి పరిచయం చేసి, తద్వారా ఇరు సంస్కృతుల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పేందుకు దాశరథి ప్రయత్నించారని అన్నారు. సీనియర్ జర్నలిస్టు ఉదయవర్లు దాశరథితో తనకున్న అనుబంధాన్ని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్, అకాడమీ కార్యదర్శి ఎస్.బాలాచారి మాట్లాడారు. సమావేశానికి తెలుగు శాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు నీరజ, కవులు రాపోలు సుదర్శన్, సోమశిల తిరుపాల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కామన్‌స్కూల్ విధానాన్ని అమలుచేయాలి

బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలి ● రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

బర్కత్‌పుర, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి కామన్‌స్కూల్ విధానాన్ని అమలు చేయాలని ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొస్తేనే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను పూర్తిగా నియంత్రించవచ్చని ఆయన స్పష్టం చేశారు. సంక్షోభంలో ఉన్న విద్యారంగాన్ని కాపాడుకోవాలంటే బడ్జెట్‌లో 20శాతం నిధులు తప్పనిసరి కేటాయించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం యూజీసీ నిధుల్లో 60శాతం కోత విధించిందని, ఇది ప్రమాదకరమైన అంశమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.చక్రధర్‌రావు మాట్లాడారు. సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, టీపీటీఎఫ్ అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడు రమేష్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీఎస్ ప్రదీప్, ఉపాధ్యక్షుడు ఎంఎస్ కిష్టప్ప, పీడీఎస్‌యూ రాష్ట్రఅధ్యక్షుడు రామకృష్ణ, కె.నారాయణ, కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్మితాసబర్వాల్ క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయలక్ష్మి

పంజాగుట్ట,జూలై 24(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్‌లలో దివ్యాంగుల కోటాపై చేసిన వ్యాఖ్యలను ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ ఉపసంహరించుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జాతీయ అధ్యక్షురాలు ఎస్ఎన్ ఉదయలక్ష్మి అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్, నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ వీజీఆర్ నారగోని తదితరులు మాట్లాడారు. సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆమె వ్యాఖ్యలపై వ్యతిరేకత వస్తున్నా, తప్పు ఒప్పుకోకపోగా, వాటిని కొనసాగించడం బాధాకరమని అన్నారు. ఆమెపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చెరుకు నాగభూషణం, భాస్కర్, శారద, శ్రీనివాస్, కిరణ్, పాల్గొన్నారు.

స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

బర్కత్‌పుర, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్‌లలో దివ్యాంగుల కోటాపై వ్యాఖ్యానించిన స్మితాసబర్వాల్‌పై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ దివ్యాంగుల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ దివ్యాంగుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ నారా నాగేశ్వర్‌రావు, అఖిల భారత దివ్యాంగుల ఐక్య వేదిక అధ్యక్షుడు పల్లెబోయిన సుధాకర్ వర్మ, ఫెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసెబుల్డ్ చైర్మన్ ఎం.గంగారాం, దివ్యాంగుల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కొమురయ్య, దివ్యాంగుల మహిళా సాధికారిత సంఘం అధ్యక్షురాలు కె.రాజ్యలక్ష్మి మాట్లాడారు. దివ్యాంగులపై స్మితాసబర్వాల్ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు, హైకోర్టులు సుమోటోగా తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఐఏఎస్ ఆఫీసర్ల సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు దీనిపై స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

49 అంతర్గత రహదారుల నిర్మాణానికి అనుమతి

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి సంబంధించి రూ.1500 కోట్ల పరిపాలనా అనుమతులకు పురపాలక శాఖ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌ఆర్‌డీసీఎల్) పరిధిలో మూడో విడతలో భాగంగా చేపట్టనున్న రెండు ప్యాకేజీలకు సంబంధించి 49 రోడ్లు నిర్మించనున్నారు. ప్యాకేజీ-1 పరిధిలో 24 రహదారులకు సంబంధించి 56.42 కి.మీ నిర్మాణానికి రూ.698.20 కోట్లు, ప్యాకేజీ-2 పరిధిలో 25 రహదారులకు సంబంధించి 63.30 కి.మీ నిర్మాణానికి రూ.801.80 కోట్లు ఖర్చు చేయనున్నారు. హెచ్‌ఆర్‌డీసీఎల్ పరిధిలో మొత్తం 119.72 కి.మీ నూతన రహదారుల నిర్మాణానికి రూ.1500 కోట్లకు పురపాలక శాఖ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. హెచ్‌ఆర్‌డీసీఎల్ సంస్థ డైరెక్టర్ మూడోదశలో చేపట్టనున్న రెండు ప్యాకేజీల పనులకు టెండర్లు పిలిచేందుకు అనుమతించింది.

ప్రత్యేక నంబర్ల వేలం..

ఆర్టీఏకు రూ. 51.17 లక్షల ఆదాయం

● రూ.19.51 లక్షలు పలికిన 9999

హైదరాబాద్ సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక నంబర్ల కొనుగోలుకు వాహనదారులు అమితాసక్తి చూపుతున్నారు. కొత్త సిరీస్ ప్రారంభం నేపథ్యంలో బుధవారం రవాణా శాఖ ఖైరతాబాద్ జోన్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన వేలంలో స్పెషల్ నంబర్ల కోసం పలు కంపెనీలు, వ్యక్తులు పోటీపడ్డారు. టీజీ 09 ఏ9999 నంబర్‌ను హానర్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.19,51,111కు దక్కించుకుంది. టీజీ 09 బీ 0001 నెంబర్‌ను ఎస్‌జీ మైండ్ ఫార్మర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.8.25 లక్షలకు, టీజీ 09 బీ 0009 నంబర్‌ను అమరం అక్షరరెడ్డి రూ.6.66 లక్షలకు సొంతం చేసుకున్నారు. జీటీ 09 బీ 0006 నంబర్ రూ.2.91 లక్షలు, టీజీ 09 బీ 0005 రూ.2.50 లక్షలు, టీజీ 09 బీ 0019 నంబర్ రూ.1.30 లక్షలు పలికింది. మొత్తంగా ప్రత్యేక నంబర్ల వేలంతో ఆర్టీఏకు రూ.51.17 లక్షల ఆదాయం వచ్చింది.

బ్రిక్స్ యూత్ సమ్మిట్‌కు హెచ్‌సీయూ విద్యార్థిని



షేక్ అయేషా

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 26 వరకు రష్యాలో జరుగుతున్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) ఐదు రోజుల యూత్ సమ్మిట్‌లో మనదేశం తరఫున ప్రాతినిధ్యం వహించే బృందంలో హెచ్‌సీయూ విద్యార్థిని అయేషాకు చోటు దక్కింది. అసమానతలు లేని ప్రపంచ అభివృద్ధి, భద్రత, సమానత్వం, సహకారం, రక్షణ తదితర అంశాల్లో పరస్పర సహకారం కోసం నిర్వహించే బ్రిక్స్ సదస్సులో ఆయా దేశాలకు చెందిన యువత ప్రతినిధులుగా హాజరవుతారు. అయేషా హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలో ప్రొఫెసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

వర్గీకరణ బిల్లుపై మాదిగలను మభ్యపెట్టడం తగదు

● టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టకుండా కేంద్రం మాదిగలను మభ్యపెట్టడం తగదని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లగా పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టే విషయాన్ని పొడిగిస్తూ వచ్చిన మోదీ ఈ సారి కూడా అదే పంథాలో కాలం వెళ్ల దీస్తున్నారని ఆరోపించారు. బడ్జెట్‌లో దళితుల అభివృద్ధికి ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణ అంశంపై తాడోపేడో తేల్చుకోవడానికి ఆగస్టు 6న చలో ఢిల్లీ, జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు భాస్కర్, గణేష్, రమేష్, శ్రీనివాస్, శివరాజ్, అంజన్న, లక్ష్మమ్మ, వెంకట్, యాకయ్య, చందు, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌నగర్ సహాయ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

16 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్.. పరారీలో సూత్రధారి

అమీర్‌పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ సమీపంలోని బస్టాప్‌లో ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు ఇద్దరు నిందితులను పట్టుకున్నామని నార్కోటిక్‌బ్యూరో డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. కేసు వివరాలను బుధవారం ఎస్ఆర్‌నగర్‌లోని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శ్రీధర్, ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కలిసి వెల్లడించారు. మంగళవారం ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ సమీపంలోని బస్టాప్‌లో నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో టీం సంయుక్తంగా రంగంలోకి దిగి మల్కాజిగిరికి చెందిన డ్రగ్‌పెడ్లర్ మ్యాథ్యూ సంజయ్(23)తో పాటు వినియోగదారుడు డీజే ఆపరేటర్ ముచినపల్లి రాజ్‌కుమార్(21)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.75వేల విలువగల 16 గ్రాముల ఎండీఎంఏ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. (సంజయ్ బెంగళూర్‌లో డ్రగ్స్ సరఫరా చేసే తన బాల్య మిత్రుడైన అసదుల్లా వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో పలువురికి విక్రయిస్తున్నాడు.) సంజయ్, రాజ్‌కుమార్‌ని రిమాండ్‌కు తరలించారు. సంజయ్ నుంచి డ్రగ్స్ తీసుకున్న నగరంలోని మరో తొమ్మిది మంది వినియోగదారుల సమాచారం సేకరించామని వారితో పాటు ప్రధాన నిందితుడు అసదుల్లాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో డీఐ జానకీరాములు, ఎస్ఐ రాజు రాథోడ్, యాంటీ నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 19.50 లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇప్పిస్తామంటూ.. నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరవాసిని బురిడీ కొట్టించి రూ. 19.50లక్షలు కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి నుంచి నగరవాసికి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తనను తాను మార్వాడీ సెక్యూరిటీస్ ఫైనాన్షియల్ లిమిటెడ్ ప్రతినిధిగా పరిచయం చేసుకున్నాడు. 'మా సంస్థ సెబీలో రిజిస్టర్ అయి గుర్తింపుపొందిందటూ ఐడీ నంబర్‌ను చెప్పాడు. మా తరఫున ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అనతి కాలంలోనే అధిక లాభాలు వస్తాయి' అని నమ్మించాడు. బాధితుడి నంబర్‌ను 140 మంది సభ్యులతో కూడిన వాట్సాప్ గ్రూపులో యాడ్ చేశాడు. ప్రారంభంలో తక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టి లాభాలు అర్జించాడు. అలా మెల్లగా వారి ఊబిలో చిక్కుకున్న బాధితుడు ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టాడు. అనంతరం సైబర్ నేరగాళ్లు విత్‌డ్రా ఆప్షన్ తీసేశారు. ఇదేంటని ప్రశ్నించగా.. వచ్చిన లాభాల్లో 25 శాతం చెల్లిస్తేనే డబ్బులు వెనక్కి ఇస్తామని హెచ్చరించారు. దాంతో బాధితుడు వచ్చిన లాభాల్లోంచి మినహాయించుకోవాలని సూచించగా వారు అంగీకరించలేదు. కచ్చితంగా డబ్బులు చెల్లించాలని చెప్పడంతో బాధితుడు దశలవారీగా వారికి రూ. 19.50లక్షలు చెల్లించాడు. అయినా ఇంకా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వామ్మో.. లార్వా

(5వ పేజీ తరువాయి)

పౌరులకు సూచిస్తున్నారు. అదే సమయంలో భవన నిర్మాణ ప్రదేశాలు, ఫంక్షన్ హాళ్లు, సెల్లార్లు, ఖాళీ స్థలాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని రెండు, మూడు పర్యాయాలు సూచించి, యజమానులు స్పందించకపోతే జీహెచ్ఎంసీ యాక్ట్ 1955లోని పలు సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసి.. అప్పటికీ మారకుంటే జరిమానా విధించే అంశాన్నీ పరిశీలిస్తున్నామని ఉన్నతాధికారొకరు తెలిపారు. భవన నిర్మాణ ప్రదేశాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టకపోతే పట్టణ ప్రణాళికా విభాగం సహకారంతో పనులు నిలిపేసేలా చర్యలు తీసుకోనున్నారు. భవన నిర్మాణ ప్రదేశాల్లో పనిచేసే కార్మికుల్లో కొందరు అక్కడే ఉంటుండగా.. ఇంకొందరు సమీపంలోని బస్తీలు, కాలనీల్లో నివసిస్తున్నారు. పని ప్రదేశంలో దోమల వల్ల కార్మికులు అనారోగ్యానికి గురైతే వారుండే ఇతర ప్రాంతాలకూ వ్యాధులు విస్తరించే ప్రమాదముంది. 'డెంగీ సోకిన వ్యక్తిని కుట్టిన దోమ మరొకరిని కుడితే ఆ వ్యక్తి కూడా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది' అని ఎంటమాలజీ విభాగం అధికారొకరు తెలిపారు.

డెంగీపై అవగాహన కార్యక్రమాలు

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డెంగీపై ప్రజలకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో గురువారం నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డెంగీ లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. వలంటీర్స్‌తో కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు పోస్టర్లు, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. మెహిదీపట్నం సర్కిల్‌లో శాంతిక్లబ్, కార్వాన్ సర్కిల్‌లో ఇబ్రహీంబాగ్ వాసవీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, గోషామహల్ సర్కిల్‌లో హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఖైరతాబాద్ సర్కిల్‌లోని లక్డీకపూల్‌లోని వాసవీ కాలేజ్, జూబ్లీహిల్స్ సర్కిల్ ఫిల్మ్‌నగర్ క్లబ్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు డెంగీపై అవగాహన కార్యక్రమాలు జీహెచ్ఎంసీ నిర్వహిస్తోంది.



ఖాళీ స్థలాల్లో చెత్త ఉంటే..

కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తుంటాయి. కొన్ని చోట్ల వర్షం నీరూ నిలుస్తోంది. ఇటీవల డెంగీ కేసులు నమోదవుతోన్న ఏరియాల్లో ఎక్కువగా ఇలాంటి పరిస్థితులే క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా రెసిడెన్షియల్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లను భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. స్థలం యజమాని కూడా చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, పరిస్థితి తీవ్రంగా మారితే నోటీసులు జారీ చేయడంతోపాటు జరిమానా విధిస్తామని చెబుతున్నారు.

లాంగ్ రూట్లపై ఆర్టీసీ దృష్టి

(5వ పేజీ తరువాయి)

ఇండస్ట్రియల్‌ఎస్టేట్, లాలాపేట, తార్నాక, శంకర్‌మఠ్, నారాయణగూడ, మాసబ్‌ట్యాంక్, ఎంపీఏ క్రాస్‌రోడ్, నానల్‌నగర్, దర్గా, గచ్చిబౌలి, బయో-డైవర్సిటీ, ఐకియా, హైటెక్‌సిటీ, కొండాపూర్‌కు రెండు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను గురువారం ఉదయం నుంచి నడుపుతోంది. ఘట్‌కేసర్ నుంచి మొదటి బస్సు ఉదయం 6.10 గంటలకు, చివరి బస్సు మధ్యాహ్నం 3.40 గంటలకు, కొండాపూర్ నుంచి మొదటి బస్సు ఉదయం 8.40 గంటలకు, చివరి బస్సు సాయంత్రం 6.25గంటలకు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. 215 రూట్‌లో అరాంఘర్, రాజేంద్రనగర్ నుంచి వయా వీకర్ సెక్షన్‌కాలనీ, డైరీఫామ్, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ, జ్యోతినగర్, బృందావనకాలనీ, దర్గా, ఖాజాగూడ ఎక్స్‌రోడ్, బయో-డైవర్సిటీ, ఐకియా, రాయదుర్గం, హైటెక్‌సిటీ/సైబర్‌టవర్స్, కొత్తగూడ ఎక్స్‌రోడ్ మీదుగా కొండాపూర్ వరకు రెండు బస్సులు నడుపుతున్నారు. ఆరాంఘర్ నుంచి మొదటి బస్సు ఉదయం 7.20 గంటలకు, చివరి బస్సు రాత్రి 9.15 గంటలకు, కొండాపూర్ నుంచి మొదటి బస్సు ఉదయం 8.30 గంటలకు, చివరి బస్సు రాత్రి 10.25 గంటలకు ఉంటుందని అధికారులు తెలిపారు.

అతి వ్యాయామం అనర్థమే!

(5వ పేజీ తరువాయి)

వారానికి రెండుసార్లు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వ్యాయామాలు చేయాలి. సాధారణంగా రోజుకు 60 నుంచి 90 నిమిషాలు, వారానికి మూడు రోజుల వ్యాయామం సరిపోతుందని నగరంలోని పలువురు ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. అతిగా చేసే వ్యాయామం వల్ల కలిగే అనర్థాల గురించి ఫిట్‌నెస్ నిపుణులు రఘు వెల్లడిస్తూ సరైన రీతిలో వ్యాయామం చేయడం వల్ల శరీరంలో రోగ నిరోధకశక్తి పెరగడంతో పాటుగా ఒత్తిడి తగ్గించే హార్మోన్లు కూడా విడుదలవుతాయి. అధికంగా వ్యాయామం చేయడం వల్ల విడుదలయ్యే అడ్రినలైన్ లాంటి హార్మోన్లు మంచికన్నా ఎక్కువగా చెడు చేస్తాయి. అధిక వ్యాయామాల వల్ల నిద్రలేమి లాంటి సమస్యలతో పాటుగా అమ్మాయిలలో పీరియడ్స్ సరిగా రాకపోయే అవకాశాలూ ఉన్నాయని వివరించారు.

హాట్ సీటుగా హెచ్‌ఎండీఏ

(5వ పేజీ తరువాయి)

పరిష్కారం చేసి అనుమతులివ్వాలి.

ఐదేళ్లకు మించి పనిచేస్తున్న వారు సొంత శాఖకు?

హెచ్‌ఎండీఏలో డిప్యుటేషన్‌పై వచ్చి వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులను సొంత శాఖకు పంపించేందుకు చర్యలు చేపట్టారు. ఐదేళ్లకు మించి డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఉద్యోగుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ప్లానింగ్ విభాగంలో నలుగురు, ఇంజనీరింగ్ విభాగంలో 30మంది ఇతర అడ్మినిస్ట్రేటివ్ విభాగాల్లో మరో 30మంది వరకు ఉన్నారు. అర్బన్ ఫారెస్టు విభాగంలో పది మందికి పైగా ఉండగా, ఇటీవల డిప్యుటేషన్ గడువు ముగియడంతో వారంతా సొంత శాఖకు వెళ్లారు. హెచ్‌ఎండీఏలోని వివిధ విభాగాల్లో పలువురు అప్పటి కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల పైరవీలతో వచ్చారు. కొందరిది డిప్యుటేషన్ గడువు ముగిసినా పలుకుబడితో హెచ్‌ఎండీఏలోనే కొనసాగుతున్నారు. తాజా బదిలీల నేపథ్యంలో స్థానచలనం కలగనుంది.



చదువంటే ఇష్టం. నృత్యం అంటే ప్రాణం. సెయిలింగ్ కోసం అన్నిటినీ పక్కన పెట్టారు నేత్ర కుమనన్. ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి మహిళా సెయిలర్‌గా చరిత్రకెక్కారు. ఇప్పుడు ప్యారిస్‌లో పతకాల పంట పండించడానికి సిద్ధమయ్యారు.

ఉప్పొంగే కెరటం

"ఎన్నో క్రీడలతో, కళలతో నాకు పరిచయం ఉంది. కొన్నిటిలో ప్రావీణ్యం కూడా ఉంది. కానీ అవేవీ సెయిలింగ్ స్థాయిలో సవాల్ విసరలేదు" అంటారు నేత్రా కుమనన్. తమిళనాడులోని చెన్నైకి చెందిన ఈ 26 ఏళ్ల అమ్మాయి ప్యారిస్ ఒలింపిక్స్‌లో... సెయిలింగ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది ఆమెకు రెండో ఒలింపిక్స్. 2020లో టోక్యో ఒలింపిక్స్‌కు ఎంపికై, సెయిలింగ్‌లో భారత్ తరఫున పోటీ పడిన తొలి మహిళగా నిలిచారు. ఈసారి కూడా ఆ విభాగంలో మన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక మహిళ ఆమే కావడం విశేషం.

అదే బాగా నచ్చింది...

"మా నాన్న వి.సి.కుమరన్ పారిశ్రామికవేత్త. అమ్మ శ్రీజ హెచ్ఆర్ రంగ నిపుణురాలు. ఏటా వేసవి సెలవుల్లో నన్ను, నా తమ్ముడు నవీన్‌ను ఏదో ఒక సమ్మర్ క్యాంపులో చేర్చేవారు. పన్నెండేళ్లకే అనేక అంశాల్లో నేను ప్రావీణ్యం సాధించాను. 2009లో 'తమిళనాడు సెయిలింగ్ అసోసియేషన్' ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లో సెయిలింగ్ నాకు పరిచయమయింది" అంటున్న నేత్ర... రెండుసార్లు నేషనల్ ఛాంపియన్‌గా, రెండుసార్లు రన్నరప్‌గా నిలిచారు. "అప్పటి నుంచే సెయిలింగ్‌ను ఒక కెరీర్‌గా తీసుకున్నాను. దాని కోసం ఎన్నో వదులుకోవాల్సి వచ్చింది. చిన్నప్పటి నుంచీ నేను మెరిట్ స్టూడెంట్‌ను. కానీ సెయిలింగ్‌వల్ల నా చదువుకు చాలాసార్లు బ్రేక్ పడింది. నా ఫ్రెండ్స్ కన్నా నాలుగేళ్లు వెనుకబడ్డాను. ఈ మధ్యే మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఇప్పుడు ఎంబీఏ చేస్తున్నాను. అయితే.. ఒకటి సాధించాలంటే రెండోది వదులుకోవాలి. ఇక... భరతనాట్యం అంటే నాకు ప్రాణం. పద్మభూషణ్ అలర్మేల్ వల్లి దగ్గర ఆరేళ్లకు పైగా శిక్షణ పొందాను. సింగపూర్, వియత్నాం, ఇండోనేషియాల్లో జరిగిన గ్లోబల్ ఆర్ట్స్ ఇంటర్నేషనల్ కాంపిటీషన్స్‌లో బహుమతులు పొందాను. సెయిలింగ్ కోసం అది కూడా పక్కన పెట్టాల్సి వచ్చింది" అంటారు నేత్ర.

అదే ప్రధానం

భారత్‌లో సెయిలింగ్‌ను ఎంచుకొనే మహిళల సంఖ్య చాలా తక్కువ. ఈ కోణంలో చూసినప్పుడు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న నేత్ర ప్రత్యేకత ఏమిటనేది స్పష్టమవుతుంది. "ఒంటి చేత్తో, ఒక చిన్న డింగీ లాంటి బోటును నడిపే 'లేజర్ రేడియల్ కేటగిరీ' సెయిలర్‌ని నేను. సముద్రం, గాలి, ఉష్ణోగ్రత, అలలు... ఇలా ప్రకృతిలోని ప్రతిదాన్నీ అర్థం చేసుకోవాలి. ఇది మానసిక క్రీడ. ఏదీ మన నియంత్రణలో ఉండదు. మనం ప్రకృతితో పోటీ పడలేం. క్షణాల వ్యవధిలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే గెలుపు, ఓటములను పెద్దగా పట్టించుకోను. మనం ఎంత పోటీ ఇస్తున్నామనేదే ప్రధానం"

స్కేటింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, సైక్లింగ్, బాస్కెట్‌బాల్ లాంటి క్రీడలే కాదు, భరతనాట్యం, పెయింటింగ్ లాంటి కళలు, కరాటే, కలరిపయట్టు లాంటి యుద్ధ క్రీడల్లోనూ నేత్రకు ప్రావీణ్యం ఉంది.

అంటారు నేత్ర. 2021లో శిక్షణ ప్రారంభించిన ఆమె... 2014 నుంచి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారు. 2014, 2018 ఆసియా క్రీడల్లో వరుసగా ఏడు, అయిదు స్థానాల్లో నిలిచారు. 2015 క్లాస్ ఛాంపియన్‌షిప్‌లో, 2021, 2022 ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లలో రెండు స్వర్ణాలను, ఒక రజతాన్ని గెలిచారు. 2021లో అమెరికాలోని మియామీలో జరిగిన 'హెంపెల్ సెయిలింగ్ వరల్డ్ కప్ సిరీస్'లో కాంస్య పతకం గెలిచి, ఆ ఘనత సాధించిన మొదటి భారతీయురాలిగా నిలిచారు. 2022 'యూరోపా కప్'లో కాంస్యం సాధించారు.

అప్పుడు ఒత్తిడికి గురయ్యా...

సెయిలింగ్ అభ్యాసం ప్రారంభించిన రెండేళ్లలోనే ఆమె పతకాలు గెలవడం మొదలెట్టారు. 2015, 2016ల్లో వరుసగా నేషనల్ టైటిల్స్ అందుకున్నారు. ఆ తరువాత మెరుగైన శిక్షణ కోసం ఇజ్రాయిల్, ఇటలీ తదితర దేశాలకు వెళ్ళారు. 2017లో 'యాచ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ఆమెను 'వరల్డ్ సెయిలింగ్ ఎమర్జింగ్ నేషన్స్ ప్రోగ్రామ్'కు ఎంపిక చేసింది. "వివిధ దేశాల్లో పెద్దగా ప్రాచుర్యం లేని క్రీడల్లో యువతను, ప్రత్యేకించి మహిళలను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన కార్యక్రమం ఇది" అని చెబుతారామె. 2020లో 'హెంపెల్ వరల్డ్ కప్ సిరీస్'లో కాంస్య పతకం సాధించాక... స్పెయిన్‌లోని 'గ్రాన్ కనారియా సెయిలింగ్ అకాడమీ'లో చేరి... తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకున్నారు. "ఆమెను చూస్తే ఉప్పొంగే కెరటంలా అనిపిస్తుంది. ఎంత కష్టమైనా లక్ష్యాన్ని సాధించాలనే తపన ఆమెలో కనిపిస్తుంది" అంటూ కోచ్‌ల ప్రశంసలు అందుకున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 35వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. "తీవ్రమైన ఒత్తిడికి గురి కావడమే దానికి కారణం. కానీ మన దగ్గర పెద్దగా ప్రాచుర్యం లేని ఈ క్రీడ మీద దేశం దృష్టిపడేలా చేసినందుకు సంతోషంగా ఉంది.. ఈసారి మరింత మెరుగ్గా రాణించడానికి శాయశక్తులా కృషి చేస్తాను" అని చెప్పారు నేత్ర. ఇప్పుడు ఆమెకు మరో అవకాశం రానే వచ్చింది. ఏప్రిల్‌లో జరిగిన క్వాలిఫయర్‌లో సత్తా చాటి... 'వరల్డ్ సెయిలింగ్ ఎమర్జింగ్ నేషన్స్ ప్రోగ్రామ్' కోటాలో ప్యారిస్ ఒలింపిక్స్‌కు ఎంపికయ్యారు. "ఇప్పుడు మరింత సన్నద్ధంగా ఉన్నాను. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనేది నా ఆశయం" అంటున్నారు నేత్ర.



HYDERABAD | HANAMKONDA | KHAMMAM | KARIMNAGAR | VIJAYAWADA | VIZAG | KAKINADA | NELLORE
GUNTUR | BHIMAVARAM | RAJAHMUNDRY | VIZIANAGARAM | ELURU | BENGALURU | COIMBATORE | INDORE | RAIPUR
CONNECT WITH US: 040 2300 0115 | CUSTOMER CARE: 92900 60707 | FOLLOW US ON

పసరుమందుతో కామెర్లు తగ్గుతాయా?

కౌన్సెలింగ్



Q డాక్టర్! మా అబ్బాయికి 13 ఏళ్లు. కామెర్లు సోకడంతో బడి మాన్పించి ఇంటికే పరిమితం చేశాం. అలాగే ఉప్పు, కారాలు లేని చప్పని భోజనంతోనే సరిపెడుతున్నాం. పసరు మందు ఇప్పిస్తున్నాం. కాబట్టి సాధారణ వైద్యం అవసరం లేదని అంటున్నారు. పసరు మందు సరిపోతుందా లేదంటే అదనంగా ఇతరత్రా మందులేమైనా అవసరమవుతాయా?

A కామెర్లకు కారణం కాలేయం జబ్బు పడడమే! అయితే కాలేయం ఎందుకు జబ్బు పడిందో కారణం తెలుసుకుని తగిన వైద్యం ఇప్పించడం అవసరం. హెపటైటిస్ బి, సి వైరల్ ఎల వల్ల కూడా కాలేయం దెబ్బతింటుంది. ఈ వైరస్‌లను సమూలంగా నాశనం చేయాలంటే వైద్యులను కలిసి సమర్థమైన చికిత్స తీసుకోవలసి ఉంటుంది. సోకిన వైరస్‌నుబట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. మరీ ముఖ్యంగా కామెర్లకు నాటు మందులు వాడడం ప్రమాదకరం. వాటిలోని హెవీ మెటల్స్ కాలేయానికి కీడు చేసి, సమస్యను తీవ్రతరం చేస్తాయి. నాటుమందులు తీసుకోవడం వల్ల ప్రయోజనం లేకపోగా, కాలేయం మరింత దెబ్బ తినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి నాటు మందుల జోలికి వెళ్లకుండా అవసరాన్ని బట్టి వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. ఒకవేళ పదే పదే కామెర్లు వేధిస్తున్నా, నిస్సత్తువ, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనిపిస్తున్నా కాలేయ వ్యాధిగా పరిగణించి, వైద్యులను ఆశ్రయించాలి. తోచిన చికిత్సలకు, చిట్కాలకు స్వస్తి చెప్పి వైద్యులను కలిసి తగిన పరీక్షలతో కామెర్లకు మూల కారణాన్ని గుర్తించి సమర్థమైన చికిత్సలు అందించడం శ్రేయస్కరం. ఇక పత్యం విషయానికొస్తే, జబ్బుపడిన కాలేయం నుంచి ఎంజైమ్స్ స్రావం తగ్గుతుంది కాబట్టి తేలికగా అరిగే ఆహారం అందించాలి. అలాగని పోషకాల కొరతకు గురయ్యేలా పత్యం ఉంచవలసిన అవసరం లేదు. నూనె తగ్గించాలి. పూర్తిగా మానేయవలసిన అవసరం లేదు. కూరగాయలు, పప్పు, ఆకుకూరలు, పండ్లు, నట్స్ భోజనంలో ఉండేలా చూసుకోవాలి. బలవర్థకమైన ఆహారంతో కామెర్ల నుంచి త్వరగా కోలుకోగలుగుతారు. కాబట్టి మాంసాహారం మినహా మిగతావన్నీ మునుపటిలాగే తినిపించవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా పసరు మందులు మానేసి, వైద్యులు సూచించిన కామెర్ల మందులను వాడుకోవాలి.

డాక్టర్ రమేష్,
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హైదరాబాద్

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/QVRBbL9లో చదవండి.

బిజినెస్



కొలువుల కల్పనలో ప్రైవేటు రంగం బాధ్యత కీలకం

ఆనంద్ మహీంద్ర

న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగాల కల్పనలో ప్రైవేటు రంగానికి కూడా బాధ్యత ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్ర గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర అన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన ప్రశంసించారు. ప్రభుత్వ చర్యలకు అనుగుణంగా, ప్రైవేటు రంగం కూడా ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన దీనికి సంబంధించి తన అభిప్రాయాలు పోస్టు చేశారు. బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా యువకుల నైపుణ్యాలకు సాన పెట్టాలని కోరారు. లేకపోతే మన అధిక జనాభా వరంగా గాక, పెద్ద విపత్తుగా మారే ప్రమాదం ఉందని ఆనంద్ మహీంద్ర హెచ్చరించారు. ప్రస్తుత సంక్షుభిత ప్రపంచంలో మన అధిక జీడీపీ వృద్ధిరేటు అందరికీ కన్ను కుట్టేలా ఉందన్నారు. అయినా మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక దేశాలు ఆసక్తితో ఉన్నాయన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,410 ▲	65,410 ▲	92,000 ▼
ముంబై	69,150 ▼	63,340 ▼	84,860 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	500
వరంగల్	492	గోదావరి	485
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	112
వరంగల్	112	గుంటూరు	115
కరీంనగర్	112	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	120
కర్నూలు	112	నెల్లూరు	120
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	112		

బీఎండబ్ల్యూ మోటోరాడ్ తొలి ఈ-స్కూటర్

భారత మార్కెట్లోకి ప్రవేశం



ధర 15 లక్షలు

న్యూఢిల్లీ: జర్మన్ ఆటోమొబైల్ దిగ్గజం బీఎండబ్ల్యూకు చెందిన ద్విచక్ర వాహన విభాగం బీఎండబ్ల్యూ మోటోరాడ్ కూడా భారత ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్లోకి ప్రవేశించింది. 'బీఎండబ్ల్యూ సీఈ 04' పేరుతో ప్రీమియం ఈ-స్కూటర్‌ను బుధవారం లాంచ్ చేసింది. దీని ధర రూ.14.90 లక్షలు. ప్రస్తుతం దేశంలో ఇదే అత్యంత ఖరీదైన ఈ-స్కూటర్. అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఒకటి కూడా. ఇది గంటకు 120 కి.మీ వేగంతో ప్రయాణించగలదని, 2.6 సెకన్లలో సున్నా నుంచి 50 కి.మీ వేగాన్ని అందుకోగలదని కంపెనీ వెల్లడించింది. 8.5 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన ఈ వాహనం.. సింగిల్ చార్జింగ్‌తో 130 కి.మీ వరకు ప్రయాణించగలదని తెలిపింది. 10.25 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే విత్ స్ప్లిట్ స్క్రీన్ అండ్ బ్లూటూత్ కనెక్టివిటీ, మూడు రైడింగ్ మోడ్స్ ట్రాక్షన్ కంట్రోల్, ఏబీఎస్, కీ లెస్ రైడ్, రివర్సింగ్ ఎయిడ్ వంటి ఫీచర్లతో ఈ స్కూటర్‌ను డిజైన్ చేసినట్లు బీఎండబ్ల్యూ మోటోరాడ్ తెలిపింది. భారత్‌లోని ఎంపిక చేసిన మెట్రోపాలిటన్ నగరాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నట్లు, సెప్టెంబరు నుంచి కస్టమర్లకు డెలివరీ అందించనున్నట్లు కంపెనీ తెలియచేసింది.

బీఎండబ్ల్యూ 5 సిరీస్ సరికొత్తగా..

బీఎండబ్ల్యూ ఇండియా బుధవారం మూడు కొత్త కార్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. వీటిలో సరికొత్త బీఎండబ్ల్యూ 5 సిరీస్ లాంగ్ వీల్ బేస్ (ఎల్‌డబ్ల్యూబీ) కారుతో పాటు అప్‌డేటెడ్ మినీకూపర్ ఎస్, ఆల్ ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ ఉన్నాయి. ఎనిమిదో తరం బీఎండబ్ల్యూ 5 సిరీస్ ఎల్‌డబ్ల్యూబీ ధర రూ.72.90 లక్షలు కాగా.. మినీ కూపర్ ఎస్ రేటు రూ.44.90 లక్షలు, ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ ధర రూ.54.90 లక్షలుగా ఉంది.

ఎల్ అండ్ టీ లాభం రూ.2,786 కోట్లు

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికానికి ఎల్ అండ్ టీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.2786 కోట్లకు చేరుకుంది. ఆదాయం 15 శాతం పెరుగుదలతో రూ.55,120 కోట్లుగా నమోదైంది. భారీ ఆర్డర్‌బుక్‌తో కూడిన మాన్యుఫాక్చరింగ్ పోర్ట్‌ఫోలియోతో పాటు వేగంగా ప్రాజెక్టుల అమలు ఇందుకు దోహదపడిందని ఎల్ అండ్ టీ పేర్కొంది. ఈ క్యూ1లో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి రూ.26,248 కోట్ల ఆదాయం లభించిందని, మొత్తం రెవెన్యూలో ఇది 48 శాతానికి సమానమని కంపెనీ వెల్లడించింది. గడిచిన మూడు నెలల్లో గ్రూప్ మొత్తానికి రూ.70,936 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయని, క్రితం సంవత్సరంలో ఇదే కాలంతో పోలిస్తే 8 శాతం అధికమని తెలిపింది. ముఖ్యంగా పశ్చిమాసియా నుంచి అధిక ఆర్డర్లు లభించాయంది. ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ప్రతికూలతలున్నప్పటికీ ఈ క్యూ1లో అన్ని విభాగాల్లో బలమైన పనితీరును కబరిచామని ఎల్ అండ్ టీ ఛైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గణనీయ మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బడ్జెట్ ప్రకటనలు వికసిత్ భారత్ లక్ష్యాలకు బాటలు వేయనుందన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లాభం రూ. 6,436 కోట్లు

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ మొదటి త్రైమాసికంలో రూ.6436 కోట్ల ఏకీకృత నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభంతో పోల్చితే ఇది 5.7 శాతం అధికం. స్టాండ్ అలోన్ లాభం రూ.6,035 కోట్లుగా నమోదైంది. గత ఏడాదిలో ఇదే సమయానికి ఆర్జించిన రూ.5,797 కోట్ల లాభంతో పోలిస్తే 4 శాతం పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 12 శాతం వృద్ధితో రూ.13,448 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.05 శాతంగా నమోదైంది. ఇతర ఆదాయం 14 శాతం పెరుగుదలతో రూ.5783 కోట్లుగా ఉంది. గడిచిన మూడు నెలల్లో కొత్తగా రూ.4,793 కోట్ల రుణాలు మొండి పద్దులుగా మారాయి. మొండి బకాయిల నష్టాలను పూడ్చుకునేందుకు జూన్ త్రైమాసికంలో బ్యాంక్ రూ.2,551 కోట్ల కేటాయింపులు జరిపింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో జరిపిన రూ.832 కోట్ల కేటాయింపులతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు ఇది. ఈ జూన్ చివరినాటికి బ్యాంక్ స్థూల మొండిబకాయిలు (జీఎన్‌పీఏ) 1.54 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.34 శాతానికి దిగివచ్చాయి.

బజాజ్ ఫిన్‌సర్వ్ లాభంలో 10% వృద్ధి

న్యూఢిల్లీ: బజాజ్ ఫిన్‌సర్వ్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ.2,138 కోట్లకు చేరింది. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి సంస్థ లాభం రూ.1,943 కోట్లుగా నమోదైంది. త్రైమాసికాదాయం రూ.31,480 కోట్లకు ఎగబాకింది. కిందటి ఏడాదిలో ఇదే సమయానికి ఆర్జించిన రెవెన్యూ రూ.23,280 కోట్లుగా ఉంది. కాగా, వ్యయాలు రూ.18,157 కోట్ల నుంచి రూ.25,514 కోట్లకు పెరిగాయి. బజాజ్ గ్రూప్‌లోని విభిన్న ఆర్థిక సేవల వ్యాపార హోల్డింగ్ కంపెనీయే బజాజ్ ఫిన్‌సర్వ్. దీని అనుబంధ విభాగమైన బజాజ్ అలియాన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ గడిచిన త్రైమాసికానికి రూ.576 కోట్ల లాభాన్ని, మరో అనుబంధ విభాగం బజాజ్ అలియాన్జ్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.104 కోట్ల లాభాన్ని నమోదు చేశాయి.

ఎస్‌బీఐ లైఫ్ ప్రాఫిట్ జూమ్

న్యూఢిల్లీ: జూన్ త్రైమాసికంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.520 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కిందటి ఏడాదిలో ఇదే కాలానికి గడించిన రూ.381 కోట్ల లాభంతో పోలిస్తే 36.48 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన మూడు నెలల్లో కొత్త ప్రీమియం వసూళ్లు రూ.7,033 కోట్లకు పెరగగా.. రెగ్యులర్ ప్రీమియం వార్షిక ప్రాతిపదిన 19 శాతం పుంజుకుంది. ఈ జూన్ 30 నాటికి ఎస్‌బీఐ లైఫ్ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ వార్షిక ప్రాతిపదికన 26 శాతం వృద్ధి చెంది రూ.4,14,772 కోట్లకు చేరుకుంది.

ప్రతి 10 మందిలో ఏడుగురికి నష్టాలే...

ఇంట్రా డే క్యాష్ ట్రేడింగ్‌పై సెబీ నివేదిక



న్యూఢిల్లీ: డెరివేటివ్స్ ట్రేడింగ్‌లోనే కాదు... ఈక్విటీ క్యాష్ విభాగంలోని ఇంట్రా డే ట్రేడింగ్‌లోనూ రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోతున్నారు. ఇలా ట్రేడింగ్ చేసే ప్రతి పది మంది రిటైల్ మదుపరుల్లో ఏడుగురు నష్టపోతున్నట్టు సెబీ తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెబీ జరిపిన ఒక అధ్యయనంలో ఈ విషయం తేలింది. ఇలా నష్టాలు వస్తున్నా ఇంట్రా డే ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసేందుకు మదుపరులు ఏ మాత్రం వెనకాడడం లేదు. 2018-19తో పోలిస్తే 2022-23లో ఇలా ట్రేడింగ్ చేసే మదుపరుల సంఖ్య మూడు రెట్లు పెరగడమే ఇందుకు నిదర్శనం. లాభాలు సంపాదించిన వారి కంటే, నష్టపోయిన వారే, మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మళ్లీ మళ్లీ ఇంట్రా డే ఈక్విటీ క్యాష్ ట్రేడింగ్‌లోకి ప్రవేశిస్తున్నట్టు సెబీ అధ్యయనం తెలిపింది.

ప్రతి ముగ్గురిలో ఒకరు

ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసే ప్రతి ముగ్గురిలో ఒకరు ఇంట్రా డే ఈక్విటీ ట్రేడింగ్ చేస్తున్నట్టు సెబీ అధ్యయనంలో తేలింది. వీరిలో 48 శాతం మంది 30 ఏళ్ల కంటే తక్కువ వయస్కులే ఉన్నారు. 2018-19లో వీరి పాత్ర 18 శాతం మాత్రమే. కొవిడ్ తర్వాత యువకులు పెద్ద సంఖ్యలో స్టాక్ మార్కెట్ లావాదేవీల్లోకి ప్రవేశించడం ఇందుకు ప్రధాన కారణం. టెక్నాలజీతో బాగా పరిచయం ఉన్న వీరిలో ఎక్కువ మంది ఇంట్రా డే ఈక్విటీ క్యాష్ ట్రేడింగ్ సైతం చేస్తున్నారు. అయితే ఇలా ట్రేడింగ్ చేసే యువకుల్లో 76 శాతం మంది ఇంట్రా డే క్యాష్ ట్రేడింగ్‌లోనూ నష్టపోతున్నట్టు సెబీ అధ్యయనం తెలిపింది.

నాలుగో రోజూ నష్టపోయిన మార్కెట్

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 280.16 పాయింట్ల నష్టంతో 80,148.88 వద్ద ముగియగా నిఫ్టీ 65.55 పాయింట్ల నష్టంతో 24,413.50 వద్ద ముగిసింది. బ్యాంకిం గ్, ఫైనాన్షియల్, ఆటోమొబైల్ కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాలు హోరెత్తడంతో ఇంట్రా డేలో సెన్సెక్స్ 678.53 పాయింట్ల వరకు నష్టపోయింది.

రియల్టీ లాభాలకు ఢోకా లేదు: సీబీడీటీ చీఫ్

న్యూఢిల్లీ: ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించడం వల్ల రియల్ ఎస్టేట్ లాభాలు ఏ మాత్రం తగ్గబోవని సీబీడీటీ చీఫ్ రవి అగర్వాల్ అన్నారు. మంగళవారం నాటి కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ద్రవ్యోల్బణం ఆధారంగా ఆస్తులపై పెట్టిన ఖర్చులను లెక్కించే ఈ ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని రద్దు చేశారు. దీంతో స్థిరాస్తుల అమ్మకాలపై వచ్చే లాభాలపై మరింత పన్ను భారం పడుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. స్థిరాస్తులను కొన్న తర్వాత రెండేళ్లకు పైగా ఉంచుకుని అమ్మగా వచ్చే లాభాలపై దీర్ఘకాలిక మూల ధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) కింద ఇప్పటి వరకు ఇండెక్సేషన్ పోగా 20 శాతం పన్ను విధిస్తున్నారు. తాజా ప్రతిపాదనతో ఇండెక్సేషన్ ప్రయోజనం లేకుండా 12.5 శాతం ఎల్‌టీసీజీటీ విధిస్తారు. దీన్ని సాధారణ గణాంకాల్లా చూడకుండా, మార్కెట్ ధరల ఆధారంగా చూడాలని సీబీడీటీ చీఫ్ అగర్వాల్ కోరారు. గత పదేళ్లలో ఇండెక్సేషన్ ప్రయోజనం మహా అయితే ఒకటిన్నర రెట్లు పెరిగితే, స్థిరాస్తుల మార్కెట్ ధరలు మూడు రెట్లకుపైగా పెరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.



ప్యారిస్ వేదికగా శుక్రవారం నుంచి ఒలింపిక్స్ జరుగుతున్న నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సమేతంగా లండన్ చేరుకున్నారు. అక్కడున్న హైడ్ పార్క్‌లో రామ్‌చరణ్, ఉపాసన, మనవరాలు క్లీంకారాతో ప్రకృతిని ఆస్వాదిస్తున్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గురువారం మెగా కుటుంబం పారిస్ వెళుతుంది.

గుర్తుండిపోయే పాత్ర



సందీప్ కిషన్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'రాయన్'. తమిళ నటుడు ధనుశ్ స్వీయ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. కళానిధి మారన్ నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా సందీప్ కిషన్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ధనుశ్ నటించిన 50వ చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకే తగ్గట్లే ఆయన ప్రతీ విషయంలో జాగ్రత్త పడ్డారు. అద్భుతమైన స్ర్కీన్‌ప్లేతో నడిచే ఈ సినిమాలో ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది. ఇందులో నేను పోషించిన పాత్ర చాలా కీలకం. నా కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఇది. సినిమాలో యాక్షన్ మాత్రమే కాకుండా మనసుకు హత్తుకునే భావోద్వేగాలు, అందరినీ అలరించే వినోదం ఉంటుంది. ఇది 'రాయన్' అనే ఇంటిపేరు గల ఓ ఫ్యామిలీతో ముడిపడిన కథ. సినిమాలో వచ్చే ప్రతీ పోరాట ఘట్టం ప్రత్యేకంగా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారు. ఏ.ఆర్. రెహమాన్ అందించిన పాటలు సినిమాకు అదనపు ఆకర్షణ" అని చెప్పారు.

అంతర్యుద్ధాన్ని ఆవిష్కరించేలా...



'పలాస 1978', 'నరకాసుర' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రక్షిత్ అట్లూరి నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ధ్యాన్ అట్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మీడియాతో ముచ్చటించారు.

"ఇది కొత్తతరానికి బాగా చేరువయ్యే థ్రిల్లర్. నాన్న వెంకట సత్యకు దర్శకుడిగా ఇది తొలి సినిమా అయినా ఎక్కడా తడబడలేదు. ఈ సినిమా ప్రతీ మనిషిలో జరిగే ఆలోచనల అంతర్యుద్ధాన్ని కొత్తగా ఆవిష్కరిస్తుంది. ఇందులో నేను ఆనంద్ శ్రీరామ్ అనే టీవీ రిపోర్టర్ పాత్రలో కనిపిస్తాను. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో ఓ విభిన్నమైన ప్రేమ కథ కూడా ఉంటుంది. ఈ సినిమా ఒక మనిషి ఎలా సైకోగా మారతాడో విజువల్‌గా చూపిస్తుంది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులు తమ టికెట్‌కు వంద శాతం న్యాయం జరిగిందని భావిస్తారు" అని చెప్పారు.



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. 'బీఎస్‌ఎస్ 12' వర్కింగ్ టైటిల్. లుధీర్ బైరెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేశ్ చందు నిర్మిస్తున్నారు. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంలో కల్ట్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోందని నిర్మాతలు తెలిపారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్ ఆర్.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



అనసూయ, జగపతిబాబు ప్రధాన పాత్రలు పోషించిన 'సింబా' చిత్రం ఆగస్టు 9న విడుదల కానుంది. మురళీ మనోహర్ దర్శకత్వంలో దాసిర రాజేంద్రరెడ్డి నిర్మించిన చిత్రమిది. బుధవారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అనసూయ మాట్లాడుతూ ' చాలా మంచి కాన్సెప్ట్‌తో 'సింబా' రూపుదిద్దుకుంది. జగపతిబాబు ఈ చిత్రానికి ప్రధాన బలం' అన్నారు. 'మా సినిమాకు కథే హీరో. ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోండి. ముందు తరాల గురించి ఆలోచించండి... అని చెబుతున్నాం' అన్నారు నిర్మాత రాజేందర్‌రెడ్డి. సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఇదనీ, ఇంతవరకూ ఇండియన్ స్ర్కీన్ మీద ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. ఈ సినిమాకు కథ, స్ర్కీన్‌ప్లే అందించిన సంపత్ నందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హీరోగా రాజ్‌తరుణ్ అందుకే



రాజ్‌తరుణ్, హాసిని జంటగా నటించిన చిత్రం 'పురుషోత్తముడు'. రామ్ భీమన దర్శకత్వంలో డా.రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు రామ్‌భీమన, నిర్మాత డా.రమేశ్ తేజావత్, హీరోయిన్ హాసిని మీడియాతో ముచ్చటించారు. దర్శకుడు రామ్‌భీమన మాట్లాడుతూ "మా బడ్జెట్‌కు తగ్గ హీరో కోసం అన్వేషిస్తున్న క్రమంలో రాజ్‌తరుణ్ అయితే అన్ని విధాలా బావుంటుందనిపించింది. అందుకే ఆయన్ను హీరోగా తీసుకున్నాం" అని చెప్పారు. నిర్మాత డా. రమేశ్ తేజావత్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబమంతా కలసి చూసేలా సినిమాను రూపొందించాం. ప్రతీ సన్నివేశాన్ని ఎంతో క్వాలిటీతో తెరకెక్కించాము" అని తెలిపారు. హీరోయిన్ హాసిని మాట్లాడుతూ "ఇందులో నాకు, రాజ్ తరుణ్‌కు మధ్య వచ్చే లవ్‌ట్రాక్ అద్భుతంగా ఉంది. నేను పోషించిన పాత్ర అందరికీ నచ్చుతుంది. సినిమాలో ఏడు పాటలున్నాయి. వేటికవే ప్రత్యేకంగా ఉండే ఆ పాటలు తెరపై ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తాయి" అని చెప్పారు.

పాటల రేవులో సాహితీ సంగమం



మత్స్యకారుల జీవితాలను ఆవిష్కరించే ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న చిత్రం 'రేవు' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఆగస్టు రెండో వారంలో విడుదల కోసం సిద్ధమైంది. ఈ సినిమా ఆడియో వేడుక బుధవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగింది. ఐదుగురు ప్రముఖ గీతరచయితలు చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, సుద్దాల అశోక్‌తేజ, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలో పాల్గొనడం ఒక విశేషమైతే, చాలా ఏళ్ల తర్వాత క్యాసెట్ రూపంలో ఈ ఆడియోను విడుదల చేయడం మరో విశేషం. గీత రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ 'నవ్యత, నాణ్యత ఈ చిత్రంలో కనిపించాయి. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. 'కంటెంట్ ఉన్న వైవిధ్యమైన సినిమాలు రావాలంటే పర భాషల వైపు చూస్తుంటాం. కానీ 'రేవు' సినిమా పాటలు విన్నాక కొత్తతరం ప్రతిభావంతులపై నమ్మకం ఏర్పడుతోంది' అన్నారు రామజోగయ్య శాస్త్రి. తనలాగానే గీత రచయిత ఇమ్రాన్ శాస్త్రి మొదటి సినిమాకే సింగిల్ కార్డ్ పొందారని అనంత శ్రీరామ్ అభినందించారు. అక్షరాలన్నీ కలసినట్టుగా ఈ వేదిక ఉందని సుద్దాల అశోక్‌తేజ అభినందించారు. 'రేవు' చిత్ర నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు మాట్లాడుతూ 'ఒక చిన్న సినిమాను సపోర్ట్ చేయడానికి ఇంతమంది గీత రచయితలు రావడం ఆనందంగా ఉంది. దర్శకుడు హరనాథ్ మత్స్యకారుల జీవన పోరాటాన్ని అద్భుతంగా తెరకు ఎక్కించారు' అని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాతలు, మిత్రులు మురళీ గింజుపల్లి,నవీన్ పారుపల్లి నా మీద ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాలా 'రేవు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళతాం' అని చెప్పారు.

ఆగస్టులో డిమోంటీ కాలనీ 2



అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డిమోంటి కాలనీ 2'. బ్లాక్‌బస్టర్ హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ' చిత్రానికి ఇది సీక్వెల్. రాజ్‌వర్మ ఎంటర్‌టైన్‌మెంట్, శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తోంది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: శామ్ సీఎస్, సినిమాటోగ్రఫీ: హరీశ్ కన్నన్

చిరంజీవి పుట్టిన రోజున



బండి సరోజ్‌కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, మోహన్ సేనాపతి కీలకపాత్రలు పోషించారు. ఆగస్టు 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేసింది. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 22న 'పరాక్రమం' చిత్రాన్ని విడుదల చేస్తున్నామని సరోజ్‌కుమార్ చెప్పారు.



దర్శకుడు మారుతి సమర్పణలో భారీ మ్యూజికల్ ఈవెంట్ 'జామ్‌జంక్షన్' సెప్టెంబర్ 6న హైటెక్స్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్, నిర్మాత ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.

అనాథల కథ



సంజయ్ శ్రీరాజ్, ప్రియ శ్రీనివాస్, భరత్ మహాన్, రితిక ప్రధాన పాత్రలు పోషించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. అనాథల బాధ్యత సమాజం తీసుకోకపోతే చాలా దారుణాలు ఎదుర్కొవలసి వస్తుంది అనే ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని ధర్మ దర్శకత్వంలో డాక్టర్ అరవేటి యశోవర్ధన్ నిర్మించారు. ఎన్నో అవరోధాలను అధిగమించి, చిత్రాన్ని పూర్తి చేసి విడుదల చేస్తున్నామని నిర్మాత చెప్పారు.







దశ తిరిగేనా!

కోటి ఆశలతో.. కొంగొత్తగా భారత్

● నీరజ్‌పై భారీ అంచనాలు ● నిఖత్ పంచ్ అదిరేనా?
● గన్స్ గర్జిస్తే పతకాల పండుగే



మహా క్రీడాసంగ్రామం ఒలింపిక్స్‌లో భారత్ భారీ అంచనాలతో బరిలోకి దిగుతోంది. టోక్యో విశ్వక్రీడల తర్వాత మన ఆటగాళ్లు, అభిమానుల్లో కొండంత ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. గత క్రీడల్లో నీరజ్ చోప్రా జావెలిన్ త్రో పసిడి పతకాన్ని కొల్లగొట్టడం కొత్త జోష్ నింపింది. మనోళ్లలోనూ ప్రపంచ స్థాయి ప్రతిభ దాగుందన్న నమ్మకం కలిగించింది. ఇక, 40 ఏళ్ల తర్వాత భారత హాకీ జట్టు పతకం (కాంస్యం) నెగ్గడం యావద్దేశాన్ని మురిపించింది. టోక్యోలో 7 పతకాలు సాధించిన భారత్‌పై అంచనాలు అమాంతం పెరిగి పోయాయి. ఈ నేపథ్యంలో పారిస్‌లో పతకాల 'దశ' తిరుగుతుందని ఆశిద్దాం..

అంచనాలను అందుకొనేనా?



లండన్ ఒలింపిక్స్ నుంచి నిరాశపర్చకుండా పతకాలు అందిస్తున్న విభాగం బ్యాడ్మింటన్. 2012లో సైనా నెహ్వాల్ కాంస్యం తర్వాత.. రియో, టోక్యోల్లో పీవీ సింధు రజత, కంచు పతకాలను సాధించింది. అయితే, ఈసారి డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మెడల్ కొల్లగొడతారని లెక్కలు వేస్తున్నారు. రెండు ఒలింపిక్ మెడల్స్ సాధించిన సింధు ప్రస్తుతం అంతగా ఫామ్‌లో లేకపోయినా.. అత్యుత్తమ వేదికలపై అనూహ్య ప్రదర్శనలు చేయగల సత్తా ఆమెకు ఉంది. పురుషుల సింగిల్స్‌లో బరిలోకి దిగనున్న హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్‌ను అండర్ డాగ్స్‌గా అంచనా వేస్తున్నారు.

పక్కా అంటే పక్కా

పక్కాగా పతకం లభిస్తుందని చెప్పగలిగే విభాగం జావెలిన్ త్రో. గతంలో ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పతకం అంటే.. కలలో ఊహించని విషయం. అయితే, బల్లెం వీరుడు నీరజ్ చోప్రా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. 2020 ఒలింపిక్స్‌లో ఏకంగా స్వర్ణం అందించాడు. డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న చోప్రా మళ్లీ పతకం సాధిస్తాడనే అంచనాలు భారీగా పెరిగాయి. చోప్రాతోపాటు మెగా ఈవెంట్‌కు అర్హత సాధించిన కిశోర్ జనా కూడా పోడియం ఫినిష్ చేయగలడేమో చూడాలి.

రేపటి నుంచే
పారిస్ ఒలింపిక్స్

నిఖత్‌పైనే ఆశలు..


నిఖత్

బాక్సింగ్‌లో భారత పతక ఆశలన్నీ రెండుసార్లు వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ (50 కిలోలు), టోక్యో కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్ (75 కిలోలు) పైనే ఉన్నాయి. నిఖత్‌కు సులువైన డ్రా ఎదురవడంతో ఆమె పతక రౌండ్‌కు చేరుకొనే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తుండగా.. లవ్లీనా పోరాడాల్సిన పరిస్థితి.

గురి కుదిరితే..


మనూ భాకర్

భారీగా పతకాలు సాధిస్తుందనే అంచనాలున్న ఏకైక ఈవెంట్ షూటింగ్. అయితే, గత రెండు ఒలింపిక్స్‌లో మన గన్‌లు తుస్సుమన్నాయి. కానీ, ఈసారి 21 మందితో బరిలోకి దిగుతోంది. గత కొన్నేళ్లుగా ప్రపంచకప్ టోర్నీలలో రికార్డుల మోత మోగిస్తున్న మన షూటర్ల గురి కుదిరితే.. పతకాల పండుగే.! పిస్టల్ క్వీన్ మను భాకర్, రైఫిల్ 3 పొజిషన్‌లో వరల్డ్ రికార్డ్ సాధించిన షిఫ్ట్ కౌర్ పతకాలు తేగలరన్న అంచనాలు భారీగా ఉన్నాయి. హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ కూడా సంచలనాలు సృష్టించగలదు.

వినేష్, అమన్‌కు చాన్సు

2008 నుంచి వరుసగా పతకాలు అందిస్తున్న విభాగం రెజ్లింగ్. గత ఈవెంట్‌లో రవి దహియా రజతం, బజ్‌రంగ్ పూనియా కాంస్యం సాధించారు. అయితే, అంతర్గత విభేదాల కారణంగా రెజ్లింగ్ విభాగం కుదేలైంది. వినేష్ ఫొగట్ (50 కిలోలు), అంతిమ్ పంగల్ (53 కిలోలు), అమన్ సెహ్రావత్ (57 కిలోలు)పై పతక ఆశలున్నాయి.


వినేష్ ఫొగట్

బోపన్న లాస్ట్ షాట్



టెన్నిస్‌లో రోహన్ బోపన్న జోడీ పతకం సాధిస్తారనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. 44 ఏళ్ల బోపన్నకు జోడీగా శ్రీరామ్ బాలాజీ బరిలోకి దిగుతున్నాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్ కాంస్యం నెగ్గిన తర్వాత టెన్నిస్‌లో మళ్లీ పతకం గెలవలేదు. ఈసారి బోపన్న జోడీ పతకదాహం తీర్చుతుందని భావిస్తున్నారు. సింగిల్స్‌లో సుమిత్ నగాల్ బరిలో ఉన్నా...పతకం ఆశల్లేవు.

హాకీలో పోటీ తీవ్రం...



ఎట్టకేలకు హాకీలో పతక దాహం తీరింది. నాలుగు దశాబ్దాల తర్వాత గత క్రీడల్లో భారత జట్టు కంచు మోత మోగించింది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో స్వర్ణంతో పారిస్ బెర్త్ పట్టేసింది. అయితే, ఇటీవలి యూరోపియన్ టూర్‌లో పేలవ ప్రదర్శన కొంత ఆందోళన కలిగిస్తోంది. బెల్జియం, ఆస్ట్రేలియా లాంటి మేటి జట్లున్న పూల్-బిలో భారత్ ఆడనుంది. అయితే, మెరుగైన సాధన చేసిన భారత ఆటగాళ్లు ఈసారి ఫైనల్ చేరతామనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మీరాబాయి సింగిల్‌గా..

వెయిట్ లిఫ్టింగ్‌లో బరిలో ఉన్న ఏకైక అథ్లెట్ మీరాబాయి చాను. టోక్యోలో రజతం సాధించిన మీరా (49 కిలోలు) ఈసారి స్వర్ణం పట్టేయాలన్న పట్టుదలతో ఉంది. అయితే, గాయాలతో ఇబ్బందులు పడిన చానుకు ఈసారి గట్టిపోటీ ఎదురుకానుంది.





బరిలో ధీరజ్, దీపిక

▸▸ ఆర్చరీ అర్హత రౌండ్ నేడు

(స్పోర్ట్స్ 18, జియో సినిమాలో)

పారిస్ : విశ్వ క్రీడల్లో భారత్ క్రీడాకారులు బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. గురువారం జరిగే ఆర్చరీ వ్యక్తిగత పోటీల అర్హత రౌండ్లలో తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర, తరుణ్ దీప్ రాయ్, దీపికా కుమారి తదితరులు తలపడనున్నారు.

మహిళల వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్: మ. ఒంటి గంటకు (దీపికా కుమారి, అంకితా భకత్, భజన్ కౌర్); **పురుషుల వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్:** సా. 5.45 (ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్

ఆటలు మొదలయ్యాయ్!

పారిస్ : ఒలింపిక్స్ ప్రారంభానికి మరో రెండు రోజులుండగా..ఎప్పటి మాదిరే పోటీలు మాత్రం మొదలయ్యాయి. ఈమేరకు బుధవారం జరిగిన పురుషుల ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో స్పెయిన్-ఉజ్బెకిస్థాన్, అర్జెంటీనా-మొరాకో, న్యూజిలాండ్-గినీ, ఈజిప్ట్-డొమెనిక్ రిపబ్లిక్, ఇరాక్-ఉక్రెయిన్, జపాన్-పరాగ్వే జట్లు తలపడ్డాయి. అలాగే పురుషుల రగ్బీ సెవెన్స్‌లో ఆస్ట్రేలియా-సమోవా, అర్జెంటీనా-కెన్యా, ఫ్రాన్స్-అమెరికా, ఫిజీ-ఉరుగ్వే, ఐర్లాండ్-సౌతాఫ్రికా, న్యూజిలాండ్-జపాన్, ఆస్ట్రేలియా-కెన్యా, అర్జెంటీనా-సమోవా, ఫ్రాన్స్-ఉరుగ్వే ఢీకొన్నాయి.

ఐదుగురు ప్లేయర్లకు కొవిడ్ పాజిటివ్

పారిస్: ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆస్ట్రేలియా క్రీడాకారుల బృందంలో ఐదుగురికి కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. వాటర్ పోలో మహిళల జట్టు సభ్యులకు మాత్రమే కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని, మిగిలిన ఆసీస్ క్రీడాకారులకే ఏ ఇబ్బందీ లేదని ఆస్ట్రేలియా చెఫ్ డి మిషన్ అన్నా మీరెస్ వివరణ ఇచ్చింది. పాజిటివ్‌గా తేలిన ఆ ఐదుగురు ప్లేయర్లు కూడా ప్రస్తుతం బాగానే ఉన్నారని, పోటీల సమయానికి వారు సిద్ధంగా ఉంటారని ఆమె తెలిపింది. కొవిడ్ కూడా ఇతర శ్వాసకోశ సంబంధిత అనారోగ్యం లాంటిదేనని, ఆందోళన చెందాల్సిన పని లేదని, అయితే స్పోర్ట్స్ విలేజ్‌లో ప్రొటోకాల్ పాటించేందుకు పరీక్షలు చేసి అప్రమత్తం చేస్తున్నారని చెప్పింది. 'మొత్తం ఆస్ట్రేలియా బృందానికి పరీక్షలు జరపగా ఐదుగురికి మాత్రమే పాజిటివ్‌గా తేలింది' అని మీరెస్ తెలిపింది. కొవిడ్ మహమ్మారి కారణంగా టోక్యో ఒలింపిక్స్, బీజింగ్ వింటర్ ఒలింపిక్స్ కఠినమైన నిబంధనలతో ప్రత్యేక బబుల్‌లో నిర్వహించడం తెలిసిందే.

సాల్ట్‌లేక్‌లో 2034 వింటర్ ఒలింపిక్స్

పారిస్: అమెరికాలోని సాల్ట్‌లేక్ నగరం రెండోసారి శీతాకాల ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనుంది. 2002లో తొలిసారి ఇక్కడ విశ్వక్రీడలు జరిగాయి. మళ్లీ 32 ఏళ్ల తర్వాత..అంటే 2034లో సాల్ట్‌లేక్ నగరానికి ఆతిథ్య హక్కులు దక్కాయి. సాల్ట్ లేక్‌కు ఆతిథ్య హక్కులు కేటాయిస్తున్నట్టు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) బుధవారం వెల్లడించింది. వింటర్ ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు లభించడంతో సాల్ట్ లేక్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. ఇక, ఫ్రాన్స్‌లో ప్రభుత్వ మార్పు నేపథ్యంలో 2030 శీతాకాల ఒలింపిక్స్‌పై నెలకొన్న సందిగ్ధానికి కూడా ఐఓసీ తెరదించింది. తదుపరి వచ్చే ప్రధాని కూడా క్రీడల నిర్వహణకు కట్టుబడి ఉంటారని హామీ ఇవ్వడంతో ఆతిథ్య హక్కుల విషయంలో ఎలాంటి మార్పూ చేయడం లేదని ఐఓసీ తెలిపింది.

ఏంటీ డిజైన్లు?



న్యూఢిల్లీ: భారత బృందం ఒలింపిక్ దుస్తులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మన సంస్కృతి, కళా నైపుణ్యాలను ప్రదర్శించడానికి విశ్వక్రీడలు లాంటివి అత్యుత్తమ వేదికలు. అయితే, దుస్తులను డిజైన్ చేసిన తరుణ్ తహిల్యానీ, ఆదిత్య బిర్లా ఫ్యాషన్‌లు వాటిని ఏమాత్రం పట్టించుకోలేదని నెటిజన్లు మండిపడుతున్నారు. సింథటిక్ వస్త్రాలు, ప్రింట్‌లతో భారత బృందం దుస్తులను తయారు చేయడం ఎంతో నిరాశపర్చిందన్నారు. మరోవైపు ప్రారంభ వేడుకల కోసం రూపొందించిన డిజైన్లు.. మంగోలియా యూనిఫామ్‌ను పోలినట్టున్నాయని ఎక్స్‌లో విమర్శలు వ్యక్తమయ్యాయి. మరికొందరు స్వాతంత్ర్య దినం రోజు స్కూల్ వేడుకల్లో ధరించే విధంగా ఉన్నాయన్నారు.

ఒలింపిక్స్ కోసం రూ. 470 కోట్ల ఖర్చు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని, క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు కేంద్ర క్రీడా శాఖ 2021 నుంచి 2024 వరకు సుమారు రూ.470 కోట్లు వెచ్చించినట్టు అంచనా. క్రీడా బడ్జెట్‌లో కేటాయించిన టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)తో పాటు సీఎస్ఆర్ నిధులు కింద వచ్చిన కొంత మొత్తాన్ని కూడా క్రీడాకారులు కోసం ఖర్చు చేశారు. ఈ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో పోటీ పడుతున్నారు. బెంగుళూరులోని 'సాయ్' కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న పురుషుల హాకీ జట్టుపై రూ.41.81 కోట్లు, 'సాయ్' పటియాలలో సాధన చేస్తున్న జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపై రూ.5.72 కోట్లు, హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో ప్రాక్టీసు చేస్తున్న బ్యాడ్మింటన్ డబుల్స్ మాజీ వరల్డ్ నెంబర్ వన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ద్వయంపై రూ.5.62 కోట్లు కేంద్ర క్రీడాశాఖ వెచ్చించింది. వీరితో పాటు ఏస్ షట్లర్ పీవీ సింధు (ప్రకాశ్ పదుకొనె అకాడమీ, బెంగుళూరు)పై రూ.3.13 కోట్లు, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయ్ చాను (సాయ్ పటియాల)పై రూ. 2.74 కోట్లు, షూటర్ అనీష్ భన్వాలా (సాయ్ ఢిల్లీ)పై రూ.2.41 కోట్లు, షూటర్ మనుభాకర్ (సాయ్ ఢిల్లీ)పై రూ.1.68 కోట్లు, టెన్నిస్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్నపై రూ.1.56 కోట్లు, ప్యాడ్లర్ మనికా బాత్రాపై రూ.1.30 కోట్లు, ఆర్చర్ ధీరజ్‌పై రూ.1.07 కోట్లు, బాక్సర్లు నిఖత్ జరీన్‌పై రూ.91.71 లక్షలు, అమిత్ పంఘల్‌పై రూ.65.90 లక్షలు, రెజ్లర్లు వినేష్ ఫొగట్‌పై రూ.70.45 లక్షలు, అంతిమ్ పంఘల్‌పై రూ.66.55 లక్షలు, గోల్ఫర్ అదితి అశోక్‌పై రూ.63.21 లక్షలు కేంద్రం ఖర్చు చేసింది. ఇంకా హాకీ తదితర టీమ్ గేమ్‌లకు కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది.

ఐదేళ్లకోసారి వేలం?

ఐపీఎల్‌కు ఫ్రాంచైజీల సూచన

న్యూఢిల్లీ: ఐపీఎల్ మెగా వేలాన్ని ఇకపై ఐదేళ్లకొకసారి నిర్వహించాలని ఫ్రాంచైజీలు డిమాండ్ చేస్తున్నాయి. 2025 వేలానికి ముందు జరిపిన అభిప్రాయ సేకరణలో ఫ్రాంచైజీలు అనేక సూచనలను ఐపీఎల్ అధికారుల ముందుంచాయి. వీటిపై వచ్చే వారం జరిగే సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. మూడేళ్లకు బదులు ఐదేళ్లకోసారి వేలం నిర్వహించడం వల్ల బలమైన టీమ్‌ను తయారు చేసుకొనేందుకు అవకాశం ఉంటుందని ఫ్రాంచైజీలు భావిస్తున్నట్టు ఓ అధికారి తెలిపాడు. అంతేకాకుండా వేలం పీరియడ్ మధ్యలో జీతాల విషయంలో ఆటగాళ్లతో ఫ్రాంచైజీలే నేరుగా బేరసారాలు చేసేలా అవకాశం కల్పించాలని కోరుతున్నాయి. కాగా, జట్టు కెప్టెన్‌ను మాత్రమే అట్టిపెట్టుకొని మిగతా ఆటగాళ్లను వేలంలో రిటైన్ చేసుకొనేలా నిబంధనలను సవరించాలని ఓ ఫ్రాంచైజీ సీఈవో కోరాడు. ఎనిమిది మంది ఆటగాళ్లను రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం)గా తీసుకొనే అవకాశం కల్పించాలని కూడా కొన్ని ఫ్రాంచైజీలు ప్రతిపాదించాయి.

క్రీడలకు బడ్జెట్ పెంచండి


● సీఎం రేవంత్‌కు జితేందర్ రెడ్డి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: వచ్చే తెలంగాణ బడ్జెట్‌లో క్రీడలకు కేటాయింపులు భారీగా పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రభుత్వ సలహాదారు (క్రీడలు), మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి కోరారు. ఢిల్లీలో ఈమేరకు వీరిద్దరికి వినతిపత్రం అందించారు. గతంతో పోలిస్తే కనీసం మూడింతలైనా క్రీడలకు కేటాయింపులు పెంచాలని జితేందర్ విజ్ఞప్తి చేశారు.

ఈ చాన్స్ మళ్లీ రాదు

శ్రీలంక కోచ్ జయసూర్య



పల్లెకెలె : టీ20ల నుంచి స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ జడేజా రిటైరయ్యారని..ఈ నేపథ్యంలో భారత్‌పై పొట్టి సిరీస్ గెలిచేందుకు ఇంతకు మించిన అవకాశం దక్కదని శ్రీలంక తాత్కాలిక కోచ్ సనత్ జయసూర్య జట్టు సభ్యులకు ఉద్బోధిస్తున్నాడు. ఈక్రమంలో ఐపీఎల్ జట్టు రాజస్థాన్ రాయల్స్ హై పెర్ఫామెన్స్ డైరెక్టర్ జుబిన్ భరూచాతో బ్యాటర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నాడు. టీమిండియాతో మూడు టీ20ల సిరీస్‌లో శ్రీలంక తలపడనున్న సంగతి తెలిసిందే. తొలి మ్యాచ్ ఈనెల 27న ఇక్కడ జరగనుంది. భారత్‌తో తలపడే శ్రీలంక జట్టులోని పలువురు ఆటగాళ్లు లంక ప్రీమియర్ లీగ్‌లో ఆడారు. అయినా వారు జుబిన్‌తో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో పాల్గొంటున్నారని జయసూర్య తెలిపాడు. టీ20లలో తమ జట్టు పరిస్థితి ఆశాజనకంగా ఏమీ లేదని జయసూర్య అంగీకరించాడు. కొత్త కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత్ బరిలో దిగుతోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తమ జట్టుకు సూచించాడు. 'రోహిత్, విరాట్ ప్రపంచ అత్యుత్తమ క్రికెటర్లు. వారిద్దరితోపాటు జడేజాతో కూడిన టీమిండియా ఏ స్థాయిలో ఆడిందో గమనించాలి' అని జట్టుకు గుర్తు చేశాడు. 'వారి లేకపోవడం టీమిండియాకు లోటు. ఈ అవకాశాన్ని మావాళ్లు సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలి' అని జయసూర్య అన్నాడు. అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచ కప్‌లో శ్రీలంక జట్టు ఘోరంగా ఆడింది. లీగ్ దశతోనే టోర్నీ నుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. దాంతో కెప్టెన్ హసరంగ, హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్ ఉడ్, హై పెర్ఫామెన్స్ కన్సల్టెంట్ మహేల జయవర్దనే తమ పదవులకు రాజీనామా చేశారు. చరిత అసలంక సారథ్యంలో ఆ జట్టు బరిలో దిగుతోంది.

అనారోగ్యంతో చమీర అవుట్

మరో రెండు రోజుల్లో భారత్‌తో టీ20 సిరీస్ ఆరంభం కానుండగా శ్రీలంక జట్టుకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ దుష్మంత చమీర శ్వాసకోశ వ్యాధి నుంచి కోలుకోకపోవడంతో టీ20లతోపాటు తర్వాత జరిగే మూడు వన్డే సిరీస్‌కూ దూరమైనట్టు శ్రీలంక క్రికెట్ బుధవారం ప్రకటించింది. అతడి స్థానంలో మరో పేసర్ అసిత ఫెర్నాండోకు స్థానం కల్పించినట్టు చీఫ్ సెలెక్టర్ ఉపుల్ తరంగ తెలిపాడు.

టీటీలో ఇచ్చేనా పోటీ?


మనికా బాత్రా

సియోల్ ఒలింపిక్స్‌లో టేబుల్ టెన్నిస్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టినప్పటి నుంచే భారత ఆటగాళ్లు క్రమం తప్పకుండా పాల్గొంటున్నారు. అయితే 2004 గేమ్స్ ముందు వరకు కూడా భారత పోరాటం తొలి రౌండ్‌కే పరిమితమైంది. ఇక మొదటిసారిగా టీమ్ ఈవెంట్స్‌లోనూ పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఆడబోతోంది. పురుషులు, మహిళల జట్లు రెండూ టాప్-16లో ఉండడంతో ఈ అవకాశం దక్కింది. ఆచంట శరత్ కమల్, మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్‌తో పాటు రిజర్వ్‌గా జ్ఞానశేఖర్.. మనికా బాత్రా, ఆకుల శ్రీజ, అర్చన కామత్‌తో పాటు రిజర్వ్‌గా ఐహిక ముఖర్జీ పాల్గొంటున్నారు. మొత్తంగా నాలుగు ఈవెంట్స్ (సింగిల్స్, టీమ్స్)లో టీటీ ప్లేయర్స్ పోటీపడబోతున్నారు.

పతక చాన్స్ ఉందా?: ఒలింపిక్స్‌లో భారత ప్యాడ్లర్స్ ప్రదర్శన ప్రతిసారీ నిరాశాజనకంగానే ఉంటోంది. ఐదోసారి ఒలింపిక్స్‌లో ఆడనున్న శరత్ కమల్ 2004 ఏథెన్స్‌లో రెండో రౌండ్‌కు వెళ్లిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు. అయితే టోక్యోలో కాస్త మెరుగైన ప్రదర్శనతో పురుషులు, మహిళల సింగిల్స్ నుంచి శరత్, మనికా బాత్రా మూడో రౌండ్‌కు వెళ్లగలిగారు. బాత్రా ఇటీవల ఎలీట్ డబ్ల్యూటీటీలో వరల్డ్ నెంబర్ 2 వాంగ్ మన్యును ఓడించి క్వార్టర్స్‌కు చేరిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచింది. అలాగే కెరీర్‌లోనే అతి పెద్ద ఈవెంట్ ఆడబోతున్న ఆకుల శ్రీజ ఏమేరకు రాణించగలదో వేచిచూడాల్సిందే.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)


శ్రీజ, శరత్

భారత్‌తో బంగ్లా ఢీ

పాక్‌తో లంక అమీతుమీ
ఆసియా కప్ సెమీస్


మలేసియాపై నెగ్గిన బంగ్లా అమ్మాయిలు

దంబుల్లా : మహిళల ఆసియా కప్ సెమీఫైనల్ స్థానాలు ఖరారయ్యాయి. శుక్రవారం జరిగే మొదటి సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తో బంగ్లాదేశ్ తలపడనుంది. అదేరోజు జరిగే మరో సెమీస్‌లో పాకిస్థాన్ జట్టుతో ఆతిథ్య శ్రీలంక అమీతుమీ తేల్చుకోనుంది. ఇక బుధవారం జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 114 పరుగులతో మలేసియాను చిత్తు చేసింది. తొలుత బంగ్లాదేశ్ 20 ఓవర్లలో రెండు వికెట్లకు 191 పరుగులు చేసింది. మహిళల టీ20లలో ఇది రెండో అత్యధిక స్కోరు కావడం విశేషం. ముర్షీద 80 పరుగులతో కెరీర్ బెస్ట్ స్కోరు నమోదు చేసింది. కెప్టెన్ నిగర్ సుల్తానా అజేయ హాఫ్ సెంచరీ (62) సాధించింది. అనంతరం మలేసియా 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 77 పరుగులే చేసి ఓడింది. మరో గ్రూప్ పోరులో శ్రీలంక 10 వికెట్లతో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. మొదట థాయ్‌లాండ్ 20 ఓవర్లలో 93/7 స్కోరు చేసింది. ఛేదనలో శ్రీలంక 11.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 94 రన్స్ చేసి నెగ్గింది.

షమి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు!



ముంబై: తనపై వస్తున్న నిరాధారమైన వార్తలు, ఆరోపణల్ని భరించలేక టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమి ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడని అతడి ఆప్త మిత్రుడు ఉమేశ్ కుమార్ వెల్లడించాడు. ఇటీవల అతడు ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ 2018లో షమి జీవితం ఊహించని ఆటుపోట్లకు గురైందని ఉమేశ్ చెప్పాడు. ఆ సమయంలో షమి తనతోనే ఉండేవాడని, ఒకరోజు రాత్రి 19వ అంతస్తులోని బాల్కనీ నుంచి కిందకి దూకి, ఆత్మహత్య చేసుకోవాలని షమి భావించినట్టు తెలిపాడు. 'భార్య హసీన్ జహా గృహ హింస కేసు పెట్టడం, దానిపై మీడియాలో వచ్చిన కథనాలు షమిని తీవ్రంగా బాధించాయి. ఆతర్వాత పాకిస్థాన్‌తో మ్యాచ్‌ల్లో ఫిక్సింగ్ చేశాడన్న ఆరోపణలు రావడం అతడిని మానసిక క్షోభకు గురి చేశాయి. ఈ ఆరోపణలను భరించలేకపోతున్నానని అతడు చాలా బాధపడ్డాడు. ఒక రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఒక్కడే బాల్కనీలో నిలబడి ఉన్నాడు. నేను అదే సమయానికి నీళ్లు తాగేందుకు లేచి, ఆవైపు చూస్తే షమి అక్కడ నుంచి దూకేలా కనిపించాడు' అని ఉమేశ్ వివరించాడు. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజులకే అతడికి మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల విషయంలో క్లీన్ చిట్ రావడంతో తిరిగి గాడిన పడ్డాడని చెప్పుకొచ్చాడు.



'ఆర్టీసీ విలీనం'పై మంటలు

అధికార, విపక్షాల మధ్య వాడివేడి చర్చ.. విలీనం ఎప్పుడు? జాప్యానికి కారణమేమిటి?

- హరీశ్‌కు మాట్లాడే అవకాశమివ్వాలంటూ పోడియంలోకి బీఆర్ఎస్ సభ్యులు
- పరిశీలనలో 'విలీనం'..జాప్యం తలెత్తదు
- 50 రోజులు సమ్మె చేసినా మీకు పట్టలేదు
- ఆర్టీసీని నిర్వీర్యం చేసి.. ఆస్తులను పార్టీ సభ్యులకు కట్టబెట్టింది మీరు: పొన్నం
- మీరు చేసిన తప్పులే మమ్మల్నీ చేయమంటారా?: రేవంత్

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో 'ఆర్టీసీ ఉద్యోగులు-ప్రభుత్వంలో విలీనం' అంశాన్ని బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, కల్వకుంట్ల సంజయ్ లేవనెత్తారు. ఈ సందర్భంగా అధికార, విపక్షసభ్యుల మధ్య వాడివేడి చర్చ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలవుతోందని సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో ఎప్పుడు విలీనం చేస్తారు? జాప్యానికి కారణం ఏమిటి? అని అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా విలీనం ప్రస్తావన ఉందనీ గుర్తుచేశారు. అయితే ఆర్టీసీని బీఆర్ఎస్ సర్కారు నాశనం చేసిందని, సంస్థ కార్మికుల గురించి మాట్లాడే హక్కు ఆ పార్టీకి లేదని మంత్రి పొన్నం విమర్శించారు. మంత్రి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులంతా లేచి నిలబడి, నిరసన వ్యక్తం చేశారు. జోక్యం చేసుకున్న శాసనసభా వ్యవహారాల మంత్రి మంత్రి శ్రీధర్ బాబు.. ప్రశ్నోత్తరాల్లో నిరసన వ్యక్తం చేసే హక్కు సభ్యులకు ఉండదని, రూల్‌బుక్‌లోనూ ఎక్కడా లేదని పేర్కొన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఓ దశలో హరీశ్‌కు మాట్లాడేందుకు అవకాశమివ్వాలని కోరుతూ విపక్ష బీఆర్ఎస్ సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లారు. చర్చ సందర్భంగా ఆర్టీసీ విలీనంపై జాప్యానికి కారణం ఏమిటి అంటూ విపక్ష సభ్యులు ప్రశ్నించగా 'ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదు' అని పొన్నం బదులిచ్చారు. దీన్ని హరీశ్ తీవ్రంగా ఆక్షేపించారు. మంత్రి సమాధానం సభను తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. యూనియన్‌ల పునరుద్ధరణ ఎప్పట్లోగా చేస్తారని ప్రశ్నించారు. తమ హయాంలో చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యులకు శాశ్వత ఉద్యోగాలు ఇచ్చామని, అయితే ప్రస్తుతం గౌరవవేతనంతో మూడేళ్లపాటు పనిచేయించుకొని, సంతృప్తి చెందితేనే రెగ్యులరైజ్ చేసేలా నిబంధనలు రూపొందించారని ఆక్షేపించారు. గత ఫిబ్రవరి 10వ తేదీన నెక్లెస్‌రోడ్డులో ఆర్టీసీకి రూ.300 కోట్లు విడుదల చేస్తున్నట్లుగా చెక్కును చూపించారని, అది ఇప్పటిదాకా బస్‌భవన్‌కు చేరలేదని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం 'మహాలక్ష్మి' కింద ఆర్టీసీకి నెలనెలా నిధులు ఇవ్వడం లేదన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారం పెరిగిందన్నారు.





ఎన్నికల ముందు విలీనం బిల్లు తెచ్చి..: మంత్రి పొన్నం

పదేళ్లపాటు ఆర్టీసీని నిర్వీర్యం చేసి, అసలు ఆర్టీసీ ఉంటుందా? ఉండదా? అనే పరిస్థితిని కల్పించి, ఎన్నికలకు కొద్దిరోజుల ముందు యాజమాన్యం, కార్మికులతో కూడా చర్చించకుండా ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లును బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిందని మంత్రి పొన్నం మండిపడ్డారు. ఆ బిల్లును గవర్నర్ ఆమోదించడం లేదని, రాజకీయ రంగు పులమడానికి కార్మికులను రెచ్చగొట్టి, రాజ్‌భవన్ ముందు ధర్నాలు చేయించారని ఆక్షేపించారు. ఆర్టీసీ ఆస్తులను తమ పార్టీ ప్రతినిధులకు కట్టబెట్టారని, యూనియన్లను రద్దుచేసి, వాటి పునరుద్ధరణ గురించి, మాట్లాడే హక్కు మీకుందా? అని బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో 50 రోజుల పాటు కార్మికులు సమ్మె చేసినా పట్టించుకోలేదని, ఈ రోజు ఆర్టీసీ లాభాలతో నడుస్తోందని పకటించారు. గత పదేళ్లలో ఆర్టీసీ కార్మికులకు చెందిన పీఎఫ్, సీసీఎస్ సొమ్ము రూ.4 వేల కోట్ల నిధులను వాడుకున్నారని మండిపడ్డారు. ఇప్పటి దాకా రూ.2 వేల కోట్లను ఆర్టీసీకి ఇచ్చామని, మహాలక్ష్మితో పనిభారం పెరిగినా కార్మికులకు ఓటీ చెల్లించాలని ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రోజుకు సగటున 45లక్షల మంది ప్రయాణాలు చేసేవారని, ప్రస్తుతం 56 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.

మీరు చేసిన తప్పులే మమ్మల్ని చేయమంటారా? రేవంత్

ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అంశంపై సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గత సర్కారు ఆర్టీసీలో కార్మిక సంఘాలను రద్దు చేసి, కార్మికులు మాట్లాడటానికి వీల్లేకుండా చేసిందని మండిపడ్డారు. అయితే కూనంనేనికి మాట్లాడటానికి అవకాశం ఇవ్వడంపై హరీశ్ అభ్యంతరం వ్యక్తం చేయగా... సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఆర్టీసీపై ప్రభుత్వం వివరంగా సమాధానం చెప్పినా సంతృప్తి చెందకుండా పదేళ్లు తాము చేసిన తప్పులే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేయాలని బీఆర్ఎస్ కోరుకుంటోందని మండిపడ్డారు. కార్మికులను ఆదుకునేందుకు, సంస్థను బతికించుకునేందుకు తాము ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. అప్పట్లో ఆర్టీసీ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఉన్న హరీశ్‌ను ఎట్లా తొలగించాలో అర్థం కాక ఆర్టీసీలో కార్మిక సంఘాలను నాటి ముఖ్యమంత్రి రద్దుచేశారని, దీనికి ఆ కుటుంబంలో నెలకొన్న అంతర్గత సమస్యలే కారణం అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయంలో 50 రోజుల పాటు ఆర్టీసీ కార్మికులు సమ్మె చేశారని, 50 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. కాగా గోదావరిలో వరదలపై పాల్వాయి హరీశ్ ఇచ్చిన, నిరుద్యోగులకు న్యాయం చేయాలని, మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరుతూ కేటీఆర్ ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తోసిపుచ్చారు. దాంతో బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని, సభలో నిరసన వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యేలకు సభ సంతాపం

వరంగల్ జిల్లా చెన్నూరు మాజీ శాసనసభ్యుడు డాక్టర్ నెమరు గొమ్ముల సుధాకర్‌రావు, నాంపల్లి మాజీ ఎమ్మెల్యే మహ్మద్ విరాసత్ రసూల్‌ఖాన్, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే ధర్మపురి శ్రీనివాస్, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రమేష్‌రాథోడ్ మృతికి సభ సంతాపం ప్రకటించింది. తర్వాత సభ్యులంతా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా స్పీకర్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు సభ్యులు కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


అసెంబ్లీలో వాకౌట్ చేసి బయటకు వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పట్టించుకోరా?

- సమాధానం చెప్పలేక సర్కార్ పారిపోయింది: హరీశ్ రావు

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సమాధానం చెప్పలేక కాంగ్రెస్ ప్రభుత్వం సభను వాయిదా వేసి పారిపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్ రావు అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆర్టీసీ యూనియన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. కాగా, గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు అన్యాయం జరుగుతుందని హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం 1:100 పద్ధతిలో నియామకాలు చేసిందని, ఇప్పుడు కూడా అదే విధానంలో నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు వినతిపత్రం ఇచ్చేందుకు అసెంబ్లీలోని ఆయన చాంబర్‌కు వచ్చిన హరీశ్ రావు.. మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల సంఖ్య పెంచాలని తాము కోరుతున్నట్లు తెలిపారు. సభలో ప్రశ్నించడం సభ్యుల హక్కు అని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పక్కనే ఉన్నారుగా.. మంత్రికి చెవిలో చెప్పు

- జీవన్‌రెడ్డికి శాసన మండలి ఛైర్మన్ సరదా సూచన

హైదరాబాద్, జూలై 24(ఆంధ్రప్రదేశ్): శాసనమండలిలో అధికార పార్టీ సభ్యుడు జీవన్ రెడ్డికి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన ఓ సరదా సూచన మండలిలో నవ్వులు పూయించింది. బుధవారం ప్రశ్నోత్తరాల అనంతరం ప్రత్యేక ప్రస్తావన చేపట్టిన సమయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి పక్కపక్కనే కూర్చున్నారు. ఆ సమయంలో వీఆర్ఏల వ్యవస్థ రద్దయినందున కారుణ్యనియామకాలకు ఆస్కారం లేదని మరణించిన వీఆర్ఏల కుటుంబసభ్యుల అభ్యర్థనను ప్రభుత్వం తిరస్కరించిన అంశంపై జీవన్‌రెడ్డి సుదీర్ఘంగా మాట్లాడారు. ఆయన ఇంకా మాటలు కొనసాగిస్తుండడంతో "పక్కనే ఉన్న మంత్రికి చెవిలో చెప్పు" అంటూ జీవన్ రెడ్డికి గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. దాంతో మండలిలో సభ్యులు సరదాగా నవ్వుకున్నారు.

మంత్రి పదవి కోసం పైరవీ చేయట్లేదు

- ఒకవేళ చేస్తే నేనే ముఖ్యమంత్రి:రాజగోపాల్‌రెడ్డి



మంత్రి పదవి కోసం తాను పైరవీ చేయడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. పైరవీ చేస్తే తానే సీఎం కావొచ్చని వ్యాఖ్యానించారు అసెంబ్లీ లాబీలో రాజగోపాల్‌రెడ్డి.. బీఆర్ఎస్ నేతలు మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో సంభాషించారు. గేమ్ ఇప్పుడు స్టార్టయ్యిందని, ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి పేరు జైలుకు వెళ్లేవారి జాబితాలో తొలిస్థానంలో ఉందని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. 'గతంలో కేసీఆర్ రూ.20-30 కోట్లు ఎక్కువ రేటు ఇచ్చి ఎమ్మెల్యేలను కొన్నరు.. మేం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రూ.5-10 కోట్లకు మాత్రమే అడుగుతున్నం.. అందుకే మా దగ్గరకు 26 మంది ఎమ్మెల్యేలు ఇంకా రాలేదు. ప్రశాంత్‌రెడ్డి వంటి నేతలను మేం కొనుగోలు చేయలేం' అని ఆయన అన్నారు.

అల్లరి చిల్లరగా సభ: కూనంనేని



అసెంబ్లీ జరుగుతున్న తీరు చూస్తే.. సభలో ఘర్షణ వాతావరణం నెలకొన్నట్లుగా ఉందని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై చర్చ జరుగుతున్నట్లుగా లేదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను గతంలో ఎప్పుడూ ఇంత అల్లరి చిల్లరగా సభను చూడలేదని, గౌరవ మర్యాదలు లేకుండా సభ పక్కదారి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో దక్షిణ భారతదేశం పట్ల వివక్ష స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ సహా అందరం ఢిల్లీలో ధర్నా చేద్దామన్నారు.

త్వరలో ఉద్యోగులకు బకాయి డీఏల చెల్లింపు

- మండలిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ

త్వరలో ఉద్యోగులకు బకాయి డీఏలను చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. శాసనమండలిలో అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రభాకర్, వాణీదేవి, రఘోత్తమరెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ గృహజ్యోతి కింద 200 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని మరో ప్రశ్నకు సమాధానంగా స్పష్టంచేశారు. రైతు భరోసా అంశంపై అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమాధానం చెబుతూ అర్హులైన రైతులకు, కౌలుదారులకు రైతు భరోసా అందిస్తామన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. గృహలక్ష్మి పథకంపై అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెబుతూ నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు వివరించారు.

సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిది:శంకర్

- కేంద్ర బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకూ న్యాయం: రాకేశ్ రెడ్డి
- కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేక తీర్మానం బాధాకం: హరీశ్‌బాబు

'కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకుంది. సొమ్ములు కేంద్రానివి.. సోకులు మాత్రం రాష్ట్ర ప్రభుత్వానివి' అంటూ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ మీడియా పాయింట్లో వ్యాఖ్యానించారు. రాష్ట్ర మంత్రులు బీజేపీ ప్రభుత్వాన్ని బదనాం చేసే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయడం చేతకాగాక, ఆ వైఫల్యం నుంచి తప్పించుకోడానికి కేంద్ర బడ్జెట్‌పై తీర్మానం పెట్టా విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో ఏవో కొన్ని ప్రాంతాలకు నిధులు కేటాయించరని, అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ ఉంటుందన్నారు. కేంద్ర బడ్జెట్ అంటే రాష్ట్రంలోని అధికార పార్టీ నేతల నియోజకవర్గాలైన కొడంగల్, మధిరకు నిధులు కేటాయించడమా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే హరీశ్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం పెట్టడం బాధాకరం అని అన్నారు.



నేడే అసెంబ్లీలో బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

మొండి చెయ్యి చూపడంతో రాష్ట్ర రాబడులపైనే ఆధారపడి బడ్జెట్‌ను ఖరారు చేసినట్లు సమాచారం.ఈ ఏడాది ఫిబ్రవరిలో సర్కారు రూ.2,75,891 కోట్లతో 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టి.. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల వ్యయాల కోసం రూ.78,911 కోట్లకు శాసన సభ ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. ఆగస్టు నుంచి చేసే వ్యయాలకు శాసనసభ అనుమతి పొందాల్సి ఉన్నందున ఈ నెల 31లోపు బడ్జెట్‌ను ఆమోదించుకునే దిశగా రేవంత్ సర్కారు అసెంబ్లీ సమావేశాలను నిర్వహిస్తోంది.

వ్యవ'సాయానికి' ఎక్కువ..

ఈ బడ్జెట్‌లో ఒక్క వ్యవసాయ రంగానికే దాదాపు రూ.50 వేల కోట్లకు పైగా కేటాయించినట్టు సమాచారం. అందులో రైతు రుణ మాఫీ పథకానికి రూ.31 వేల కోట్లు, రైతు భరోసాకు మరో రూ.15 వేల కోట్లు, రైతు బీమాకు రూ.7 వేల కోట్ల వరకు కేటాయించవచ్చని తెలుస్తోంది. ఆ తర్వాత విద్యుత్తు, సాగునీటి పారుదల శాఖలకు నిధులను ఎక్కువగా కేటాయించినట్టు సమాచారం. విద్యుత్తు సంస్థల బకాయిల చెల్లింపు, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు వంటి వాటికి నిధుల కేటాయింపు దృష్ట్యా.. విద్యుత్తు శాఖకు భారీగానే కేటాయింపులు జరిపినట్లు తెలిసింది. ఇక.. రాష్ట్రంలో పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, దేవాదుల ఎత్తిపోతల పథకాలు కొనసాగుతున్న నేపథ్యంలో సాగునీటి రంగానికీ ప్రాధాన్యమిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీలకు కూడా భారీగానే నిధులను కేటాయించినట్లు తెలిసింది.

సొంత రాబడి పైనే..

రాష్ట్ర రాబడుల్లో జీఎస్టీ, విలువ ఆధారిత పన్ను, స్టాంపులు-రిజిస్ట్రేషన్లపైనే ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది. వీటి ద్వారా వచ్చే రాబడులే రాష్ట్రాన్ని గట్టెక్కిస్తాయని నమ్ముతోంది. బడ్జెటేతర అప్పులకు కేంద్రం మోకాలడ్డుతుండడంతో ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి లోబడి బడ్జెట్ అప్పులను తీసుకోవాల్సి వస్తోంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.68,585 కోట్ల అప్పులు తీసుకుంటామని సర్కారు ప్రతిపాదించిందిన సంగతి విదితమే. పూర్తి స్థాయి బడ్జెట్‌లో కూడా అప్పులు అంతే ఉండనున్నాయి. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం 41 వేల కోట్లను ప్రతిపాదించింది. కానీ.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.21 వేల కోట్లనే ప్రతిపాదించింది. పూర్తి స్థాయి బడ్జెట్‌లోనూ అంతే మొత్తాన్ని ప్రతిపాదించవచ్చని తెలిసింది.



బడ్జెట్‌లో అన్యాయం జరిగిందనుకుంటే

కాంగ్రెస్ ఎంపీలు రాజీనామా చేయాలి

- బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం మాదిరిగా.. కాంగ్రెస్ సర్కారుకు ఏటీఎంగా మూసీ
- ఏపీకి15 వేల కోట్లు ఇస్తే అసూయా?
- ఏపీకి హోదా ఇవ్వకపోవడం ద్వారా రాష్ట్రానికి ప్రధాని మోదీ మేలు చేశారు
- అందుకు మోదీకి క్షీరాభిషేకం చేయాలి: బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ఏటీఎంలా వాడుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకునే ప్రయత్నం చేస్తోందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పెద్దలకు దగ్గరగా ఉండే గుత్తేదారులకు పనులు అప్పగించటానికే విషపూరిత ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై నిర్వహించిన చర్చలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఏపీకి రూ.15 వేల కోట్లు ఇచ్చినందుకు ఎందుకు అసూయ పడుతున్నారని, పెడితే పెళ్లి కోరతారు.. లేకపోతే చావు కోరతారా? కొడంగల్‌కు రూ. 4 వేల కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి తీసుకెళ్తే.. ఇతర జిల్లాల వాళ్లు అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేస్తే పెడతారా? అని ప్రశ్నించారు. మోదీ సర్కారును లక్ష్యంగా చేసుకుంటే.. సీఎం రేవంత్‌రెడ్డికి తన కుర్చీ పదిలంగా ఉంటుందనే వ్యూహం తప్ప వేరేదిలేదని అన్నారు. గడిచిన పదేళ్లలో ఈ రాష్ట్రానికి రూ. 9.28 లక్షల కోట్లు కేంద్రం నుంచి వచ్చాయని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్రానికి మోదీ మేలుచేశారని, ఒకవేళ ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చివుంటే.. పెట్టుబడులు, పరిశ్రమలు అన్నీ ఆ రాష్ట్రానికే వెళ్లేవని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వనందుకు మోదీకి క్షీరాభిషేకం చేయాలని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని భావిస్తే కాంగ్రెస్ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన మంత్రి పొంగులేటి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎంపీలను రాజీనామా చేయాలని కోరటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు సహా బీజేపీ ఎంపీలు రాజీనామాలు చేస్తే కేంద్రం దిగొచ్చి రాష్ట్రానికి నిధులు కేటాయిస్తుందని అన్నారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... అమృత్ స్కీమ్‌లో రాష్ట్రానికి రూ. 3,500 కోట్లు మంజూరైతే... టెండర్లు పిలవకుండా కాంట్రాక్టర్లకు పంచిపెట్టారని పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనవసరమైన విమర్శలు చేశారని, వారిద్దరూ ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే ధర్మాన్ని నమ్ముకున్న భరతమాత ముద్దుబిడ్డలని మహేశ్వర్ రెడ్డి కొనియాడారు.

బీజేపీతో కలిసింది బీఆర్ఎస్సే

- వారికి రాష్ట్రం కంటే రాజకీయాలే ముఖ్యం
- కేంద్ర ప్రభుత్వ వివక్షపై తీర్మానం చేద్దామంటే భయపడుతున్నారు: భట్టి
- పోరాటానికి బీజేపీ కలిసి రావాలి:దుద్దిళ్ల
- రాష్ట్ర బీజేపీ నేతలకు డీఎన్ఏ టెస్టు!
- వారిలో తెలంగాణ పౌరుషముందా?: పొన్నం

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ ప్రయోజనాల కోసమే పుట్టామని చెప్పుకొనే బీఆర్ఎస్ కేంద్రం వివక్షపై గట్టిగా మాట్లాడుతుందని ఆశించాం. కానీ, వారికి రాష్ట్ర ప్రయోజనాల కంటే, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని తేలింది. బీజేపీతో కలిసింది బీఆర్ఎస్సే" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం శాసనసభలో పెట్టిన చర్చకు ప్రతిపక్షాల నుంచి ఆశించిన మేరకు మద్దతు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కారు, కమలం పార్టీలకు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భట్టి విమర్శించారు. వెనకబడ్డ తెలంగాణ అభివృద్ధి కోసమే నాటి యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ విభజన చట్టాన్ని తీసుకొచ్చారని భట్టి గుర్తుచేశారు. ఆ చట్టం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. చర్చ జరిగే అంశాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సభా నాయకుడికి అనుభవం లేదంటూ అవహేళన చేయడం కేటీఆర్‌కు సరికాదని హితవు పలికారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బీఆర్ఎస్ ప్రభుత్వంతో కలిసి రావాలని సూచించారు. తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధులపై కేంద్రాన్ని ప్రశ్నించేందుకు అన్ని పక్షాలు ప్రభుత్వంతో కలిసి వచ్చి తీర్మానాన్ని ఏకీభవించాలని విజ్ఞప్తి చేశారు.





బీజేపీ ఎల్పీ నేతకు హరీశ్ చిట్టీలందిస్తున్నారు

పదేళ్లపాటు అధికారంలో ఉండి బీజేపీతో అంటకాగింది బీఆర్ఎస్సేనని భట్టి విమర్శించారు. బీజేపీ ఎల్పీ నేత మహేశ్వరరెడ్డి మాట్లాడుతుంటే బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చిట్టీలు అందించారన్నారు. అలాంటి నేతలు తాము బీజేపీతో కలిశామని చెప్పడం హాస్యాస్పదమని చెప్పారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలన్న దానికే తాము కట్టుబడి ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఆంధ్రాలో విలీనం చేస్తే పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు ఇవ్వనందుకు సీఎం, మంత్రులందరూ సచ్చేదాకా ఆమరణ దీక్ష చేయాలన్న కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష ప్రదర్శించిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. దేశంలో తెలంగాణ భాగం కాదా? రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాలను కేటాయించరా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటా కోసం జరిగే పోరాటానికి బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి రావాలని కోరారు. బడ్జెట్ కేటాయింపుల్లో మోదీ సర్కారు రాష్ట్రం పట్ల అత్యంత వివక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పదాన్ని ఒక్కసారి కూడా ఉచ్చరించలేదన్నారు.

తెలంగాణ పౌరుషముందా?: పొన్నం

రాష్ట్ర బీజేపీ నేతల్లో తెలంగాణ పౌరుషం ఉందో లేదో డీఎన్ఏ టెస్టు చేయించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీజేపీ నేతలు బానిసల్లా బతుకుతున్నారని, రాష్ట్రానికి అన్యాయం జరిగితే మాట్లాడడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి ఒక్క రూపాయి తీసుకురాలేని ఇద్దరు కేంద్ర మంత్రులు తెలంగాణలో ఎలా అడుగుపెడతారని ఆయన ప్రశ్నించారు. ఉద్వేగంతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీజేపీ ఎల్పీ నేత మహేశ్వరరెడ్డి తన సీటు నుంచి వచ్చి మంచినీళ్ల బాటిల్ అందించారు. దాంతో తమకు మంచినీళ్లు కాదని, కేంద్రం నుంచి నిధులు తెప్పించాలని పొన్నం చమత్కరించారు.

సభ నుంచి బీజేపీ సభ్యుల వాకౌట్

కేంద్ర నిధులను తీసుకొని కూడా ఏం రాలేదని పదేపదే కాంగ్రెస్ చెప్పడం సరికాదని బీజేపీ ఎల్పీ నేత మహేశ్వరరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సభ నుంచి బీజేపీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. మంత్రి పొన్నం మాట్లాడుతున్న సమయంలో బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ పలుమార్లు వెల్‌లోకి వెళ్లారు. స్పందించిన స్పీకర్.. ఇదేమీ మండల, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కాదని, కొత్త ఎమ్మెల్యేలు జాగ్రత్తగా నడుచుకోవాలని హెచ్చరించారు.

కేటీఆర్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

స్టేట్‌హోం విద్యార్థినులకు సొంత నిధులతో ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేసిన కేటీఆర్


కేటీఆర్‌కు స్వీట్ తినిపిస్తున్న కేసీఆర్ దంపతులు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు లేఖ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో ఉంటూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడేలా భగవంతుడు కేటీఆర్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం ఆకాంక్షించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. అలాగే, హైదరాబాద్, నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన వేడుకల్లో కేటీఆర్... తన తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా తండ్రి కేసీఆర్‌కు మిఠాయి తినిపించిన అనంతరం కేటీఆర్ ఆయన్ను ఆలింగనం చేసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులు భారీ కేక్ కట్ చేయడంతోపాటు రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఇక, కేటీఆర్ తన జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా స్టేట్ హోంలోని 100 మంది విద్యార్థినులకు తన సొంత ఖర్చుతో సమకూర్చిన ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్న కేటీఆర్.. విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేశారు. అలాగే, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న 13 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు సాయం చేస్తానని ప్రకటించారు.

పీడీఎస్‌యూ 'చలో అసెంబ్లీ' ఉద్రిక్తం

- ఆందోళనకారులను అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు..

మంగళ్‌హాట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నేతలు చేపట్టిన 'చలో అసెంబ్లీ' ఉద్రిక్తంగా మారింది. బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, నీట్ నిర్వహణను రాష్ట్రానికే అప్పగిస్తూ తీర్మానం చేయాలనే డిమాండ్లతో పీడీఎస్‌యూ నేతలు బుధవారం అసెంబ్లీని ముట్టడించేందుకు యత్నించారు. అసెంబ్లీ లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వారిని అరెస్టు చేసి సమీప పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నేతలు మధు, నాగరాజు మాట్లాడుతూ.. అన్ని యూనివర్సిటీలకు వీసీలను నియమించడంతో పాటు ఉపకార వేతనాల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. విద్యాశాఖకు మంత్రిని నియమించడంతో పాటు సంక్షేమ హస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

- సమాఖ్య స్ఫూర్తిని విస్మరించిన మోదీ సర్కారు
- అసెంబ్లీలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- విభజన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భారత దేశం అన్ని రాష్ట్రాల సమాఖ్య అని, రాష్ట్రాల సమ్మిళిత అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని విస్మరించిందని, బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష చూపిందని తెలిపింది. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసింది. తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన నాటి నుంచి ఇదే ధోరణి కొనసాగుతోందని సభ పేర్కొంది. విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణల సుస్థిర అభివృద్ధి కోసం కేంద్రం అన్ని చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపింది. కానీ, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందంది. ఆ హామీలు ఇప్పటికీ అమలుకాకపోవడం వల్ల తెలంగాణ ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొంది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పలు దఫాలుగా ప్రధాని మోదీ, ఇతర కేంద్ర మంత్రులను కలిసి పలు విజ్ఞప్తులు చేసినట్లు గుర్తుచేసింది. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం కోరడంతో పాటు విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులపై అనేక అభ్యర్థనలు చేసినా కేంద్రం పట్టించుకోలేదని తెలిపింది. బడ్జెట్‌లో తెలంగాణ పట్ల పూర్తి వివక్ష చూపిందని సభ తీర్మానం చేసింది. కేంద్రం అనుసరించిన తీరుపై శాసనసభ తీవ్ర అసంతృప్తిని, నిరసనను తెలియజేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే కేంద్ర బడ్జెట్‌కు సవరణలు చేసి తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ చేసిన తీర్మానాన్ని శాసనసభ ఆమోదించింది.

రేవంత్ X కేటీఆర్!

అయ్యపేరు, తాతపేరు చెప్పుకొని రాలేదు.. స్వయంకృషితో ఎదిగా.. సీఎం కుర్చీలో కూర్చున్నా

- నిధులు వద్దని, మీ ప్రేమ ఉంటే చాలునని... ప్రధాని మోదీకి కేసీఆర్ ఊడిగం చేయలేదా?
- కేసీఆర్ కూడా వస్తే.. ఢిల్లీలో దీక్షకు నేను సిద్ధం
- నిధులు తెచ్చుడో.. అవసరమైతే చచ్చుడో
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- ఢిల్లీలో మంత్రివర్గం దీక్ష చేస్తే మద్దతు: కేటీఆర్



"నేను గతంలో మంత్రిగా పనిచేయలేదని, నాకు సభా వ్యవహారాలు తెలియవని కేటీఆర్ అంటున్నారు. మా నాయన ఉచితంగా కుర్చీలు ఇచ్చి.. చదువు రాకపోయినా మంత్రిని చేయలేదు. కష్టపడి జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిచి.. స్వయంకృషితో పైకొచ్చి ఈరోజు ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నా. అయ్యపేరు, తాతపేరు చెప్పుకొని నేను ఇక్కడికి రాలేదు" - సీఎం రేవంత్‌రెడ్డి

"రేవంత్‌రెడ్డి చిన్న వయసులో ముఖ్యమంత్రి అయిండు. సహనం, ఓపిక ఉండాలి. సంయమనం పాటించాలి. మాటిమాటికీ మాపై విరుచుకుపడితే ఎలా? పేమెంట్ కోటాలో సీఎం సీటు కొట్టేసిండని మేము కూడా అనొచ్చు. అయ్యల పేర్లు చెప్పి పదవులు అంటే... రాహుల్‌గాంధీని అంటుండా? రాజీవ్ గాంధీని అంటుండా? నాకైతే తెల్వదు" -బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్



హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందనే అంశంపై బుధవారం అసెంబ్లీలో నిర్వహించిన చర్చ సీఎం రేవంత్‌రెడ్డి వర్సెస్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నట్లుగా సాగింది. కేటీఆర్ మాట్లాడుతున్న సమయంలో రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవడం, అందుకు మళ్లీ కేటీఆర్ సమాధానమివ్వడం, ఇరువురూ పరస్పరం విమర్శలు వేసుకోవడంతో చర్చ వాడివేడిగా జరిగింది. కేటీఆర్ మాట్లాడుతూ, "సభలో తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు మాకు ముందస్తు సమాచారం ఇవ్వాలి కదా? గతంలో మేం పదేళ్ల ప్రభుత్వాన్ని నడిపినం. సభా మర్యాదలు పాటించాం" అని అన్నారు. దీనిపై సీఎం రేవంత్ జోక్యం చేసుకుంటూ, "ఈ కుటుంబమంతా సభను, రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టించడమే పనిగా పెట్టుకుంది. చర్చపై అభిప్రాయం చెప్పమంటే.. ఏవేవో కెలికి మాట్లాడుతడు. మొన్న ఢిల్లీ వెళ్లి చీకట్లో మాట్లాడుకున్నదే మీ అభిప్రాయం అనుకోవాలా? సభలో ఏదో ఒకటి మాట్లాడితే.. సభ నుంచి స్పీకర్ బయటకు పంపిస్తే.. బతుకు జీవుడా అని వెళ్లిపోదామనుకుంటున్నారు. స్పీకర్‌గారూ.. వాళ్లను బయటికి పంపొద్దు. తెలంగాణ ప్రజల ముందు వాళ్లను అలాగే నిలబెట్టాలి" అని అన్నారు.

8 ప్లస్ 8 సున్నా అయ్యాయి..

సాధారణంగా 8+8 కలిపితే 16 అవుతాయని, కానీ.. ఇప్పుడు 8+8 కలిస్తే గుండు సున్నా అనే భావన కలుగుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్, బీజేపీకి కలిపి 16 ఎంపీ సీట్లు ఇచ్చినా.. రాష్ట్రానికి న్యాయం జరగలేదని, పదేళ్లలో జరిగిన అన్యాయమే ఇప్పుడూ జరిగిందని తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌ల బడేభాయ్- చోటేభాయ్ అన్నదమ్ముల అనుబంధం ఏమైందని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణ అనే పదం నిషేధించినట్లుగానే.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పదం వినపడకపోవటానికి అక్కడ బీఆర్ఎస్ ఎంపీలు లేకపోవటమే కారణమని వ్యాఖ్యానించారు. తనదాకా వస్తేగానీ తత్వం బోధపడలేదని, బడేభాయ్ సంగతి చోటేభాయ్‌కి ఇప్పుడు తెలిసివచ్చిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ బ్రాండ్‌ను దెబ్బతీస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. అప్పులు, వడ్డీలు అంటూ ప్రచారం చేస్తే.. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు రావని, ఐదేళ్లు పరిపాలించడం మీకే కష్టమవుతుందని హితవు పలికారు. ఇందుకు రేవంత్ స్పందిస్తూ.. మిగులు బడ్జెట్‌తో అప్పజెప్పిన రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని, పదేళ్లలో రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. ఆ వాస్తవాలను ప్రజలకు చెప్పకపోతే ఎలా? అని ప్రశ్నించారు.

ప్రజలు తీర్పు ఇచ్చినా జ్ఞానోదయం కలగదా?

"పదేళ్లలో మీరేం చేశారో చూసిన తర్వాతే ప్రజలు తీర్పు ఇచ్చారు. అయినా మీకు జ్ఞానోదయం కలగడం లేదు. చులకనభావం, అహంభావంతో మాట్లాడే వైఖరి పోవడంలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 ఎమ్మెల్యే స్థానాల్లో మెజారిటీ వస్తే.. పార్లమెంటు ఎన్నికల్లో మూడు చోట్లనే మెజారిటీ వచ్చింది? 2014లో 12 మంది ఎంపీలు, 2019లో 9 మంది గెలిచిన మీకు 2024 ఎన్నికల్లో గుండు సున్నా వచ్చింది. అయినా బుద్ధి మారకపోతే ఎలా?" అని కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు 2014లో రెండు ఎంపీ సీట్లు రాగా, 2019లో 3 సీట్లు వచ్చాయని, ఇటీవలి ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లు గెలుచుకున్నామని గుర్తు చేశారు. గడచిన పదేళ్లలో ప్రతి సందర్భంలోనూ కేంద్రంలోని బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని, జీఎస్టీ బిల్లు, నోట్ల రద్దు, ఆర్టీఐ సవరణ బిల్లు, నోట్ల రద్దుతోపాటు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఎన్నిక, ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎన్నిక, సాగు చట్టాలు, అవిశ్వాస తీర్మానం.. ఇలా అన్నింటినీ సమర్థించిందని తెలిపారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. ముఖ్యమంత్రి దుర్మార్గంగా మాట్లాడుతున్నారని తప్పుబట్టారు. "ఒక దళితుడు రాష్ట్రపతి అవుతున్నడని కోవింద్‌కు మద్దతు ఇచ్చినం. తెలుగుబిడ్డ వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతి అవుతున్నాడని ఓట్లేసినం. అంతేగానీ సాగు చట్టాలకు మేం మద్దతివ్వలేదు. ఏదైనా ఉంటే బాజాప్తా చేసినం తప్ప చీకటి స్నేహాలు చేయలేదు. ఢిల్లీలో బీజేపీ ఎంపీలతో రేవంత్‌రెడ్డే చీకటి స్నేహాలు చేస్తున్నారు. ఇప్పటికీ బీజేపీ ఎంపీలే రేవంత్‌రెడ్డి పనులు ఢిల్లీలో చేసి పెడుతున్నారు. మేం రాష్ట్రం కోసం పదవులు వదులుకున్నాం. పదవులకోసం పార్టీలు మారే అలవాటు మాకులేదు" అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

మోదీ ప్రేమ ఉంటే చాలునన్న కేసీఆర్..

మోదీకి కేసీఆర్ ఎలా ఊడిగం చేశారో అన్ని సాక్ష్యాలూ ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు. పదేళ్లలో చేసిన పాపాలను కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని ఆకాశానికి తీసుకెళ్లినట్లుగా మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. "మిషన్ భగీరథ ప్రారంభోత్సవానికి మెదక్ జిల్లా కోమటిబండకు 2016 ఆగస్టులో ప్రధాని మోదీ వస్తే.. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏమీ కోరబోమని కేసీఆర్ అన్నారు. మాకు మీప్రేమ, ఆశీర్వాదం ఉంటే చాలునన్నారు. తెలంగాణ ప్రజల హక్కులను కేంద్రం కాలరాస్తుంటే.. ప్రతిపక్ష నేతగా సభకు రాకుండా, కేంద్రాన్ని నిలదీయకుండా.. మోదీకి తాకట్టు పెట్టి కాంగ్రెస్‌కు విమర్శించడంలో న్యాయం ఉందా?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీలో పార్లమెంటు మెట్లపై తమ ఎంపీలతో కలిసి రాహుల్, సోనియా, మల్లికార్జున ఖర్గే దీక్ష చేస్తున్నారని, బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు ఎక్కడున్నారో లెక్కపెట్టుకోవాలని కేటీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. విలీనం కోసం ఢిల్లీలో ఇళ్లిళ్లు తిరిగి, చీకట్లో కౌగిలించుకొని వచ్చి.. సభలో రాజకీయ వివాదాలపై చర్చ పెడుతున్నారని ఆరోపించారు. దీంతో, విలీనాలు, చీకటి ఒప్పందాలు చేసుకునే దౌర్భాగ్యం తమకు లేదని కేటీఆర్ బదులిచ్చారు.

కిషన్‌రెడ్డితో చిరునవ్వులు చిందించిన భట్టి..

సింగరేణి గనులను వేలం వేస్తుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిరునవ్వులు చిందిస్తూ.. వేదిక పంచుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తామెన్నడూ రాజీ పడలేదని, ఎవరితోనైనా కొట్లాడతామని స్పష్టం చేశారు. ఏపీకి నిధులివ్వడం సంతోషమేనని, కానీ.. తెలంగాణకు ఇవ్వకపోవడం బాధగా ఉందన్నారు. పదేళ్లలో కేంద్రం సహకరించకపోయినా తాము అభివృద్ధిని ఆపలేదని, అన్నిరంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. 2014లో తెలంగాణ ఏర్పాటు తర్వాత.. టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేద్దామనుకున్నామని, కానీ.. దిగ్విజయ్‌సింగ్ వైఖరి వల్ల అది సాధ్యం కాలేదని చెప్పారు. ఏది ఎలా ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన చర్చకు తాము మద్దతిస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. విద్యుత్తు రంగాన్ని అదానీకి అప్పగించి ప్రైవేటుపరం చేయొద్దన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో పాతబస్తీలో బిల్లుల వసూళ్ల బాధ్యతలు అదానీకి అప్పగించారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రే ప్రకటించారని కేటీఆర్ అనడంతో.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అభ్యంతరం చెప్పారు. సీఎం ఎప్పుడూ, ఎక్కడా ఆ మాట అనలేదని తెలిపారు. "కేంద్రాన్ని విమర్శిస్తే బీజేపీకి, మోదీకి ఎక్కడ కోపమొస్తదోనని కేటీఆర్ భయపడుతున్నారు. వారితో అంటకాగుతారో, మీ పార్టీని బీజేపీలో విలీనం చేసుకుంటారో మీ ఇష్టం" అని భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. రామ్‌నాథ్ కోవింద్ దళితుడని మద్దతిచ్చామంటున్నారని, మరి లోక్‌సభ స్పీకర్‌గా ఉండి.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును ఆమోదించిన మీరాకుమార్ దళితురాలు కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రపతి అభ్యర్థిగా ఆమెకు ఓటు వేయకపోగా, రాష్ట్రానికి వస్తే.. కనీసం ప్రొటోకాల్ కూడా పాటించలేదని మండిపడ్డారు.

కేసీఆర్ దీక్షకు రా.. నేను సిద్ధం: రేవంత్

రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా నిధుల కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు తాను సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. నిధుల కోసం ఢిల్లీలో దీక్ష చేయాలన్న బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, హరీశ్‌రావు సవాళ్లపై రేవంత్ ఈ మేరకు స్పందించారు. "చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చానని మేమెప్పుడు అబద్ధాలు చెప్పలేదు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ పదిపైసలు పెట్టి అగ్గిపెట్టె కొనలేదు. జంతర్ మంతర్ వద్దకు కేసీఆర్‌ను రమ్మనండి. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఆయన, సభాపక్ష నాయకుడిగా నేను తెలంగాణకు నిధులు తెచ్చుడో.. అవసరమైతే సచ్చుడో తేలుద్దాం" అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రానికి నిధుల కోసం ఢిల్లీలో సీఎం రేవంత్‌తో సహా క్యాబినెట్‌తో ఆమరణ దీక్ష చేయాలని సవాల్ విసిరారు. దానికి తమ మద్దతు ఉంటుందన్నారు. నిధులు తెచ్చుడో... కేబినెట్ సచ్చుడోనని వ్యాఖ్యానించారు. కాగా, ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ధర్నా నిర్వహిస్తే బీఆర్ఎస్ మద్దతిస్తుందని హరీశ్‌రావు అన్నారు. అగ్గిపెట్టె దొ రకలేదా? అని సీఎం అనడం ఎంతవరకు సమంజసం? ఉద్యమకారులపైకి రైఫిల్ పట్టుకుని వెళ్లి, రైఫిల్‌రెడ్డిగా పేరు తెచ్చుకుంది మీరు కాదా? అని ప్రశ్నించారు.

ఆగస్టు 2 వరకు

బడ్జెట్ సమావేశాలు!

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలు ఆగస్టు 2 వరకు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీలోని స్పీకర్ ప్రసాద్‌కుమార్ చాంబర్‌లో మంగళవారం సమావేశమైన శాసనసభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ.. ఈ నెల 31 కల్లా పూర్తిస్థాయి బడ్జెట్‌ను, ద్రవ్య వినిమయ బిల్లునూ ఆమోదించుకోవాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఏడు పనిదినాలనూ ఖరారు చేసింది. అయితే సమావేశాలను కనీసం 15రోజుల పాటు నిర్వహించాలంటూ బీఆర్ఎస్ ఎల్పీ, బీజేఎల్పీలు డిమాండ్ చేయడంతో నిర్ణయాధికారాన్ని స్పీకర్‌కు వదిలేసింది. అయితే స్కిల్స్ యూనివర్సిటీ.. విద్య, రైతు కమిషన్ల ఏర్పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు వంటి బిల్లులను ఇదే సమావేశాల్లో పెట్టే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉంది. అలాగే రైతు భరోసా విధివిధానాలు, జాబ్ క్యాలెండర్ ప్రకటన చేసేందుకూ ఏర్పాట్లు చేస్తోంది. వీటితో పాటుగా బడ్జెట్, ద్రవ్యవినిమయ బిల్లుల ఆమో దానికి సమయం సరిపోదన్న అంచనాకు ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వచ్చే నెల 2 వరకు సమావేశాలను కొనసాగించాలని భావిస్తోంది. ఈనెల 31, ఆగస్టు 1,2 తేదీల్లో బిల్లులపై చర్చ, ఆమోదం.. జాబ్‌క్యాలెండర్ ప్రకటన చేయనున్నట్లు సమాచారం.

ఉత్తర డిస్కమ్‌కు 18742.24 కోట్ల నష్టాలు

- 2012-13 నుంచి అదే పరంపర
- లాభాల వెలుగుల్లో ట్రాన్స్‌కో
- శాసనసభకు వార్షిక నివేదికలు

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పుష్కర కాలంగా ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) లాభాల ముఖమే చూడలేదు. 2012-13 నుంచి ఏటా నష్టాలను మూటగట్టుకుంటోంది. బుధవారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక నివేదికను ఉత్తర డిస్కమ్ శాసనసభకు సమర్పించింది. ఈ నివేదికను పరిశీలిస్తే.. కరెంట్ బిల్లులు చూస్తేనే కాదు.. రిపోర్టును చూసినా గుండె గుభేలుమనక మానదు. ఈ 12 ఏళ్ల కాలంలో రూ.18742.24 కోట్ల నష్టాలను ఉత్తర డిస్కమ్ మూటగట్టుకుంది. ఇక 2014-15 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం దాకా గత బీఆర్ఎస్ పాలనలో రూ.15217.47 కోట్ల నష్టాలను డిస్కమ్ చవిచూసింది. ఇక 2011-12లో రూ.4.08 కోట్లు, 2010-11లో రూ.8.91 కోట్లు, 2009-10లో రూ.8.12 కోట్లు లాభాల్లో ఉండటం గమనార్హం. 2012-13 నుంచి ప్రారంభమైన నష్టాల పరంగా కొనసాగుతూనే ఉండటం గమనార్హం. కాగా, 2012-13లో విద్యుత్ కొనుగోళ్లకు ఉత్తర డిస్కమ్ రూ.5300 కోట్లను వెచ్చించగా.. అదే 2022-23లో ఏకంగా రూ.15116.42 కోట్లను వెచ్చించింది. అదే ఉద్యోగుల వేతనాలకు అయ్యే వ్యయం కూడా భారీగానే పెరిగింది. 2012-13లో ఉద్యోగుల జీతాలకు ఏటా రూ.432.89 కోట్లను చెల్లించగా... అదే 2022-23లో రూ.2053 కోట్లను వెచ్చించాల్సిన పరిస్థితి. ఇక కరెంట్ విక్రయాల ద్వారా ఆదాయం 2012-13లో రూ.2893 కోట్లు రాగా.. 2022-23లో రూ.9327 కోట్లు మాత్రమే వచ్చింది. ఆదాయం 300 శాతానికి పైగా పెరగ్గా.. వేతనాల వ్యయం 400 శాతానికి పెరిగింది.

ట్రాన్స్‌కో లాభాల ఆర్జన

డిస్కమ్‌లు నష్టాల దిశగా జెట్ వేగంతో ప్రయాణం చేస్తుండగా.. ఆ డిస్కమ్‌లకు జెన్‌కోలు ఉత్పత్తి చేసే కరెంట్‌ను తీసుకొచ్చి అందించే ట్రాన్స్‌కో మాత్రం లాభాల్లో వెళ్తోంది. 2022-23లో రూ.3077.58 కోట్లఆ దాయం రాగా.. వ్యయం రూ.2773.03 కోట్లు పోను.. రూ.304 కోట్ల లాభాలను ట్రాన్స్‌కో గడించింది. ఇక 2022-23 ఆర్థిక సంవత్సరంలో ట్రాన్స్‌కో వ్యయం ఆదాయం రూ.3535 కోట్లు కాగా.. వ్యయం రూ.3121కోట్లు పోనూ.. రూ.413.57 కోట్ల ఆదాయాన్ని ట్రాన్స్‌కో గడించింది. 2022-23లో ఉద్యోగుల వేతనాలు, ఖర్చుభారం రూ.887 కోట్లు కాగా..2022-23లో రూ.1027 కోట్లుగా ఉంది. 2022-23కి గాను బుధవారం ట్రాన్స్‌కో వార్షికనివేదికను సభలో పెట్టడంతో గణాంకాలన్నీ బయటికొచ్చాయి.

తీరని అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన మాట్లాడారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా.. కేంద్రం తీరని అన్యాయం చేసిందని, అందుకే తెలంగాణ పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా చర్చ పెట్టాల్సి వచ్చిందన్నారు. కేంద్రం వివక్షకు నిరసనగా ఈ నెల 27న జరగనున్న నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామన్నారు.

విభజన హామీల్లో విఫలం



ఏపీ పునర్విభజన చట్టం కింద తెలంగాణకు రావాల్సిన, దక్కాల్సిన నిధులు, హక్కుల ఊసే ఎత్తడం లేదని రేవంత్ ఆరోపించారు. "బడ్జెట్‌లో బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, గిరిజన వర్సిటీలో వసతుల కల్పన, 4 వేల మెగావాట్ల పవర్ ప్రాజెక్టులపై ఎలాంటి ప్రకటన చేయలేదు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో ఉన్న పాలకు లు పట్టించుకోలేదు. దీంతో.. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేరలేదు. రాష్ట్రంలో గత ఏడాది కాంగ్రెస్ సర్కారు కొలువుదీరింది. దాంతో విభజన హామీలపై ఢిల్లీ చుట్టూ తిరిగాను. దాంతోపాటు.. మూసీ రివర్ ప్రాజెక్టు, ఐటీ కారిడార్, ఫార్మా సిటీ సహా పలు కంపెనీలకు అనుమతులను ఇవ్వాలని కోరాం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను పీఎంకేఎస్‌వై పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశాం. వీటికి ఈ బడ్జెట్‌లో న్యాయం జరుగుతుందని ఆశించినా.. భంగపాటే ఎదురైంది" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

బిహార్, యూపీలకేనా?

రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్తున్న మొత్తంలో తిరిగి చాలా తక్కువ వెనక్కి వస్తోందని రేవంత్ దుయ్యబట్టారు. "ఈ వివక్ష ఎంతలా ఉందంటే.. కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయిలో.. కేవలం 43 పైసలనే తిరిగి ఇస్తున్నారు. అదే బిహార్‌కు ప్రతి రూపాయికి రూ.7.26 చెల్లిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి రూ.3.41లక్షల కోట్ల జీఎస్టీ కేంద్రానికి వెళ్తే.. కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రానికి రూ.6.91 లక్షల కోట్లను తిరిగి ఇచ్చింది. దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు-- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు నుంచి కేంద్రానికి రూ.22.26 లక్షల కోట్ల జీఎస్టీ వెళ్లగా.. తిరిగి ఇచ్చింది మాత్రం రూ.6.91 లక్షల కోట్లే..! అంటే.. ఐదు రాష్ట్రాలకు కలిపి ఇచ్చిన మొత్తం, ఉత్తరప్రదేశ్‌కు ఇచ్చిన నిధులతో సమానం. తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని అడిగితే.. అమృత్ పథకం కింద రూ.3,500 కోట్లు ఇచ్చామంటున్నారు. అదేమీ గుజరాత్ నుంచో.. ఎవరి సొంత పైసల నుంచో ఇవ్వడం లేదు కదా?" అని దుయ్యబట్టారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్లమెంట్‌లో గళమెత్తుతామన్నారు.

5 ట్రిలియన్ ఎకానమీ సాధించాలంటే..

దేశం 5 ట్రిలియన్ ఎకానమీని సాధిస్తుందని ప్రధాని చెబుతుంటారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ లక్ష్యం నెరవేరాలంటే.. హైదరాబాద్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని సూచించారు. "దేశంలో ముంబై, బెంగళూరు, కోల్‌కతా, అహ్మదాబాద్, హైదరాబాద్ నగరాలు మెట్రోపాలిటన్ సిటీలుగా ఉన్నాయి. హైదరాబాద్ అభివృద్ధికి మూసీ రివర్ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు నిధులిచ్చి.. మెట్రో విస్తరణకు సహకరించాలి" అని వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా జలాలకు కూడా శాశ్వత పరిష్కారం చూపాలని మోదీని కోరామని, తెలంగాణకు సైనిక్ స్కూల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామని వివరించారు.

నేను సీఎంగా ఉండడం కొందరికి నచ్చట్లే..

తాను సీఎంగా ఉండడం కొందరికి నచ్చట్లేదని, కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని రేవంత్ మండిపడ్డారు. "మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా కలిశాను. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులపై చర్చించాను. మోదీతో కలిసి సభలో మాట్లాడుతూ.. ఆయనను 'పెద్దన్న' అని సంబోధించాను. దాన్ని కూడా కొందరు రాజకీయం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే మోదీని కలిశానని.. ఎవరికో లొంగిపోవడానికో.. వంగిపోవడానికో కాదు" అని స్పష్టం చేశారు. ఎవరినో పెద్దన్న అని పిలిస్తే తనకు ముఖ్యమంత్రి పదవి రాలేదని, ప్రజాస్వామిక స్ఫూర్తితో తనను ఎన్నుకున్నారని, ప్రజలు తనకు ఈ పదవిని ఇచ్చారని చెప్పారు. కాగా.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని, బడ్జెట్‌ను సవరించి, తెలంగాణకు నిధులు ఇవ్వాలని ఈ సందర్భంగా సీఎం డిమాండ్ చేశారు. ఈ తీర్మానానికి బీఆర్ఎస్ మద్దతు పలకగా.. బీజేపీ సభ్యులు వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.



నేడు అసెంబ్లీకి కేసీఆర్!

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్ష నేత హోదాలో గురువారం తొలిసారి అసెంబ్లీకి రానున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉంటూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలకూ ఆయన గైర్హాజరయ్యారు. కేవలం ఎమ్మెల్యేగా ప్రమాణం చేయడానికి మాత్రమే ఒక్కసారి ఆయన అసెంబ్లీకి వచ్చారు. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో కేసీఆర్ హాజరుపై మళ్లీ చర్చ మొదలైంది. అసెంబ్లీ సమావేశాలకు ఆయన వస్తారా లేదా? అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే విషయంపై బుధవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సహా.. పలువురు మంత్రులు మాట్లాడుతూ ప్రతిపక్షనేత ఎక్కడ దాక్కున్నారు? అసెంబ్లీకి రారా? అని బీఆర్ఎస్ సభ్యులను ప్రశ్నించారు. అయితే గురువారం కేసీఆర్ అసెంబ్లీకి రానున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్న నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉండగా.. అసెంబ్లీ లాబీలో ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు కేటాయించిన చాంబర్‌లో ఎలాంటి మార్పులు ఉండవని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. గతంలో కేటాయించిన చాంబర్‌ను ఉపయోగించాల్సిందేనని స్పష్టం చేశాయి. కేసీఆర్‌కు ఇరుకైన చాంబర్ కేటాయించారని, తమ నేతను అవమానపరిచే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించిన విషయం తెలిసిందే.

ప్రతి తండాకు బీటీ రోడ్డు

తండాల నుంచి మండల కేంద్రానికీ రోడ్లు వేస్తాం

రెవెన్యూ గ్రామాలుగా కొత్త పంచాయతీలు: సీతక్క

పాఠశాలల కోసం ప్రత్యేక బస్సులు: పొన్నం



హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి తండాకు, గూడేనికి బీటీ రోడ్లు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రతి గిరిజన ఆవాసానికి రవాణా, తాగునీటి సౌకర్యం, వారి పిల్లలు చదువుకునే అవకాశం కల్పించినప్పుడే.. తెలంగాణ ఏర్పాటు లక్ష్యం, ఉద్దేశం సంపూర్ణంగా నెరవేరినట్లు తాము భావిస్తామన్నారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఆవాసానికీ తాగునీరు అందించినట్లు చెప్పిందని, కానీ.. పంచాయతీల నుంచి తీర్మానం తెప్పించుకుంటే.. దాదాపు ఏడు లక్షల ఆవాసాలకు తాగునీటి సౌకర్యం లేనట్లుగా గణాంకాలు వచ్చాయని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ సభలో బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో సీఎం స్పందిస్తూ, "ప్రజలు శిక్షించినా మీలో మార్పు రాలేదు. ఆ దేవుడు మీకు మంచి ఆలోచనలు వచ్చేలా చూడాలి" అని అన్నారు. తన నియోజకవర్గంలోని బొంరాస్‌పేట మండలంలో 72 తండాలుంటే.. వాటిలో చాలా తండాలకు రవాణా సౌకర్యం లేదని, అయినా కొన్ని పంచాయతీలుగా మారాయని అన్నారు. తండాలో కనీసం పాఠశాల లేకపోయినా, రోడ్డు, కరెంట్ సౌకర్యం లేకున్నా పంచాయతీలుగా హోదా ఇచ్చారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టి.. మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందన్నారు. తండాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు వేయడంతోపాటు గ్రామం నుంచి మండల కేంద్రాలకు మిగిలిపోయిన డబుల్ లేన్ రోడ్ల పనులను పూర్తి చేస్తామని, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు లేన్ల రోడ్లు వేస్తామని ప్రకటించారు.

పంచాయతీలను నిర్వీర్యం చేశారు..

రాష్ట్రంలో భూముల సర్వే చేపట్టకపోవడంతో కొత్త రెవెన్యూ గ్రామాలను రెవెన్యూశాఖ ఏర్పాటు చేయలేకపోయిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ శాఖతో చర్చిస్తామన్నారు. కొత్తగా పంచాయతీలుగా మారిన తండాలను, గూడేలను రెవెన్యూ గ్రామాలుగా మార్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా చేసినా పక్కా భవనాలు కేటాయించలేదని, పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కాగా, సంఖ్యాబలం చూపించడానికి ఒక తండాను రెండు గ్రామ పంచాయతీలుగా మార్చారని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ విమర్శించారు. తండాలను పంచాయతీలుగా మార్చినా, రెవెన్యూ పంచాయతీలుగా గుర్తింపు ఇవ్వలేదని ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ అన్నారు. కాగా, పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తామని రవాణా శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.



కాళ్లకు చెప్పులు లేకుండానే..

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కాళ్లకు చెప్పులు లేకుండా బుధవారం శాసనమండలికి హాజరయ్యారు. మండలి వాయిదా పడిన అనంతరం అసెంబ్లీ ప్రాంగణానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా 'మేడమ్ కాళ్లకు చెప్పులు వేసుకోలేదు ఏంటి?' అని ఓ విలేకరి ప్రశ్నించగా.. స్పందించిన మాజీ మంత్రి.. 'కేసీఆర్ మూడోసారి సీఎం పీఠం ఎక్కే వరకు చెప్పులు వేసుకోనని గతంలోనే ప్రకటించా కదా' అని బదులిచ్చారు.

రాణాల బాటలో కమిషనర్లు, ఎస్పీలు

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనర్లు, ఎస్పీలు ఠాణాల బాట పడుతున్నారు. సంప్రదాయ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ.. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. తమ కార్యాలయాలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. పోలీస్‌స్టేషన్లలో తనిఖీలు చేపడుతున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు(ఎస్‌హెచ్‌వో), ఇతర సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్నారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న ఠాణాల్లో నేరాల తీరు, ఫైళ్ల నిర్వహణ, శిక్షల శాతం, ఆధారాల విశ్లేషణ తీరు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి సారిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. ఇటీవల వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఓ ఎస్సై విధినిర్వహణలో అలసత్వం వహించినట్లు గుర్తించిన సీపీ.. అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు. క్రమశిక్షణారహితంగా వ్యవహరించిన ఓ హెడ్ కానిస్టేబుల్‌ను సిద్దిపేట సీపీ సస్పెండ్ చేశారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన కొన్ని సంఘటనలు పోలీసింగ్‌కు మచ్చతెచ్చేవిగా ఉండడంతో.. ప్రభుత్వం, డీజీపీ జితేందర్ విజిబుల్ పోలీసింగ్‌పై ఎస్పీలు, కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. డీజీపీ, అదనపు డీజీపీలు కూడా త్వరలో క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమయ్యారు.

ఆగస్టు 1 నుంచి ఆర్కిటెక్చర్ సీట్ల భర్తీ

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 1వ తేదీ నుంచి ఆర్కిటెక్చర్ సీట్ల భర్తీ ప్రక్రియను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. బీ-ఆర్క్ అడ్మిషన్ల కమిటీ సమావేశం బుధవారం జరిగింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. దీని ప్రకారం ఆర్కిటెక్చర్ సీట్ల భర్తీకి సంబంధించి ఈ నెల 26వ తేదీన నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. తర్వాత ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు 9న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. ఆగస్టు 17, 18 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు 21న సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 22 నుంచి 23 తేదీల్లో ఆయా కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. 25వ తేదీ నుంచి రెండవ దశ కౌన్సెలింగ్ మొదలు కానుంది.

ఆగస్టు 4న టీటీసీ పరీక్ష

ఆగస్టు 4వ తేదీన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్(టీటీసీ) పరీక్షను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు.

సెన్సార్ బోర్డులో పదవి ఇప్పిస్తామని మోసం

- మాజీ ఎమ్మెల్సీ కపిలవాయితోపాటు మరొకరిపై కేసు

బంజారాహిల్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సినిమా సెన్సార్ బోర్డులో సభ్యుడి పదవి ఇప్పిస్తామని చెప్పి ఓ వ్యక్తి నుంచి రూ.10 లక్షలు తీసుకొని మోసం చేసిన ఘటనలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్‌తోపాటు మరొకరిపై కేసు నమోదైంది. పలు షార్ట్ ఫిలింలను నిర్మించిన సిద్దిపేటకు చెందిన వ్యాపారి వి. శశిధర్‌కు ప్రశాసన్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిచయం అయ్యాడు. తనకు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పరిచయాలు ఉన్నాయని, సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడిగా అవకాశం ఇప్పిస్తానని ప్రవీణ్‌కుమార్‌రెడ్డి.. శశిధర్‌కు నమ్మబలికాడు. కొద్ది రోజులు తరువాత శశిధర్‌ను మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి ఇంటికి తీసుకెళ్లాడు. సెన్సార్ బోర్డు సభ్యుడి పదవికి రూ.13 లక్షలు ఖర్చవుతుందని కపిలవాయి చెప్పడంతో శశిధర్ డబ్బు ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. కపిలవాయి సూచన మేరకు రూ. 4 లక్షలు లహరి అనే మహిళ అకౌంట్‌కు బదిలీ చేసి, మరో రూ. 6లక్షలు ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చారు. వారు రెండు వారాల్లో పోస్టు ఇప్పిస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో.. నిలదీయగా సెన్సార్ బోర్డు ప్రస్తుత పదవీ కాలం పూర్తయిందని, కొత్త వారికి అవకాశం రావాలంటే మూడు నెలల సమయం పడుతుందని చెప్పారు. ఇంతలో ఎఫ్‌సీఐలో పోస్టు ఇప్పిస్తామని దానికి రూ.15 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. అనుమానం వచ్చిన శశిధర్ ఆరా తీయగా వీరు ఇలాగే చాలా మందిని మోసం చేసినట్లు తేలింది. వెంటనే ఆయన జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కపిలవాయితోపాటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వర్సిటీలో అడ్మిషన్లకు నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో అడ్మిషన్లకు ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. ప్రతీ ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేసే తెలుగు యూనివర్సిటీకి ఈ సారి రాష్ట్ర విభజన చట్టం పదో షెడ్యూల్ అడ్డుగా వచ్చినట్లు తెలిసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ఉమ్మడి రాజధాని హైదరాబాద్ పదేళ్ల గడువు తీరడంతో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రమే విడి విడిగా నోటిఫికేషన్ వేసుకోవాలని తెలుగు యూనివర్సిటీ ఏపీకి విజ్ఞప్తి చేసింది. మరో ఏడాది పాటు ఉమ్మడిగా నోటిఫికేషన్ వేయాలంటూ ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. అయితే ఏపీలో ఉన్న తెలుగు వర్సిటీ పీఠాలతో సంబంధం లేకుండా హైదరాబాద్ కేంద్రంగా ఉన్న తెలుగు వర్సిటీతో పాటు వరంగల్‌లో అనుబంధంగా ఉన్న జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ఉన్న కోర్సులకే అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. హైదరాబాద్, వరంగల్ ప్రాంగణాల్లో గల తెలుగు, చరిత్ర- పర్యాటకం, జర్నలిజం, భాషాశాస్త్రం, శిల్పం- చిత్రలేఖనం, డిజైన్, సంగీతం, రంగస్థలం, నృత్యం, జానపదం, జ్యోతిష్యం, యోగా సబ్జెక్టులతో తెలుగు యూనివర్సిటీ పీజీ, యూజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సాధారణ రుసుంతో ఆగస్టు 8వ తేదీ వరకు, ఆలస్య రుసుముతో ఆగస్టు 19వ తేదీ వరకు తెలుగు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.teluguuniversity.ac.inలో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ అధికారులు సూచించారు.

యూట్యూబర్ ప్రణీత్‌కు బెయిల్ నిరాకరణ

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తండ్రి, కుమార్తె బంధంపై అశ్లీల వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రణీత్ హన్మంత్‌కు బెయిల్ ఇచ్చేందుకు నాంపల్లి కోర్టు నిరాకరించింది. జుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ప్రణీత్ బెయిల్ కోరుతూ నాంపల్లి పోక్సో కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కాగా, నిందితుడు, దర్యాప్తు అధికారుల తరఫు న్యాయవాదుల వాదనలు విన్న కోర్టు పిటీషన్‌ను కొట్టివేసింది. దర్యాప్తు కీలక దశలో ఉందని, ఈ సమయంలో నిందితుడు బెయిల్‌పై బయట ఉంటే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందన్న అధికారుల వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు.

పదోన్నతులు కల్పించండి బాస్

- ఐజీలకు పోలీస్ అధికారుల సంఘం వినతి

హైదరాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సమస్యలు పరిష్కరించడంతోపాటు పదోన్నతులకు చర్యలు తీసుకోవాలని ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణకు పోలీసు అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు ఐజీల్ని వేర్వేరుగా కలిసి బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఎస్సై, ఆర్ ఎస్సై పదోన్నతి శిక్షణ ఇదివరకే పూర్తిచేసిన వారికి తక్షణం పదోన్నతి కల్పించాలని కోరారు. డిప్యుటేషన్‌లో ఉన్న వారి పోస్టుల్ని జిల్లాల వారిగా ఖాళీలను గుర్తించి కండీషనల్ పదోన్నతులు కల్పించాలన్నారు. జీవో నెంబరు 317 బదిలీల తర్వాత కొన్ని జోన్లలో 30% ఉండాల్సిన ర్యాంకర్ ఎస్సై కోటా తగ్గిందని, పరిశీలించి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తికి పాస్‌పోర్టు హక్కు కాదు: హైకోర్టు

క్రిమినల్ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తి పాస్‌పోర్ట్‌ను తన హక్కుగా కోరరాదని హైకోర్టు స్పష్టం చేసింది. అందుకు పాస్‌పోర్ట్ చట్టం అనుమతించదని తెలిపింది. క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులు సంబంధిత ట్రయల్ కోర్టును ఆశ్రయించి తాత్కాలికంగా ఏడాది, రెండేళ్ల కాలానికి కొత్త పాస్‌పోర్ట్ లేదా పాత పాస్‌పోర్ట్ రెన్యువల్‌కు అనుమతి పొందవచ్చని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం పేర్కొంది. పెండింగ్ క్రిమినల్ కేసులతో సంబంధం లేకుండా పాస్‌పోర్ట్ జారీచేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసింది. నల్లగొండ జిల్లాకు చెందిన అనంతరాజు గౌడ్‌పై 2017 నుంచి క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉంది. అతను పాస్‌పోర్ట్ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోగా పోలీసుల తనిఖీల్లో కేసు ఉన్నట్లు తేలడంతో పాస్‌పోర్ట్ అధికారులు దరఖాస్తుదారు వివరణ కోరారు. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించగా.. క్రిమినల్ కేసులతో సంబంధం లేకుండా పాస్‌పోర్ట్ రెన్యువల్ చేయాలని సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారు. ఆ ఆదేశాలపై పాస్‌పోర్ట్ అథారిటీ, కేంద్రం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది.

'హద్దు' మీరకుండా జియోఫెన్సింగ్

మైనింగ్ అక్రమాల అడ్డుకట్టకు ప్రభుత్వ చర్య



హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ అక్రమాలకు అడ్డుకట్ట వేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ, పట్టా, అటవీ భూముల్లో మైనింగ్ లీజు పొందిన కొందరు తమకు కేటాయించిన భూముల హద్దుల దాటి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని సర్కారు గుర్తించింది. అక్రమ మైనింగ్ గురించి తెలిసినా క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఈ నేపథ్యంలో లీజుదారులు హద్దులు మీరి అక్రమ మైనింగ్‌కు పాల్పడకుండా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. మైనింగ్ లీజుకిచ్చిన భూముల హద్దులను జియోఫెన్సింగ్ చేయాలని నిర్ణయించింది. మూడు నెలల్లోగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 72516.5745 హెక్టార్ల భూమిని మైనింగ్‌కు ఇచ్చారు. లీజుకు ఇచ్చిన వాటిలో 36979.12 హెక్టార్ల ప్రభుత్వ భూములు, 22,943.90 హెక్టార్ల పట్టా భూములు, 12,593.55 హెక్టార్ల అటవీ భూములు ఉన్నాయి.

స్మితాసబర్వాల్‌ది వివక్షాపూరిత మనస్తత్వం

- ఆమెపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి
- అడ్వొకసీ గ్రూపు 'డాక్టర్స్ విత్ డిజెబిలిటీస్' డిమాండ్
- తెలంగాణ సీఎం రేవంత్‌కు ఆ గ్రూపు సభ్యుడి లేఖ



న్యూఢిల్లీ, జూలై 24: సివిల్స్‌లో దివ్యాంగుల కోటాపై ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను.. ఢిల్లీకి చెందిన ప్రముఖ అడ్వొకసీ గ్రూప్ 'డాక్టర్స్ విత్ డిజెబిలిటీస్' తీవ్రంగా ఖండించింది. ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ గ్రూపు సభ్యుడు డాక్టర్ సతేంద్ర సింగ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. స్మిత వ్యాఖ్యలు.. వికలాంగుల పట్ల వివక్షాపూరిత మనస్తత్వానికి నిదర్శనంగా, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సమ్మిళిత విధానానికి వ్యతిరేకంగా ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఆలిండియా సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్ 1968 ప్రకారం.. సివిల్ సర్వీసెస్‌లో ఉన్నవారు ప్రభుత్వ విధానాలను విమర్శించడం పట్ల నిషేధం ఉందని గుర్తు చేశారు. స్మిత వ్యాఖ్యలు ఆ నిబంధనలను ఉల్లంఘించే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. డీవోపీటీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్), డీఈపీటీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజెబిలిటీస్) అధికారులు వెంటనే ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమరావతికి చుక్..చుక్..

రాష్ట్ర రాజధానిని అనుసంధానిస్తూ.. 2,047 కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం ఓకే

- ఏపీకి మొత్తం రూ.9,151 కోట్ల రైల్వే బడ్జెట్
- భారీఎత్తున పట్టాలెక్కిన ఏపీ ప్రాజెక్టులు
- అమరావతి లైన్ పరిధి 56 కిలోమీటర్లు
- విజయవాడ - ఏరుపాలెం నుంచి అమరావతి స్టేషన్,నంబూరు వరకు నిర్మాణం
- లైన్‌మ్యాప్ చూపిన మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో మంగళవారం ఏపీని మురిపించిన కేంద్ర ప్రభుత్వం, ఆ మరునాడే రాష్ట్రానికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పలు రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఇందులో రూ.2,047 కోట్లు రాష్ట్ర రాజధాని అమరావతికి రైల్వే లైన్ కోసమే వెచ్చించనుండటం విశేషం. ఏపీలో రైల్వేల మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రాజెక్టులకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.9,151 కోట్లను కేటాయించామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009-14 మధ్య ఐదేళ్లకు సగటున రూ.886 కోట్లు కేటాయించగా, తాము ఈ ఒక్క ఏడాదే విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అంతకు పది రెట్లకు పైగా నిధులు కేటాయించామని ఆయన వివరించారు. పార్లమెంటులో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో విజయవాడ ఎంపీ కేశినేని (శివనాథ్) చిన్ని అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఏపీలో మొత్తం రైల్వే విద్యుదీకరణ ప్రక్రియ పూర్తయిందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ప్రస్తుతం రూ.73,743 కోట్ల వ్యయంతో 5,329 కిలోమీటర్ల మేరకు కొత్త లైన్లకు సంబంధించి 41 ప్రాజెక్టులు అమలవుతున్నాయని ఆయన తెలిపారు. రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ 56 కిలోమీటర్ల పరిధిలో రూ.2,047 కోట్లతో కొత్త రైల్వే ప్రాజెక్టును చేపడుతున్నామని, ఇది డీపీఆర్ దశలో ఉన్నదని చెప్పారు. నీతీ ఆయోగ్ కూడా దీనిని అనుమతించిందని తెలిపారు. అన్ని అనుమతులూ లభించిన తర్వాత పనులు చేపడతామని ఆయన చెప్పారు. రాజధానిని పలు ప్రాంతాలతో అనుసంధానం చేస్తూ నిర్మించే ఈ లైన్ ఎంతో ముఖ్యమైనదని ఆయన అభివర్ణించారు. అమరావతి రైల్వే లైన్ మ్యాప్‌ను ఆయన విలేకరులకు చూపించారు. విజయవాడ - ఏరుపాలెం నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్టు ద్వారా కృష్ణానదిని దాటి అమరావతి స్టేషన్‌కు, అక్కడి నుంచి నంబూరుకు ఈ లైను చేరుకుంటుందని తెలిపారు.

భూములు అప్పగించగానే రైల్వేజోన్ పనులు

విశాఖ రైల్వే జోన్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం ఇంతవరకూ భూమిని అప్పగించలేదని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గత ప్రభుత్వం ఇవ్వజూపిన స్థలం రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో ఉన్నందువల్ల బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడడంతో దాన్ని స్వీకరించలేదని, ఆ తర్వాత తమకు భూమిని కేటాయించలేదని చెప్పారు. ఎన్నిసార్లు అభ్యర్థించినా తమకు భూమిని కేటాయించలేదన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు ఇటీవల ఆ స్థలాన్ని సందర్శించారని, తనతో కూడా మాట్లాడారని ఆయన తెలిపారు. త్వరలో భూమిని గుర్తించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరామని, భూమి కేటాయించగానే వెంటనే పనులు చేపడతామని చెప్పారు. ఏపీలో 2009-14 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 73 కొత్త రైల్వే లైన్ల నిర్మాణం జరగగా, తాము పదేళ్లలో విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 151 కొత్త రైల్వే లైన్లను నిర్మించామన్నారు. అదే విధంగా యూపీఏ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కేవలం 37 రైల్వే లైన్ల విద్యుదీకరణ జరిగితే, తాము గత పదేళ్లలో 195 లైన్ల విద్యుదీకరణ జరిపామని ఆయన చెప్పారు. ఏపీలో రికార్డు స్థాయిలో 2014 నుంచి743 రైల్వే ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలను నిర్మించామని తెలిపారు ఈ ఏడాది 73 స్టేషన్లను 'అమృత్ స్టేషన్లు'గా అభివృద్ధి చేస్తున్నామని, అందులో విజయవాడ రైల్వేస్టేషన్ ఒకటి అని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ స్టేషన్ కోసం రాబోయే 50 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించామని చెప్పారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు, అమరావతి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు ఒకేసారి చేసేందుకు ప్రణాళిక రూపకల్పన చేసినట్టు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.



తెలంగాణ రైల్వే బడ్జెట్ రూ.5,336 కోట్లు

- 40 స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి
- వందశాతం రైల్వేమార్గాల విద్యుదీకరణ
- 32,946 కోట్లతో 2,298 కి.మీ. కొత్త లైన్లు
- గత పదేళ్లలో 437 ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిల నిర్మాణం
- రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే మౌలిక సదుపాయాల కోసం తెలంగాణకు ఈసారి రూ.5,336 కోట్లు కేటాయించామని రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. ఇది నాటి యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి 2009-14 మధ్య ఏటా సగటున కేటాయించిన రూ.886 కోట్ల కన్నా ఆరు రెట్లు అధికమన్నారు. బుధవారం అశ్వనీ వైష్ణవ్ ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణలో రూ.32,946 కోట్ల వ్యయంతో 2,298 కి.మీ.ల మేర కొత్త రైల్వే మార్గం పనులు జరుగుతున్నాయని తెలిపారు. 40 రైల్వే స్టేషన్లలో విస్తృతస్థాయిలో మరమ్మతులు జరిపి పూర్తిగా ఆధునికీకరించామని, వాటిని అమృత్ స్టేషన్లుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో నూటికి నూరు శాతం రైల్వే విద్యుదీకరణ జరిగిందన్నారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి కనీవినీ ఎరుగని స్థాయిలో జరుగుతోందని మంత్రి తెలిపారు. 2009-14 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏటా సగటున 17 కి.మీ.ల కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, 41 కి.మీ. లైన్ల విద్యుదీకరణ జరిగితే తాము గత పదేళ్లలో కేవలం తెలంగాణలోనే ఏటా 65 కి.మీ. కొత్త లైన్ల నిర్మాణం, 110 కి.మీ. లైన్ల విద్యుదీకరణ పూర్తి చేశామన్నారు. 2014 నుంచి తెలంగాణలో 437 రైల్వే ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలను నిర్మించామని చెప్పారు.

చర్లపల్లి టెర్మినల్ ప్రారంభానికి సిద్ధం

చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభానికి సిద్ధంగా ఉందని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చెప్పారు. టెర్మినల్‌ను ప్రారంభించే విషయమై త్వరలోనే రైల్వే శాఖ ప్రకటన చేయనుందన్నారు. హైదరాబాద్ ఎంఎంటీఎస్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తుందా? అని విలేకరులు అడగ్గా.. రాష్ట్ర ప్రభుత్వం సహకరించినా, సహకరించకున్నా చేపట్టిన ప్రాజెక్టులను పూర్తిచేస్తామని జైన్ తెలిపారు. నాంపల్లి- సికింద్రాబాద్ మార్గంలో ఎంఎంటీఎస్ సర్వీసులు నడవకపోవడంపై జీఎం స్పందిస్తూ.. నాంపల్లి నుంచి సికింద్రాబాద్ మీదుగా ఉమ్దానగర్ వరకు ఎంఎంటీఎస్ రైళ్లు నడుస్తున్నాయని చెప్పడం గమనార్హం. ఈ మార్గంలో ఒక్క ఎంఎంటీఎస్ కూడా నడవడం లేదన్న విషయాన్ని తెలియనివ్వకుండా ఉన్నతాధికారులు ఆయన్ను తప్పుదోవ పట్టిస్తున్నారని పలువురు రైల్వే ఉద్యోగులు చెబుతున్నారు.



చిలుకూరు ఆలయం వద్ద హిందూ సంఘాల నాయకుల నిరసన ప్రదర్శన

చిలుకూరు ఆలయానికి 2 కి.మీ పరిధిలో

అన్యమతస్థుల ప్రార్థనా నిర్మాణాలొద్దు

- ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్, హిందూ సంఘాల డిమాండ్
- గ్రామంలోని వక్ఫ్ బోర్డు స్థలంలో మసీదు నిర్మాణంపై అభ్యంతరాలు
- ఆలయం వద్ద నిరసన గ్రామంలో144 సెక్షన్

మొయినాబాద్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయానికి 2కిలోమీటర్ల పరిధిలో అన్యమతాలకు సంబంధించిన ఎలాంటి నిర్మాణాలను చేపట్టవద్దని ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ డిమాండ్ చేశారు. ఏపీలోని తిరుమల తిరుపతి వేంకటేశ్వర దేవస్థానం పరిధిలో ఈ పద్ధతి అమలవుతోందని చెప్పారు. తిరుమలలోని వేంకటేశ్వరస్వామి చిలుకూరులో స్వయంభువుగా వెలిశారని, అందువల్ల అక్కడ ఎలాంటి నియమాలున్నాయో అవే చిలుకూరు దేవాలయానికి కూడా వర్తిసాయని ఆయన చెప్పారు. ఈ పద్ధతిని అమలు చేయాల్సిన బాధ్యత పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులపై ఉందన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ వెంటనే దృష్టి సారించి ఆలయానికి 2కిలోమీటర్ల పరిధిలో అన్యమతాలకు చెందిన ప్రార్థనా నిర్మాణాలను ఆపేయాలని కోరారు. లేని యెడల ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రంగరాజన్ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 134లో ఓ ప్రవాస భారతీయుడికి పట్టా భూమి ఉంది. ఇటీవల ఆ స్థలాన్ని చదును చేస్తూ.. దానికి పక్కనే సర్వే నంబర్ 133లో వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన 4 గుంటల స్థలంలో ఉన్న పురాతన కట్టడాన్ని కూడా కూల్చివేశారు. దీంతో, తిరిగి ఆ నిర్మాణాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించారు. ఇది తెలుసుకున్న పలు హిందూ సంఘాల నాయకులు బుధవారం పెద్ద సంఖ్యలో చిలుకూరుకు తరలి వచ్చారు. నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీంతో చిలుకూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి ఏసీపీ రమణారెడ్డి, చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డిలు హిందూ సంఘాల నాయకులతో పాటు రంగరాజన్‌తో సమావేశమయ్యారు. సదరు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నిరసన ప్రదర్శనలు, ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో చిలుకూరు, హిమాయత్‌నగర్ గ్రామాల్లో 144 సెక్షన్‌ను విధించినట్లు పోలీసులు చెప్పారు.

ఫర్నిచర్ గోదాంలో అగ్నిప్రమాదం తండ్రి, కుమార్తె మృతి

భార్య, చిన్న కుమార్తె, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

- గోదాం పైఅంతస్తులో నివాసం ఉంటున్న కార్మికుడి కుటుంబం
- అర్ధరాత్రి చెలరేగిన మంటలు
- చుట్టూ కమ్మేసిన పొగలు





జి.శ్రీనివాస్; జి.శివప్రియ (ఫైల్)

అఫ్జల్‌గంజ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఫర్నిచర్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం ఆ కుటుంబంలో పెనువిషాదం నింపింది. మంటల్లో తీవ్రంగా గాయపడిన తండ్రి, పెద్ద కుమార్తె చికిత్స పొందుతూ చనిపోగా.. భార్య, చిన్న కుమార్తె, మరో ఇద్దరు మహిళలు మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామానికి చెందిన గోరగంటి శ్రీనివాస్ (40), భార్య నాగమణి దంపతులకు శివప్రియ (10), హరిణి సంతానం. శ్రీనివాస్ 20 సంవత్సరాల నుంచి హైదరాబాద్ నాంపల్లికి చెందిన హోల్‌సేల్ ఫర్నిచర్ వ్యాపారి ధనుంజయ బన్సాల్ వద్ద సోఫాల తయారీ పనిచేస్తున్నాడు. నగరంలో పలుచోట్ల షాపులు నిర్వహిస్తున్న బన్సాల్‌కు జియగూడ వెంకటేశ్వరనగర్‌లో రెండంతస్తుల భవనం ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫర్నిచర్ విడిభాగాలు తయారు చేయడంతో పాటు గోదాంగా వినియోగిస్తున్నారు. నగరంలో వేరే ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్న శ్రీనివాస్ కుటుంబాన్ని ఈ భవనం మొదటి అంతస్తులో ఉండేందుకు బన్సాల్ ఒప్పించి మూడేళ్ల క్రితం తీసుకొచ్చాడు. రోజూలాగే మంగళవారం రాత్రి కూడా గోదాంలో పని పూర్తయ్యాక శ్రీనివాస్ మొదటి అంతస్తులోని ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులందరూ కలిసి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో గోదాంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున సోఫాల ఫోమ్, గడ్డి, ఇతర లెదర్ వస్తువులు ఉండటంతో మంటలు వాటికి వ్యాపించాయి. ఉవ్వెత్తున మంటలు ఎగిసి పడడం, పొగ కమ్మేయడంతో మొదటి అంతస్తులో ఉన్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బయటకు రాలేకపోయారు. ఫర్నిచర్ గోదాంలోనే పని చేస్తూ మొదటి అంతస్తులోనే ఉంటున్న లక్ష్మీబాయి అనే వృద్ధురాలు, మరో మహిళ అమ్ములు ఉజ్జరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు 5 ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాయపడిన ఆరుగుర్నీ తెల్లవారుజామున ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్, శివప్రియ మృతిచెందారు. నాగమణి, హరిణి, లక్ష్మీబాయి, ఉజ్జరి చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్లే జరిగిందా? ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఘటన తెలిసి యజమాని బన్సాల్‌కు గుండెపోటుతో రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.

'కోకాపేటలో 11ఎకరాల'పై వివరణ ఇవ్వండి

- బీఆర్ఎస్‌కు హైకోర్టు నోటీసులు
- వైఖరి తెలపాలని ప్రభుత్వానికీ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కోకాపేటలో గత ప్రభుత్వం 11 ఎకరాలు కేటాయించిన వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టు నోటీసులు జారీచేసింది. అలాగే ఈ వ్యవహారంపై ప్రభుత్వ వైఖరి ఏంటో తెలియజేయాలని అడ్వొకేట్ జనరల్‌ను ఆదేశించింది. గత ప్రభుత్వం తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడిందని.. కోకాపేటలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన 11 ఎకరాల భూమిని అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి కట్టబెట్టిందని పేర్కొంటూ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేటలో సర్వే నంబరు 239, 240లో 11 ఎకరాల (53,240 చదరపు గజాలు) భూమిని 2023 మే 23న బీఆర్ఎస్ పార్టీకి కేటాయిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు తమకే ఉన్నాయని.. వివాదాస్పద భూమిపై ప్రభుత్వానికి ఎలాంటి టైటిల్ లేకుండానే బీఆర్ఎస్ పార్టీకి కేటాయించడం అక్రమమని పేర్కొంటూ సికింద్రాబాద్ హైదర్‌బస్తీకి చెందిన జాకేటి అశోక్‌దత్ జయశ్రీ, కనుకాల జ్యోతిర్మయి దత్, జేపీ కీర్తిమయి, జేపీ అక్షయ్‌దత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఆగస్టు 22కు వాయిదా వేసింది.

చినుకుల గది 'పాఠం' వినండి సార్లూ!



ఇది మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి ఉన్నతపాఠశాలలోని ఓ తరగతి గది. లోపల గొడుగులు పట్టుకుని కూర్చుంది అక్కడి ఎనిమిదో క్లాసు విద్యార్థులు! పగుళ్లు తేలిపోయిన స్లాబు వర్షాలకు ఉరుస్తుండటంతో తడవకుండా ఉండేందుకు ఇలా గొడుగులు పట్టుకొని పాఠాలు వింటున్నారు. గోడలు కూడా చెమ్మ కక్కుతున్నాయి. క్లాసులో నీరు చేరడంతో పుస్తకాలు తడిసిపోతున్నాయని పిల్లలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటితో తడిసి క్లాస్‌రూంలోని టీవీ ఇప్పటికే చెడిపోయింది. ఈ బడి భవనం 18 ఏళ్ల కిందట కట్టారు. ఇక్కడ మొత్తంగా ఐదు తరగతుల్లో 55 మంది పిల్లలున్నారు. గదులు మాత్రం నాలుగే ఉన్నాయి. ఈ గదుల్లో ఎనిమిదో క్లాసు నడుపుతున్న గది ఉరుస్తుండటంతో పిల్లలకు సమస్యలెదురవుతున్నాయి. అదనపు గదులు లేకపోవడంతో ఉరుస్తున్న గదిలోనే పాఠాలు చెప్పాల్సి వస్తోందని ఉపాధ్యాయులు చెప్పారు. పాఠశాల పరిస్థితిపై ఎంఈవో మహేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా.. బడి భవనం మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. -నెన్నెల

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 25 జూలై 2024
diksuchi@andhrajyothy.com

ఐఐటీ ఢిల్లీలో ఈవీ డిజైనింగ్ కోర్సు



ప్రస్తుత వాతావరణ మార్పుల యుగంలో కర్బన ఉద్గారాలను తగ్గించడం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని నియంత్రించడంలో ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఈవీ), హైబ్రిడ్ ఎలక్ట్రికల్ వెహికిల్స్(హెచ్ఈవీ) క్రియాశీల పాత్ర పోషించను న్నాయి. వాతావరణంలో గ్రీన్ హౌజ్ వాయువులను తగ్గించడమే కాకుండా మరింత మెరుగైన రవాణా సదుపాయాలను ఈ విద్యుత్ వాహనాలు సమకూరుస్తు న్నాయి. పర్యావరణ స్థిరత్వాన్ని ప్రోత్స హించడంలో, గ్లోబల్ వార్మింగ్ ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో ఈ సాంకేతికతల ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీ... 'హైబ్రిడ్ వెహికిల్స్ డిజైన్'లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ని ప్రవేశపెట్టింది.

ఎలక్ట్రిక్ వెహికిల్స్ రంగంలో పనిచేయాలనుకునే ఇంజనీర్లు, ప్రొఫెషనల్స్‌కు ఈ కోర్సును ఉద్దేశించారు. సంప్రదాయ ఆటోమోటివ్ ఇంజనీరింగ్, త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న విద్యుత్ వాహనాల మధ్య ఉండే సంబంధం, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి అవసరమయ్యే పరిష్కారాలను ఈ కోర్సులో అధ్యయనం చేయవచ్చు.

భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదే..!

కార్ ఎడ్జ్ రిపోర్ట్-2024 ప్రకారం భారతదేశంలో 2023లో 1.53 మిలియన్ విద్యుత్ వాహనాలు విక్రయించారు. 'జేఎంకే రీసెర్చ్ అండ్ అనలిటిక్స్' వార్షిక నివేదిక ప్రకారం... కేవలం ఒక్క 'ఈ-కార్' సెగ్మెంట్‌లోనే 2022తో పోల్చితే 2023లో వీటి అమ్మకాలు 150 శాతం పెరిగాయి. ఈ ఏడాది వీటి విక్రయాలు 66 శాతం అధికంగా ఉండొచ్చని 'కౌంటర్ పాయింట్ రిపోర్ట్-2024' అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగానే దేశీయ వాహన కంపెనీలు, స్టార్టప్‌లు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) అభివృద్ధి, విడుదలకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. వచ్చే రెండు, మూడేళ్లలో పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ ఓఈఎం(ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్) భారత్‌లో తమ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తున్నాయి. దీంతో మధ్య, దీర్ఘకాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గణనీయంగా పెరగనుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2023 నాటికి రోడ్లపై నడిచే ద్విచక్ర, త్రిచక్ర వాహనాల్లో 80 శాతం; వాణిజ్య వాహనాల్లో 70 శాతం; కార్లలో 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలు ఉంటాయని భావిస్తున్నారు.

కరికులమ్

త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న ఆధునిక విద్యుత్ వాహనాల సాంకేతికను విద్యార్థులు అవగాహన చేసుకోవడం, వాటిలో తలెత్తే సంక్లిష్టతలను అధిగమించడం ప్రధాన లక్ష్యంగా ఢిల్లీ ఐఐటీ ఈ కోర్సుకు రూపకల్పన చేసింది. భవిష్యత్తులో వాహన రంగంలో చోటు చేసుకోబోయే పరిణామాలకు అనుగుణంగా మరిన్ని సుస్థిర రవాణా సౌకర్యాల కల్పన వైపునకు దారి చూపేలా కరికులమ్ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన FAME (ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్(హైబ్రిడ్ అండ్) ఎలక్ట్రిక్ వెహికిల్స్' స్కీమ్ లక్ష్యం నెరవేరడంలో ఈ కోర్సు దోహదకారిగా ఉపయోగపడుతుంది. మరో విధంగా చెప్పాలంటే ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీని పెంచి, పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యం. ఇక బోధన విషయానికొస్తే..ఐఐటీ ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబొలాజీ(సీఏఆర్‌టీ) ఫ్యాకల్టీ పాఠ్యాంశాలను బోధిస్తారు.

పాఠ్యాంశాలు: ఎలిమెంటరీ థర్మో డైనమిక్స్, ఇంటర్నల్ కంబ్యూసన్ ఇంజిన్స్(ఐసీఈ), ఆటోమోటివ్ హైబ్రిడైజేషన్ అండ్ ఎలక్ట్రిఫికేషన్(ఏహెచ్ఈ), ఎలక్ట్రిక్ మెషిన్స్, ప్రొపల్షన్ టెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ అండ్ బ్యాటరీ మోడల్లింగ్ అండ్ టెస్టింగ్

వీటిని నేర్చుకుంటారు

- డిజైన్ పారామీటర్స్‌ని గుర్తించడం, ఆపరేటింగ్ క్యారెక్టరిస్టిక్స్ - కంబ్యూసన్ ఇంజన్ పనితీరు కొలమానాలు
- హైబ్రిడైజేషన్ అండ్ ఎలక్ట్రిఫైయింగ్ వెహికిల్స్ మధ్య వ్యత్యాసాలు
- హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ అవసరాలు, వాటి పనితీరుపై అవగాహనతో పాటు... వీటి మధ్య భిన్న సాంకేతికతలను సమీకృత పరచడం.
- ఎలక్ట్రిక్ వెహికిల్స్, హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వల్ల ఉపయోగాలు
- ఎలక్ట్రిక్, హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్‌లలో సాధారణంగా ఉపయోగించే పవర్ ఎలక్ట్రానిక్స్ డ్రైవ్ సిస్టమ్స్‌ని కనుగొనడం

ప్రోగ్రామ్ హైలెట్స్

- లైవ్ ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణ
- ఐఐటీ ఢిల్లీ ఫ్యాకల్టీ మెంటార్‌గా వ్యవహరిస్తున్న 'క్యాప్‌స్టోన్ ప్రాజెక్టు'లో పాల్గొనే అవకాశం ఉంటుంది. తద్వారా అభ్యర్థులు చేసే పరిశోధనకు నిపుణుల మార్గదర్శకత్వం, సహాయసహకారాలు లభిస్తాయి.
- ఈ ప్రోగ్రామ్ కీలక విభాగం క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్. కాబట్టి విద్యార్థులు తాము నేర్చుకున్న నైపుణ్యాలను అనువర్తింప చేయడానికి, హెచ్ఈవీ డిజైనింగ్ రూపకల్పనలో వారి నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఈ ప్రాజెక్టు ద్వారా అవకాశం లభిస్తుంది.
- యూకేలోని ఫోర్డ్, డైసన్ వంటి దిగ్గజ వాహన పరిశ్రమల సహకారంతో రెండేళ్లు విజయవంతంగా కోర్సును నిర్వహించిన డైరెక్టర్ల పర్యవేక్షణలో నైపుణ్యాలను మెరుగుపర్చుకునే అవకాశం లభిస్తుంది.
- ఆటోమోటివ్ ఇండస్ట్రీలోని ప్రొఫెషనల్స్ నెట్‌వర్క్‌తో అనుసంధానం ఏర్పడుతుంది

కోర్సులో ఎవరు చేరొచ్చు?

- మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమోటివ్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసి ఈవీ/హెచ్ఈవీ రంగంలో మంచి కెరీర్‌ను ఆశించేవాళ్లు.
- ట్రెడిషనల్ ఇంటర్నల్ కంబ్యూసన్ ఇంజన్ టెక్నాలజీ నుంచి ఈవీ/హెచ్ఈవీ టెక్నాలజీకి షిఫ్ట్ కావాలనుకునే వారు.
- ఈవీ/హెచ్ఈవీలో మరింతగా ఎదగాలనుకునే ప్రొఫెషనల్స్

ముఖ్య సమాచారం

- కోర్సు వ్యవధి: ఆరు నెలలు. లైవ్ ఆన్‌లైన్ క్లాసులు
- ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,10,000(జీఎస్‌టీ సహా)
- అర్హత: మెకానికల్/ఎలక్ట్రికల్/ఆటోమోటివ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ/కనీసం 40 శాతం మార్కులతో డిప్లొమా హోల్డర్స్
- టెక్నికల్ ఓరియెంటేషన్: 2024 సెప్టెంబరు 29
- తరగతులు ప్రారంభం: 2024 అక్టోబరు 13
- వెబ్‌సైట్: https:// iit-delhi.emeritus.org/



పారామెడికల్‌లో డిప్లొమా కోర్సులు



విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్(ఏపీఎస్ఏహెచ్‌పీసీ)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు అందిస్తున్న వివిధ పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఒక్కో డిప్లొమా కోర్సు వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో మొత్తం 1002 సీట్లు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లోని సీట్ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రభుత్వ కళాశాలల్లో నిర్దేశిత జిల్లాల(లోకల్) అభ్యర్థులకు 85 శాతం సీట్లు, ఇతర జిల్లాల(నాన్ లోకల్) అభ్యర్థులకు 15 శాతం సీట్లు ప్రత్యేకించారు. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం గవర్నమెంట్ కోటా సీట్లు, 40 శాతం మేనేజ్‌మెంట్ కోటా సీట్లు ఉంటాయి. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిగా నింపి ప్రింట్ తీసుకోవాలి. ప్రభుత్వ వైద్య కళాశాలలకు అప్లయ్ చేసుకొనేవారు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు, ప్రైవేట్ కళాశాలలకు దరఖాస్తు చేసుకొనేవారు సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయానికి తమ దరఖాస్తులు పంపాలి.

పారామెడికల్ డిప్లొమా కోర్సులు

- డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ)
- డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ(డీఎంఐటీ)
- డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్(డీఓఏ)
- డిప్లొమా ఇన్ డయాలసిస్ టెక్నాలజీ (డీడీఐఏఎల్‌వై)
- డిప్లొమా ఇన్ రెస్పిరేటరీ థెరపీ(డీఆర్‌ఈఎస్‌టీ)
- డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ(డీఎంఎస్‌టీ)
- డిప్లొమా ఇన్ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ (డీఈఆర్ఎఫ్‌యూ)
- డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రిక్ టెక్నీషియన్ కోర్సు (డీఓటీ)
- డిప్లొమా ఇన్ రేడియోథెరపీ టెక్నాలజీ(డీఆర్‌టీటీ)
- డిప్లొమా ఇన్ రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్ (డీఆర్‌జీఏ)
- డిప్లొమా ఇన్ డార్క్ రూం అసిస్టెంట్(డీడీఆర్ఏ)
- డిప్లొమా ఇన్ కార్డియాలజీ టెక్నీయన్ కోర్సు (డీకార్డియో)
- డిప్లొమా ఇన్ క్యాత్ ల్యాబ్ టెక్నాలజీ(డీసీఎల్‌టీ)
- డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ కోర్సు (డీఈసీజీ)
- డిప్లొమా ఇన్ అనెస్తీషియా టెక్నీషియన్ కోర్సు (డీఏఎన్ఎస్)
- డిప్లొమా ఇన్ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మేల్) కోర్సు(డీఎంపీహెచ్ఏ)

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్(బైపీసీ/ఎంపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇతర గ్రూప్‌ల అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. బైపీసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే ఎంపీసీ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇంకా సీట్లు ఉంటే ఇతర గ్రూప్‌ల అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. లాంగ్వేజ్‌లు మినహా గ్రూప్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు; ఆధార్ కార్డ్; కులం, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలు
- **కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు:** ఆగస్టు 19
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన కౌన్సిల్ ఫీజు:** రూ.200
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 18 నుంచి
- **వెబ్‌సైట్:** apsahpc.co.in

ప్రభుత్వ వైద్య కళాశాలలు-సీట్లు-నిర్దేశిత జిల్లాలు

- విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో 141 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు వస్తాయి.
- కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో 101 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు వస్తాయి.
- విజయవాడలోని సిద్దార్థ మెడికల్ కాలేజీలో 70 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి కృష్ణా జిల్లా వస్తుంది
- గుంటూరు మెడికల్ కాలేజీలో 115 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి గుంటూరు, ప్రకాశం జిల్లాలు వస్తాయి.
- తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీలో 60 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాలు వస్తాయి.
- కడపలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో 120 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి వైఎస్సార్ కడప జిల్లా వస్తుంది
- కర్నూలు మెడికల్ కాలేజీలో 121 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి కర్నూలు జిల్లా వస్తుంది.
- అనంతపురంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో 72 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి అనంతపురం జిల్లా వస్తుంది.
- శ్రీకాకుళంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో 205 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి శ్రీకాకుళం జిల్లా వస్తుంది.

కోర్టు రూముల నుంచి క్లాస్ రూమ్స్‌కు
సింధూర రెడ్డికి రైస్ వర్సిటీ స్కాలర్‌షిప్

హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది చెరుకు సింధూర రెడ్డి అమెరికాలోని రైస్ యూనివర్సిటీకి చెందిన జోన్స్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ప్రముఖ ఫోర్బ్స్ మేగజైన్ 'న్యూ ఐవీస్' జాబితాలోని వర్సిటీలలో రైస్ యూనివర్సిటీ ప్రముఖమైనది. సింధూర రెడ్డికి ఈ యూనివర్సిటీ ఎంబీఏ కోర్సులో చేరేందుకు ఫుల్ స్కాలర్‌షిప్‌ని మంజూరు చేసింది. ఆమె జీఆర్‌ఈలో మంచి స్కోరు సాధించారు. దీనితోపాటు ఆమె వృత్తి నేపథ్యం, మంచి అకడమిక్ రికార్డు, నాయకత్వ స్థాయి సామర్థ్యాలు వంటి అంశాలు సింధూర రెడ్డి స్కాలర్‌షిప్ దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడంలో దోహదపడ్డాయి. అయినప్పటికీ ఇంటర్వ్యూ ప్రక్రియ కొంత కఠినంగానే కొనసాగింది. లా నుంచి బిజినెస్ వైపునకు మారడానికి గల తన ఆకాంక్షను ప్రభావపూరితంగా వివరించడంతో ఇంటర్వ్యూ విజయవంతంగా పూర్తయ్యింది. నాయకత్వ పటిమను పెంచుకోవడానికి, బిజినెస్ వ్యవహారాలను సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి తనకు ఈ కోర్సు ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. ఎంబీఏ చదవాలనుకునే విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియను ముందుగానే మొదలు పెట్టాలని, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ)లో ప్రామాణికతను కొనసాగించాలని, పూర్వ విద్యార్థులతో ప్రస్తుత విద్యార్థులు నెట్‌వర్క్‌ను కొనసాగించాలని, అవసరమైతే అలూమ్నీ సహకారం తీసుకోవాలని ఆమె సూచించారు. ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు లింక్డ్‌ఇన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తానని సింధూర రెడ్డి తెలిపారు.



నిమ్స్‌లో ఎమ్మెస్సీ జెనెటిక్ కౌన్సెలింగ్

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- ఎమ్మెస్సీ(జెనెటిక్ కౌన్సెలింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ(లైఫ్ సైన్సెస్/నర్సింగ్/హ్యూమన్ జెనెటిక్స్/హ్యూమన్ బయాలజీ/మెడికల్ బయోటెక్నాలజీ/మాలిక్యులర్ బయాలజీ)/బీటెక్(బయోటెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్/బయో మెడికల్ ఇంజనీరింగ్/బయలాజికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎంబీబీఎస్ పూర్తిచేసి ఎంసీఐ గుర్తింపు ఉన్నవారు, బీడీఎస్ ఉత్తీర్ణులై డీసీఐ గుర్తింపు పొందినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 35 ఏళ్లు మించకూడదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్

ఈ పరీక్షలో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. లైఫ్ సైన్సెస్, బేసిక్ జెనెటిక్స్, సెల్ బయాలజీ అండ్ డివిజన్, సైటోజెనెటిక్స్, మాలిక్యులర్ జెనెటిక్స్, రీసెర్చ్ మెథడాలజీ, పాపులేషన్ జెనెటిక్స్, సైకో సోషల్ అండ్ ఎథికల్ ఇష్యూస్ ఇన్ మెడిసిన్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 10
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **ఈ మెయిల్/లాగిన్ అకౌంట్ ద్వారా హాల్ టికెట్‌లు పంపే తేదీ:** ఆగస్టు 16
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 20
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 21న
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in



లిటిల్స్



కోటి రూపాయల కుండలు


ధర్మపురంలో కేశవయ్య అనే వ్యాపారి ఉండేవాడు. అతని వద్ద ఒక ముసలి ఏనుగు ఉండేది. ఆ ఊరి జనం పండగలు, పెళ్లిళ్లు, తిరునాళ్లు, ఊరేగింపులకు ఆ ఏనుగును అద్దెకు తీసుకొని, కేశవయ్యకు డబ్బు చెల్లిస్తూ ఉండేవారు. ఒక రోజు రామయ్య తన కొడుకు పెళ్లి అని ఆ ఏనుగును అద్దెకు తీసుకున్నాడు. ఊరేగింపు జరిగినంత సేపూ ఏనుగు బాగానే ఉండి, చివరలో అనారోగ్యానికి గురై కిందపడి, అక్కడే చనిపోయింది. రామయ్య ఈ విషయం వెంటనే కేశవయ్యకు చెప్పి, దాని ధర ఎంతో చెల్లిస్తాననీ, ఏనుగు అంత్య క్రియలు కూడా తానే చేస్తాననీ, ఎంత చెప్పినా కేశవయ్య వినకుండా, దానిని నేను చాలా ఇష్టంగా పెంచుకున్నాను. నాకు నా ఏనుగును తెచ్చివ్వు లేదా నీ ఆస్తి మొత్తం నాకు రాసివ్వు అని గొడవ చేసాడు. చుట్టూ ఉన్నవారు ఈ విషయం పంచాయితీ పెద్దకు ఫిర్యాదు చేయడం మంచిది అని సలహా ఇచ్చారు. అలాగే అని కేశవయ్య వెళ్లి పంచాయితీలో విషయమంతా చెప్పాడు అంతా విన్న పంచాయితీ పెద్ద, కేశవయ్యను వెళ్లి రామయ్యను వెంటనే పిలుచుకొస్తే విచారణ చేస్తాననీ, చెప్పి పంపాడు. కేశవయ్య రామయ్య ఇంటికి వచ్చి, తలుపు గడియ వేసి లేకపోవడంతో తలుపును ఒక్కసారిగా తోశాడు. ఆ దెబ్బతో తలుపుకు ఆనుకుని ఉన్న కుండల దొంతర కిందపడి కుండలన్నీ పగిలి పోయాయి. పగిలిన కుండలను చూసుకుంటూ రామయ్య ఇవి నాకెంతో ఇష్టమైన కుండలు, ఇపుడు నీ వల్ల పగిలి పోయాయి. 'వీటికి కోటి రూపాయలు నష్ట పరిహారం కట్టు' అని గొడవ చేసాడు ఆ మాటలకు కేశవయ్య 'ఏమిటీ కుండలకు కోటి రూపాయలా? ఇదేమన్న న్యాయంగా ఉందా?' అని అడిగాడు. 'మరి ముసలి ఏనుగుకు నా ఆస్తి మొత్తం రాసిమ్మనడం మాత్రం న్యాయంగా ఉందా కేశవయ్యా?' అన్నాడు రామయ్య. వెంటనే కేశవయ్యకు విషయం అర్థమైపోయి, రామయ్య ఇచ్చిన సొమ్ము తీసుకుని, ఏనుగు విషయం వదలివేశాడు.


10 తేడాలను గుర్తించండి?





ఏది ఎక్కడ





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 367

		6	3		
					5
	1		2		
		4		5	
4					
		3	1		

సుడోకు - 366 సమాధానం

8	3	1	6	7	5	4	9	2
6	7	4	9	3	2	1	5	8
5	2	9	1	8	4	3	7	6
1	6	5	3	4	8	7	2	9
3	9	8	7	2	1	6	4	5
7	4	2	5	6	9	8	1	3
2	8	3	4	5	7	9	6	1
4	1	6	2	9	3	5	8	7
9	5	7	8	1	6	2	3	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.